





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 58 | సోమవారం | 26-01-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00




# ఐదుగురికి పద్మవిభూషణ్

- 13 మందికి పద్మభూషణ్ , 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు
- తెలంగాణ నుంచి ఏడుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి నలుగురికి పద్మశ్రీలు


మురళీ మోహన్ రాజేంద్ర ప్రసాద్


దీపికా రెడి చంద్రమౌళి విజయ్ ఆనంద్ రెడ్డి

02

### ఎపి నుంచి...

1. గద్దె బాబు రాజేంద్ర ప్రసాద్ – కళారంగం
2. గరిమెల్ల బాలకృష్ణ ప్రసాద్ (మరణానంతరం) – కళారంగం
3. మాగంటి మురళీ మోహన్ – కళారంగం
4. వెంపటి కుటుంబ శాస్త్రి – సాహిత్యం, విద్య

### తెలంగాణ నుంచి....

1. గడ్డమానుగు చంద్రమౌళి – శాస్త్ర, సాంకేతికం
2. దీపికా రెడ్డి – కళారంగం
3. గుడూరు వెంకట్రావు – వైద్యం
4. కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణియన్ – శాస్త్ర, సాంకేతికం
5. కుమారస్వామి తంగరాజ్– శాస్త్ర, సాంకేతికం
6. విజయ్ ఆనంద్ రెడ్డి – వైద్యం
7. మామిడి రామారెడ్డి (మరణానంతరం) – పశుపోషణ

# విద్య, వైద్యానికి బడ్జెట్ పెంచాలి

- మహిళా హక్కులను బిజెపి సర్కారు కాలరాస్తోంది
- మహిళలకు ఉపాధి కల్పించే ఎంజి నరేగాను నిర్వీర్యం చేసింది
- నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోదీ విశ్వగురువు కాలేరు
- ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు విమర్శ



ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషాసిద్ధు విమర్శించారు. మహిళల నుంచి నాణ్యమైన విద్యను, వైద్యాన్ని దూరం చేస్తోందని దుయ్యబట్టారు. రానున్న కేంద్ర బడ్జెట్‌లో వైద్యం, విద్య రంగాలకు బడ్జెట్‌ను పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా తరువాయి 2లో



# అగ్నికీలల్లో ఆ ఐదుగురు ఆహుతి

- నాంపల్లిలోని ఫర్నీచర్ షాప్ అగ్నిప్రమాద ఘటనలో
- 22 గంటలపాటు సాగిన సహాయక చర్యలు
- ఐదుగురి మృతదేహాలు వెలికితీత
- ఫర్నీచర్ మాల్ యజమాని అరెస్ట్
- మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాపక్షం/హైదరాబాద్

నాంపల్లిలోని ఫర్నీచర్ మాల్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ఐదుగురు మృతి చెందారు. మృతుల్లో కర్ణాటకకు చెందిన వాచ్‌మెన్ సమీర్ తల్లి బీబీ అమ్మ (60), నాంపల్లికి చెందిన యాదయ్య కుమారులు అఖిల్ (7), ప్రణీత్ (11), నాంపల్లికి చెందిన మహమ్మద్ ఇంతియాజ్ (31), రాజేంద్రనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ హబీబ్ (32) ఉన్నారు. శనివారం మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమైన అగ్నిప్రమాద సహాయక చర్యలు ఆదివారం ఉదయం 11 గంటల వరకు కొనసాగాయి. భవనంలోని మొదటి సెల్లార్‌లో ఉన్న వాచ్‌మెన్ గదిలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు అధికారులు విఫలయత్నం చెందారు. మరుసటి రోజు కూడా భవనంలో అగ్నికీలలు ఆవరించి ఉండడంతో జెసిబి యంత్రాల సహాయంతో అధికారులు రెండు గంటలు శ్రమించి సెల్లార్ గోడలు పగులగొట్టారు. అనంతరం ప్రత్యేక యంత్రాలు, ఆక్సీజన్ మాస్క్‌తో అగ్నిమాపక సిబ్బంది సెల్లార్‌లోకి వెళ్లి చూడగా అక్కడ ఐదుగురి మృతదేహాలు పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. ఈ ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురి మృతదేహాలను వెలికి తీసి ఉస్మానియా మార్చురిలో పోస్టుమార్టం అనంతరం వారి తరువాయి 2లో

# రాజ్యాంగం అంటే కాగితాల పుస్తకం కాదు

- దానిపై బుల్డోజర్‌ను ప్రయోగించడం అంటే మానవ హక్కులను ధ్వంసం చేయడమే
- బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను తరిమికొట్టాలి
- ఐద్వా జాతీయ ప్యాట్రన్, ఎంపి బృందాకరత్ పిలుపు



03

# నీటిగుంతలో పడి ముగ్గురు చిన్నారులు మృతి

నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలో ఘటన



ప్రజాపక్షం/కల్వకుర్తి

నీటిగుంతలోపడి ముగ్గురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లో చదువుతున్న ముచ్చర్లపల్లి గ్రామానికిచెందిన శ్రీకాంత్ రెడ్డి కుమార్తె మధుశ్రీకృతి(14)(సిరి), కుమారుడు మధుశ్రీ మాన్య (11), శ్రీకాంత్‌రెడ్డిసోదరి చంద్రకళ ప్రభాకర్‌రెడ్డి కుమార్తె ఎడ్మస్నేహ(15) సెలవులు ఉండటంతో సొంతగ్రామానికి వచ్చారు. ఆదివారం వీరందరూ శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి సమీపంలో ఉన్న వేణుగోపాల్‌రెడ్డి అనేరైతు వ్యవసాయ పొలంవద్దకు వెళ్లారు. ఆడుకుంటున్న సమయంలో వ్యవసాయపొలంలో ఉన్న తరువాయి 2లో







ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
26-01-2026
www.prajapaksham.in


# చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే.. కెనడాపై 100 శాతం సుంకం: ట్రంప్

**వాషింగ్టన్ :** చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే నూటికి నూరుశాతం సుంకాలు విధిస్తామని కెనడా ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శనివారం సోషల్ మీడియా ద్వారా తాజా హెచ్చరిక జారీ చేశారు. ఏడాది క్రితం ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి కెనడా–అమెరికా మధ్య సంబంధాలు గణనీయంగా దెబ్బతిన్నాయి. చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకుంటే ఆ దేశం కెనడాను పూర్తిగా నమిలి మింగేస్తుందని, చైనా వస్తువులను కెనడాలో దించి ఆ సరిహద్దులోంచి అమెరికాలోకి తరలించి (డ్రాప్ ఆఫ్ పోర్ట్) తమ దేశాన్ని కలుషితం చేయాలని ప్రయత్నిస్తున్నారని ట్రంప్ విరుచుకుపడుతున్నారు. ఇలాంటి తప్పిదాలకు పాల్పడితే తమ దేశంలోకి దిగుమతయ్యే అన్ని రకాల కెనడా ఉత్పత్తులపై 100 శాతం సుంకాలు విధిస్తామని సోషల్ మీడియా వేదికగా ట్రంప్ తాజా హెచ్చరిక చేశారు. కెనడా–గ్రీన్‌లాండ్–వెనిజులా భూభాగాలలో అమెరికా జెండా పాతి ఉన్న వీడియోలను కూడా ఈ వారంలో ట్రంప్ షేర్ చేశారు. ప్రపంచ క్రమాన్ని ట్రంప్ దెబ్బతీస్తున్నారంటూ ఆయన పేరు ప్రస్తావించకుండా గడచిన మంగళవారం కెనడా ప్రధానమంత్రి దావోస్ వేదికగా చేసిన ప్రసంగం అక్కడ



హాజరైన సభ్యుల స్టాండింగ్ ఒవేషన్ (నిలబడి హర్షధ్వానాలు చేయడం)తో మారుమోగిపోవడం ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో గాజా పీస్ ఆఫ్ బోర్డులో చేరాల్సిందిగా మార్క్ కార్నీకి ఇచ్చిన ఆహ్వానాన్ని ట్రంప్ ఉపసంహరించుకున్నారు.అమెరికాలో 51వ రాష్ట్రంగా చేరిపోవాలని కెనడా పాలకుడిని ట్రంప్ ఇప్పటికే ఎద్దేవా చేశారు. కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీని చాలాసార్లు ఆయన ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకునే గవర్నర్ అంటూ సంబోధించి అవమానించారు. అమెరికాలోకి కెనడా నుండి విపరీతంగా వలసలు వస్తూ ఉండటంతో ఇక కెనడా ఒక దేశంగా ఉండకుండా అమెరికాలో ఒక రాష్ట్రంగా చేరిపోవాలని ఎగతాళి చేశారు. అమెరికా అనుసరిస్తున్న వాణిజ్య విధానాలను మార్క్ కార్నీ ప్రశ్నించడంతో ఆ దేశంపై విపరీతంగా సుంకాలు పెంచారు. ఈ నేపథ్యంలో మార్క్ కార్నీ చైనా వైపు మొగ్గుచూపారు. ''కార్నీ..అమెరికాపై ఆధారపడి అమెరికా కారణంగానే కెనడా మనుగడ సాగిస్తోంది, ఈసారి మీరు ఏదైనా ప్రకటన చేసేటప్పుడు ఆ విషయం గుర్తుంచుకోండి'' అని దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక నుండి ట్రంప్ హెచ్చరించారు. ఆ మరునాడే మార్క్ కార్నీ మరో ప్రకటన చేస్తూ, అమెరికాపై ఆధారపడి కెనడా జీవించడంలేదని స్పష్టం చేశారు. ఈ విధంగా అమెరికా–కెనడా మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఐతే చైనా వాణిజ్యంతో సంబంధం ఉన్న శాఖ పర్యవేక్షణ చేస్తున్న కెనడా మంత్రి డొమినిక్ లేబ్లాంక్ మాత్రం ట్రంప్ విమర్శలను ఘాటుగా తిప్పికొట్టారు. చైనాతో వాణిజ్య ఒప్పందాలు జరగలేదని, కొన్ని ముఖ్యమైన సుంకాల సమస్యలను పరిష్కరించుకున్నామని ఆయన తెలియజేశారు.

# సురక్షిత బంకర్‌లోకి ఖమేనీ!

**టెహ్రాన్:** అమెరికా విమానవాహక యుద్ధ నౌకలు గల్ఫ్ ప్రాంతానికి చేరుకోవడంతో ఇరాన్‌పై దాడులు జరుగుతాయన్న ఆందోళన పెరిగింది. ఈ నేపథ్యంలో ఇరాన్ సర్వాధినేత ఆయెుతొల్లా అలీ ఖమేనీని రక్షణ అధికారులు ఒక సురక్షితమైన బంకరులో ఉంచినట్లు నివేదికలు తెలియజేశాయి. అమెరికా ఎలాంటి కవ్వింపు చర్యలకు పాల్పడినా, ప్రత్యక్ష దాడి సంకేతాలు పంపినాగానీ పూర్తిస్థాయి యుద్ధం చేయడానికి ఇరాన్ గార్డులు సిద్ధమయ్యారు.
దేశంలోని అన్ని రంగాలను యు ద్ధ వాతావరణానికి అనుకూలంగా సన్నద్ధం చేసి ఉంచడంతో సర్వాధినేత ఖమేనీని అజ్ఞాతంలో ఒక బంకరులో ఉంచారు. ఖమేనీ కార్యాలయం నిర్వహించే బాధ్యతలన్నీ తాత్కాలికంగా ఆయన కుమారుడు ఆయతుల్లా అలీ ఖమేనీ స్వాధీనం చేసుకున్నారు. ఖమేనీపై దాడి జరిగితే దానిని పూర్తిస్థాయి యుద్ధంగా పరిగణిస్తామని ఇరాన్ ఇప్పటికే పలుసార్లు అమెరికాకు హెచ్చరిక చేసిం ది. ఇరాన్‌లో డిసెంబరు చివరిలో ప్రారంభమైన ప్రజా ఉద్యమానికి అమెరికా మద్దతు ఇవ్వడంతో ఈ రెండు దేశాలమధ్య తాజా వివాదం చెలరేగింది.

**ఇరాన్ అల్లర్లలో 36,500 మంది మృతి?**

ఇరాన్‌లో గత ఏడాది డిసెంబరు 28 నుండి ఇప్పటివరకూ ప్రపంచం ఊహకు అందని రీతిలో 36,500 మంది మరణించారా? ఇంకా ధృవీకరించని నివేదికలు ఈ విషయాన్నే చెబుతున్నాయి. ఒకవేళ ఈ నివేదికకు ధృవీకరణ లభిస్తే, ఇరాన్ చరిత్రలో ఈ కరెన్సీపతన వ్యతిరేక నిరసన ఉద్య మం అత్యంత దారుణమైన మారణహోమంగా మిగిలిపోతుంది. ఇరాన్ వ్యాప్తంగా 400 నగరా లు, పట్టణాలు, గ్రామాల్లో ఉన్న 4000 ప్రాంతాలలో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. ముఖ్యం గా జనవరి 8,9 తేదీలలో ఇరాన్ ప్రభుత్వం చేపట్టిన దారుణ అణచివేతలో 36,500 మంది ప్రదర్శకులు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రభుత్వ పత్రాలు, ఇతర సాక్ష్యాలను సమీక్షించిన ''ఇరాన్ ఇంటర్నేషనల్ ఎడిటోరియల్ బోర్డు'' ప్రకటించింది. ఐతే ఈ నివేదికను అధికారికంగా ధృవీకరించలేదు.
ఇరాన్ భద్రతా ఏజన్సీలు, క్షేత్రస్థాయి నివేదికల ప్రకారమే రెండు రోజుల్లో 12,000 మంది మరణించినట్లు ధృవీకరణ ఉంది. ఈ ఏడాది జనవరి 21న ఇరాన్ పార్లమెంటుకు ఇచ్చిన నివేదిక ప్రకారం, మరణాల సంఖ్య 27,500 నుండి ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్‌కు ఇచ్చిన నివేదికలో 36,500 కంటే ఎక్కువగా ఉందని ఇంటర్నేషనల్ ఎడిటోరియల్ బోర్డు చూసిన పత్రాలు వెల్లడించాయి. ఇస్లామిక్ రిపబ్లిక్‌లో దాదాపు 400 గంటలకు పైగా విద్యుత్, ఇంటర్నెట్ సదుపాయాలు ప్రజలకు అందుబాటులో లేవు.

# మిన్నెసోటాలో మరొకరిని కాల్చి చంపిన ఐసిఇ ఏజెంట్

**మిన్నెపొలిస్ :** మిన్నెసోటా నుండి వలస ప్రజలను వెళ్లగొట్టేందుకు ట్రంప్ పంపించిన ఐసిఇ ఏజంట్లు మరో స్థానికుడిని కాల్చి చంపడంతో అక్కడ కొనసాగుతున్న నిరసనలు, ప్రజాగ్రహం పరాకాష్ఠకు చేరుకుంది. మిన్నెపొలిస్ నగరంలో అమెరికా పౌరుడు అలెక్స్ ప్రెట్టీ (37)ని ఫెడరల్ ఏజెంట్లు ఆదివారం కాల్చి చంపారు. ఆయన మిన్నెపొలిస్ వెటరన్స్ ఎఫైర్స్ ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. ఈ ఘటనపై తక్షణం దర్యాప్తు జరపాలని డెమొక్రటిక్‌పార్టీ చట్టసభ్యులు డిమాండ్ చేశారు. ఐతే అతడు తమపై దాడికి యత్నించాడని వారు ఆరోపిస్తున్నారు. ప్రదర్శకులు తమ వేళ్ల కొరికేశారని అధికారులు ఆరోపిస్తున్నారు. అలెక్సీ ప్రెట్టీ బంధువులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆయనకు గన్ లైసెన్సు ఉందని, ఏనాడూ ఆయన తనవెంట గన్ తీసుకువెళ్లలేదని వివరణ ఇచ్చారు. మృతుడు అలెక్సీ ఆ ప్రాంతంలో ఎంతో కరుణా హృదయుడుగా పేరు పొందడంతో ప్రజలు ఆయన మరణంతో ఆగ్రహం చెందుతున్నారు. హోంలాండ్ భద్రతామంత్రి క్రిస్టీ నోయిమ్ మాట్లాడుతూ, అలెక్స్ ప్రెట్టీ హింసకు పాల్పడేందుకు యత్నించగా అధికారులు ఆత్మరక్షణకోసం కాల్పులు జరిపారని వివరణ ఇచ్చారు. మిన్నె



సోటా గవర్నర్ టిమ్ వాల్జ్ అవన్నీ వట్టి కల్పిత కథలని విమర్శించారు. ఈనెలారంభంలో రెనీగుడ్ (37) అనే మహిళను వలసల నిర్మూలన అధికారులు అతి సమీపంనుండి కాల్చి చంపడంతో మిన్నెసోటా అంతటా గడచిన 20 రోజులుగా వేలాదిమంది నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. తక్షణం నేషనల్ గార్డ్సను, ఫెడరల్ అధికారులను మిన్నెసోటా నుండి బయటకు పంపేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వారి డిమాండ్‌కు మిన్నెసోటా గవర్నర్ టిమ్ వాల్జ్ గట్టి మద్దతు ఇస్తున్నారు. స్థానికంగా మిన్నెసోటా ప్రభుత్వం అల్లరిమూకలను వెనకేసుకొస్తోందని, అందుకే వారు రెచ్చిపోయి చట్టబద్ధ కార్యకలాపాలు జరగకుండా అడ్డుకుంటున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మిన్నెసోటా స్థానిక ప్రభుత్వం ఆందోళనకారులకు మద్దతు ఇవ్వడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ట్రంప్ విమర్శించారు. అమెరికా రక్షణమంత్రి పెటా హెగ్సెత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసిఇ) ఏజంట్లకు మద్దతు ఇచ్చారు. ''దేశభక్తులకు కృతజ్ఞతలు, మీరు దేశాన్ని కాపాడుతున్నారు, మీకు మేం నూటికి నూరుశాతం మద్దతు ఇస్తున్నాం, మిన్నెసోటాలో పాలకులు సిగ్గుపడాలి, వారు వీధుల్లో పిచ్చివాళ్ళలా ప్రవర్తిస్తున్నారు'' అని ధ్వజమెత్తారు. మిన్నెసోటా వీధుల్లో వలసలు వచ్చిన నేరగాళ్ళు విచ్చలవిడిగా తిరుగుతున్నారని ఫెడరల్ అధికారులు ఆరోపిస్తుండగా, ట్రంప్ మిన్నెసోటాను రణరంగంగా మారుస్తున్నారని స్థానిక గవర్నర్ టిమ్ వాల్జ్ విమర్శించారు. మిన్నెపొలిస్ మేయర్ జాకబ్ ఫ్రే ఆదివారం మధ్యాహ్నం పాత్రికేయులతో మాట్లాడుతూ, నేషనల్ గార్డులు స్థానిక పోలీసులకు సహాయం చెయ్యాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇద్దరు స్థానికులు ఐసిఇ అధికారుల కాల్పుల్లో నిర్దాక్షిణ్యంగా మరణించారని, అందువల్ల స్థానిక ప్రజల ఆవేదన, వారి భావోద్వేగాలను అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

# మయన్మార్‌లో మూడోదశ పోలింగ్.. భారత్‌సహా పలువురు పరిశీలకులు హాజరు

**యాంగాన్ :** మయన్మార్‌లో తుది విడత (మూడోవిడత) సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఆదివారం ముగిసింది. వచ్చేనెల రెండోవారం నాటికి ఎన్నికల ఫితాలు వెలువడతాయి. ఈ ఎన్నికల్లో జుంటా సైనిక పాలకులు మద్దతు ఇస్తున్న నేషనల్ ఇంట్రెస్ట్ డవలప్‌మెంట్ పార్టీ (ఎన్ఐడిపి) ఏకపక్షంగా ఎన్నికల్లో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. ఈ తుది విడత పోలింగ్ ప్రక్రియను చూసేందుకు భారత్ సహా కొందరు అంతర్జాతీయ పరిశీలకులు కూడా యాంగాన్‌కు వచ్చారు. ఎన్నికల సంఘం ఛైర్మన్ యూథాన్ సోయీ, యాంగాన్ ప్రాంతీయ మంత్రులు అంతర్జాతీయ పరిశీలకులకు ఆహ్వానం పలికి దగ్గరుండి వారికి పోలింగ్ బూత్‌లను చూపించారు. బెలారస్, కాంబోడియా, నేపాల్, ఇండోనేసియా, వియత్నాం, నికరాగువా, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఏసియన్ పొలిటికల్ పార్టీస్ (ఐసిఎపి) ప్రతినిధులు ఈ బృందంలో ఉన్నారు. మయన్మార్ ఎన్నికల సంఘం అధికారులు, మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా



ఆరు రాజకీయపార్టీలు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, 24.22 మిలియన్ల ఓటర్లు ఈ పోలింగ్‌లో పాల్గొనేందుకు అర్హులుగా ఉన్నారని అంతర్జాతీయ పరిశీలకులకు అధికారులు తెలియజేశారు. రాష్ట్రం, ప్రాంతీయస్థాయిల్లో 51 పార్టీలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, ఈ విధంగా మొత్తం దేశ,రాష్ట్ర,స్థానిక స్థాయిల్లో 57 పార్టీలు ఈ ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటున్నాయని మయన్మార్ పాలక ప్రతినిధులు, ఎన్నికల అధికారులు తెలియజేశారు.వివిధ పార్టీలు 60 రోజుల పాటు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నాయని తెలియజేశారు. ఓటింగ్ యంత్రాల ద్వారా చాలా ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ ఇప్పటివరకూ జరిగిందని అధికారులు తెలియజేశారు.

# బంగ్లాదేశ్‌లో మైనారిటీ యువకుడిని సజీవ దహనం

**ఢాకా :** బంగ్లాదేశ్‌లో మైనార్టీ వర్గానికి చెందిన మరో హిందూ యువకుడిని సజీవ దహనం చేశారు. జమాత్–ఎ–ఇస్లామీ పార్టీపై ఉన్న ఆంక్షలు ఎత్తివేసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనుమతి ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్‌లో మైనారిటీల హత్యలు పెరుగుతున్నాయి. ఢాకా సమీపంలోని నార్సింగ్డి జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఒక దుకాణంలో చంచల్ భౌమిక్ (23) అనే యువకుడు నిద్రిస్తున్న సమయంలో అల్లరి మూకలు అర్థరాత్రి దుకాణంపై దాడి చేశాయి. బయట నుండి దుకాణం తలుపులు మూసివేసి పెట్రోలు పోసి దుకాణాన్ని దగ్ధం చేశాయి. దీంతో ఆ యువకుడు దుకాణంలోపలే సజీవదహనమయ్యాడు. అధికారులు నిందితులకోసం పెద్ద ఎత్తున గాలింపు ప్రారంభించారు. ఈ గాలింపు చర్యల్లో స్థానికంగా ఉన్న స్వచ్ఛంద సేవకులు సహకరిస్తున్నారు. గడచిన ఆగస్టు నెల నుండి బంగ్లాదేశ్‌లో మైనార్టీలను ఉద్దేశపూర్వకంగా హత్యలు చేస్తున్నారని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కానీ హిందూ మైనారిటీలను మతం పేరుతో హత్య చేసినట్లు ఎలాంటి ఆధారాలూ లేవని యూనుస్ తాత్కాలిక ప్రభుత్వం ప్రకటించింది.

## బడ్జెట్ పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సదాలక్ష్మి, ఉపాధ్యక్షులు ఎస్.ఛాయదేవి, సహాయక కార్యదర్శి ఎం.డి ఫమీద,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.హైమావతి, మాదవితో కలిసి నిషా సిద్దు మాట్లాడుతూ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రం ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, నిధులను తగ్గించిందని విమర్శించారు. నగరాల పేర్లను మార్చినంత మాత్రాన మోదీ విశ్వగురువు కాలేరని, మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పించాలని, వారికి నాణ్యమైన విద్యను, వైద్యాన్ని అందించాలని, రక్షణ కల్పించాలని హితువుపలికారు. రాజస్థాన్‌లో గత ప్రభుత్వం రూ.25 లక్షల వరకు చికిత్సను అందించే అవకాశాన్ని తగ్గించి, బిజెపి ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పేరుతో కేవలం రూ.5 లక్షల వరకే చికిత్సను అందిస్తున్నారని దుయ్యబట్టారు. మణిపూర్‌లో మహిళలు, బాలికలపైన దాడులు జరిగినప్పటికీ మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదని నిషాసిద్దు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు 2030 నాటికి అమలు చేస్తామనడం విడ్డూరమన్నారు. 'సర్' పేరుతో తమకు అను కూలంగా లేని వారిని ఓటరు జాబితా నుంచి తొలగిస్తున్నారని, 14 రాష్ట్రాలలో ఓటరు జాబితా నుంచి చాలా మందిని తొలగించారని దుయ్యబట్టారు. మహిళలకు ఓటు హక్కు కూడా లేకుండా చేస్తున్నారన్నారు.
ఎన్.జ్యోతి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో మద్యాన్ని నియంత్రించాలని, డ్రగ్సను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేశారని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో మద్యం, డబ్బుల ప్రభావం లేకుండా చూడాలని ఆమె కోరారు. ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూడా తమ వంతు పాత్రను పోషించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యు నాయకులు షహీదా, అంజమ్మ, లావణ్య, ప్రమీల, బాలమణి, సునీత, చంద్రమ్మ పాల్గొన్నారు.

# ఐదుగురికి పద్మవిభూషణ్

**న్యూఢిల్లీ :** గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రంగాల్లో అసమాన సేవలు అందించిన వారికి తాజాగా పద్మ పురస్కారాలు ప్రకటించింది. ఐదుగురికి పద్మవిభూషణ్, 13 మందికి పద్మభూషణ్, 113 మందికి పద్మశ్రీ పురస్కారాలు ప్రకటించింది. బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్ర, కేరళ మాజీ సిఎం అచ్యుతానందన్‌కు మరణానంతరం పద్మవిభూషణ్ ప్రకటించింది. కేరళకే చెందిన కె.టి.థామస్, సాహితీవేత్త పి.నారాయణన్‌కు కూడా పద్మవిభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల విభాగంలో ఉత్తర ప్రదేశ్‌కు ఎన్.రాజాంకు పద్మవిభూషణ్ ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రముఖ గాయని అల్కా యాజ్ఞిక్, మాజీ గవర్నర్ భగత్‌సింగ్ కోశ్యారికి పద్మభూషణ్ ప్రకటించింది. వైద్యరంగంలో తమిళనాడుకు చెందిన కల్లిపల్లి రామస్వామి పళనిస్వామి, ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు ప్రకటించింది. కళల విభాగంలో మళయాళం దిగ్గజ నటుడు మమ్ముట్టికి పద్మభూషణ్ ఇవ్వనున్నట్లు వెల్లడించింది. కళల రంగంలో మహారాష్ట్రకు చెందిన పీయూష్ పాండేకు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించింది. సామాజిక సేవారంగంలో తమిళనాడుకు చెందిన ఎస్‌కెఎం మయిలనందన్, కళల రంగంలో కర్ణాటకకు చెందన శకవర్ధనీ గణేష్‌కు మూడో అత్యున్నత పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. జార్ఖండ్ మాజీ సిఎం శిబూసోరేన్‌కు మరణానంతరం పద్మభూషణ్ ప్రకటించిన కేంద్రం, ప్రజావ్యవహారాల విభాగంలో వి.కె.మల్హోత్రాకూ ఇవ్వనున్నట్లు తెలిపింది. వాణిజ్య రంగంలో ఉదయ్ కోటక్, ప్రజా వ్యవహారాల రంగంలో కేరళకు చెందిన వల్లాపల్లి నటేషన్, క్రీడారంగంలో విజయ్ అమృతరాజ్ పద్మభూషణ్ పురస్కారాలకు ఎంపికయ్యారు.

**అన్‌సంగ్ హీరోస్‌కు కూడా!**

మొత్తం 113 పద్మశ్రీ పురస్కారాలను ప్రకటించిన కేంద్రం, వారిలో 45 మంది అన్‌సంగ్ హీరోలను ఎంపిక చేసింది. సినీ రంగానికి సంబంధించి ప్రముఖ నటులు మురళీమోహన్ (తెలుగు), రాజేంద్ర ప్రసాద్ (తెలుగు), ఆర్. మాధవన్(తమిళ్)కు పద్మశ్రీలను ప్రకటించింది. క్రీడారంగంలో రోహిత్ శర్మ, హర్మన్ ప్రీత్ కౌర్, హాకీ క్రీడాకారిణి సవిత పూనియాకు పద్మశ్రీలు అందిస్తామని తెలిపింది. ఇక తెలంగాణకు చెందిన డాక్టర్ కుమారస్వామి తంగరాజ్, రామారెడ్డి మామిడి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికయ్యారు. కుమారస్వామి తంగరాజ్ ప్రముఖ (సిసిఎంబి) శాస్త్రవేత్త. మానవ పరిణామ క్రమం, జన్యుసంబంధ వ్యాధులపై ఆయన పలు పరిశోధనలు చేసి, అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. మరోవైపు పశుసంవర్థక, పాడి పరిశ్రమకు చేసిన కృషికిగానూ రామారెడ్డికి పద్మశ్రీ పురస్కారం వరించింది.

**పద్మవిభూషణ్**

ధర్మేంద్ర (మరణానంతరం)
అచ్యుతానందన్ (కేరళ) (మరణానంతరం)
కె.టి.థామస్ (కేరళ) (పద్మవిభూషణ్)
పి.నారాయణన్ (కేరళ) (సాహితీవేత్త)
ఎన్.రాజాం (ఉత్తరప్రదేశ్) (కళలవిభాగంలో)

**పద్మభూషణ్**

నోరీ దత్తాత్రేయుడు (వైద్యం)– అమెరికా
మమ్ముట్టి (కళలు) – కేరళ
అల్కా యాజ్ఞిక్ (కళలు) – మహారాష్ట్ర
కల్లిపట్టి రామసామి పళనిస్వామి (వైద్యం) – తమిళనాడు
పీయూష్ పాండే (మరణాంతరం) (కళలు) – మహారాష్ట్ర
ఎస్‌కెఎం మెయిలానందన్ (సామాజిక సేవ) – తమిళనాడు
శతావధాని ఆర్ గణేశ్ (కళలు) – కర్ణాటక
శిబూ సోరెన్ (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు) – జార్ఖండ్
ఉదయ్ కొటక్ (వాణిజ్యంపరిశ్రమలు) మహారాష్ట్ర
వికె మల్హోత్రా (మరణాంతరం) (ప్రజావ్యవహారాలు)– ఢిల్లీ
వెల్లప్పల్లి నటేశన్ (ప్రజావ్యవహారాలు)– కేరళ
విజయ్ అమృత్‌రాజ్ (క్రీడలు) – అమెరికా
భగత్‌సింగ్ కోశ్యారీ (ప్రజావ్యవహారాలు)– ఉత్తరాఖండ్



## చిన్నారులు మృతి

(మొదటి పేజీ తరువాయి)

నీటిగుంతలో బంతి పడటంతో తీసుకొచ్చేందుకు వెళ్లిన మధుశ్రీమాన్య నీటిలో పడిపోయాడు. అతడినికాపాడే ప్రయత్నంలో మధుశ్రీకృతి, ఎడ్మ స్నేహ సైతం నీటిగుంతలో పడిపోయారు. అక్కడే ఉన్న వేణుగోపాల్‌రెడ్డి కుమార్తె విద్యాధరణి పిల్లలను కాపాడే ఆందోళనలో గోతిలో కాకుండా పక్కనే లోతుగా ఉన్న ఉన్నచోట పడిపోయింది. అరుపులువిని పక్కన పొలంలో పనిచేస్తున్న రాణి అనే మహిళ పరుగుపరుగున వచ్చి ప్రాణాప్రాయ స్థితికి చేరుకుంటున్న విద్యాధరణిని బయటకు తీసింది. పిల్లలు ముగ్గురు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నా వారిని కాపాడేందుకు ఈతరాకపోవడంతో శ్రీకాంత్‌రెడ్డి విలవిలలాడాడు. అప్పటికే విషయం చుట్టుపక్కల వారి ద్వారా గ్రామస్తులకు తెలియజేయడంతో అందరూ ఘటనా స్థలికి చేరుకొని నీటిగుంతలో పడి ప్రాణాలు కోల్పోయిన వారిని వెతికి బయటకు తీశారు. ఒకేరోజు ముగ్గురు పిల్లలు ప్రాణాలు కోల్పోవడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

## ఆహుతి

(మొదటి పేజీ తరువాయి)

బంధువులకు అప్పగించారు. మృతుల బంధువుల రోధనలతో మార్చురి వద్ద తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.అగ్నిమాపక శాఖ, జిహెచ్ఎంసి, పోలీసు అధికారుల పర్యవేక్షణలో సహాయక చర్యలు 22 గంటల పాటు నిరాఘటంగా కొనసాగాయి. మంటలు పూర్తిస్థాయిలో ఆదివారం 11 గంటల వరకు అదుపులోకి రావడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. ఏకదాటిక మంటలు రావడంతో భవనం నాణ్యతపై అధికారులు ప్రత్యేక బృందాలను రప్పించి పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు. వీరు ఇచ్చే నివేధిక ఆధారంగానే భవనం కూల్చాలా వద్దా అనేది ఆధారపడుతుందని అధికారులు తెలుపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా: మంత్రి పొగులేటి**

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంత్రి పొగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందనకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు మంత్రి తెలిపారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అగ్నిమాపక నిబంధనలు, భద్రతా ప్రమాణాలపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి, ఇలాంటి ప్రమాదాలు జరగకుండా కఠిన నియంత్రణ చర్యలు అమలు చేస్తామని తెలిపారు.ప్రాథమిక విచారణలో షాపు యజమాని నిర్లక్ష్యం వల్లే ఈ అగ్నిప్రమాదం చోటు చేసుకున్నట్లు తేలిందని, సంబంధిత వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జి ప్లస్ నాలుగు అంతస్తుల భవనంలో ఉన్న ఫర్నిచర్ మాల్‌లో ఎలాంటి ఫైర్ సేఫ్టీలు లేవని, నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించారని ఫైర్ డిజి విక్రమ్‌మాన్ సింగ్ స్పష్టం చేశారు.

**యజమానిని అరెస్టు చేశాం: అబిడ్స్ ఎసిపి ప్రవీణ్ కుమార్**

అగ్నిప్రమాదంలో మృతి చెందిన అఖీల్, ప్రణీత్‌ల తండ్రి యాదయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అబిడ్స్ ఎసిపి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఫర్నిచర్ షాప్ యజమాని సతీష్ బచా (54)ను అరెస్ట్ చేసి , ఫైర్ యాక్సిడెంట్ కింద బిఎన్ఎస్ 110 యాక్ట్ కింద కేసు నమోదు చేసి , రిమాండ కు తరలించామని పేర్కొన్నారు. షర్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. రెండు రోజుల క్రితమే బిల్డింగ్ లిఫ్ట్ రిపేర్ జరిగింది , అందులో వైరింగ్ సమస్య వల్ల ప్రమాదం సంభవించి ఉండొచ్చు అని అనుమానిస్తున్నామన్నారు. సెల్లర్ లో ఫర్నిచర్ నిలువ ఉంచడం కారణంగా మంటలు తొందరగా వ్యాప్తి చెందాయన్నారు.సెల్లర్ లో ఉన్న వాళ్ళు పొగాకు ఉరిపి ఆడక మరణించారని తెలిపారు. త్వరలో అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం**

నాంపల్లి స్టేషన్ రోడ్డులోని ఫర్నిచర్ షాప్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో మరణించిన వారికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. అగ్ని ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నిబంధనలు పాటించకుండా ఘటనకు కారణమైన షాపు యజమానిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. భవిష్యత్ లో ఇలాంటి ఘటనలు జరగకుండా జిహెచ్ఎంసి, పోలీస్, రెవెన్యూ, హైడ్రా అధికారులు సమన్వయం చేసుకొని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని భవనాలు ఉంటే ఫిర్యాదు చేయాలని కోరారు.

# ఘర్షణాత్మక ప్రపంచంలో భారత్ ఒక శాంతి దూత

**రాష్ట్రపతి ముర్ము గణతంత్ర దినోత్సవ సందేశం**

**న్యూఢిల్లీ :** ఘర్షణాత్మక ప్రపంచంలో భారతదేశం ఒక శాంతి సందేశ దూత అని రాష్ట్రపతి ద్రౌపదీముర్ము అన్నారు. గణతంత్ర దినోత్సవం 77వ వేడుకల సందర్భంగా ఆమె జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, అనేక ఖండాలలో భౌగోళిక,ప్రాదేశిక ఉద్రిక్తతల విస్తరణ మధ్య భారతదేశం ప్రపంచానికి శాంతి సందేశ ప్రచారకర్తగా ఉందని అన్నారు. మానవాళి భవితవ్యాన్ని రక్షించేందుకు ఈ శాంతి ప్రచారమే కీలకమైనదని అన్నారు. ఆపరేషన్ సిందూర్, మహిళా సాధికారత సహా వందేమాతరం, వృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక వ్యవస్థ వంటి అనేక అంశాలను రాష్ట్రపతి తన సందేశంలో ప్రధానంగా ప్రస్తావించారు. సార్వత్రిక సామరస్యం కోసం ప్రపంచవ్యాప్తంగా పురాతన నాగరికతకు ఊతమిస్తూనే సమకాలీన ప్రపంచంలో భారతదేశం ఒక శాంతిదూతగా,శాంతి ప్రచారకర్త స్థానంలో ఉందని రాష్ట్రపతి పునరుద్ఘాటించారు. ''మన సంప్రదాయంలో యావత్ ప్రపంచ శాంతికోసం, సార్వత్రిక శాంతికోసం ప్రార్థనలు చేస్తాం, ప్రపంచంలో శాంతి ఉన్నప్పుడే మానవాళి భవితవ్యం భద్రంగా ఉంటుంది, ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో ఇప్పుడు వాతావరణం ఘర్షణాత్మకంగా ఉంది, భారతదేశం శాంతి సందేశాన్ని విస్తరింపజేస్తోంది'' అన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్ విజయాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ జాతీయ భద్రతకు తాము కట్టుబడి ఉన్నామని ఉద్ఘాటించారు. సరిహద్దులు దాటి వచ్చి దాడులు చేసిన ఉగ్రవాదుల మౌలిక సదుపాయాలను, వ్యవస్థలను ధ్వంసం చేశామని గుర్తుచేశారు. ''గత ఏడాది మన దేశం నిర్దేశిత లక్ష్యాలపై గురిపెట్టి ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసింది, అనేకమంది ఉగ్రవాదులకు ప్రధానమైన వనరులుగా ఉన్న కేంద్రాలను భారత సైన్యం నాశనం చేసింది, ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది'' అన్నారు. ఈనాడు భారతదేశం స్వయంసమృద్ధికే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రక్షణరంగంలో దేశం చరిత్రాత్మకమైన విజయాలు సాధించామన్నారు. సాయుధ బలగాల శక్తి సామ ర్థ్యాలను ఈ సందర్భంగా ఆమె ప్రస్తావిస్తూ, సియాచిన్ సైనిక కేంద్రం, సుఖోయ్ యుద్ధ విమానంలో ప్రయాణం, రాఫెల్ యుద్ధ విమాన ప్రయాణం, ఐఎన్ఎస్ విక్రాంత్ జలాంతర్గామిలో తన ప్రయాణ అనుభవాలను ఉటంకిస్తూ భారత సైనిక సామర్థ్యాన్ని ప్రస్తుతించారు. భూతల,గగన, సముద్రతలాలలో భారతదేశ బలగాలు సంపూర్ణ సన్నద్ధతతో ఉన్నా యన్నారు. నారీశక్తి సామర్థ్యాన్ని ఆమె ప్రశంసించారు. 2047 నాటికి లక్ష్యాలు సాధించే దిశగా దేశ ప్రయాణంలో నారీశక్తే మూలమన్నారు. దేశంలో పదికోట్ల మంది మహిళలు స్వయంసేవా సంఘాలలో సభ్యులుగా సమైక్య ఉన్నారని, గ్రామస్థాయిలో ఆర్థిక వ్యవస్థకు వారు పునర్నిర్వచనం ఇస్తున్నారన్నారు.



పంచాయతీరాజ్ వ్యవస్థలో దేశంలో 46 శాతం మహిళలు ప్రతినిధులుగా ఉన్నారని, నారీశక్తి వందన్ అధినియమ్ అనేది రాజకీయ సాధికారత అసాధారణ శిఖరాలు అధిరోహించే దిశగా వెళుతోందన్నారు. మహిళల నాయకత్వంలో దేశాభివృద్ధే జాతీయ ప్రాధాన్యత అన్నారు. గత ఏడాది భారతదేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని, దేశానికి భారతీయ కుమార్తెలు గర్వకారణంగా నిలిచారని, వారు క్రీడారంగంలో ప్రత్యేకించి ఐసిసి మహిళా క్రికెట్ వరల్డ్ కప్ విజయం సాధించారన్నారు. టి–20లో భారత్ వరల్ కప్ సాధించింది. సాయుధ బలగాలలో, అంతరిక్ష అన్వేషణలో, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా కూడా మహిళలు గణనీయమైన విజయాలు సాధిస్తు న్నారన్నారు. బేటీ బచావో, బేటీ పఢావో ప్రచారం ద్వారా విద్యారంగంలో బాలికలు దేశవ్యాప్తంగా ముందంజలో ఉన్నారన్నారు. దేశంలో మహిళల పాత్ర, వారి భాగస్వామ్యం పెరుగు తోందని, స్త్రీ పురుష సమానత్వం ఆధారంగా సర్వసమ్మి ళితంగా ఉన్నార న్నారు. భవిష్యత్ భారతదేశ వృద్ధిలో మహిళలను వేరుచేసి చూడలేమన్నారు. పేదరిక నిర్మూలనలో భారతదేశం పరివర్తన చెందుతోందన్నారు. లక్షలమంది ప్రజలు పేదరికం నుండి బయట పడ్డారన్నారు.



## భూరికార్డులపై భరోసా కల్పించేలా సర్వేయర్‌లు పనిచేయాలి

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రజాక్షం/రఘునాథపాలెం :** భూరికార్డులపై రైతులకు భూ యజమానులకు భరోసా కల్పించేలా సర్వేయర్‌లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌరసంభందాల, గృహనిర్మాణాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌లతో కలిసి శిక్షణ పూర్తిచేసుకున్న లైసెన్స్ సర్వేయర్లకు ధృవీకరణ పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తు పేద ప్రజల కష్టాలను తొలగించేందుకు ఎన్నికల సమయలో ఇచ్చిన మాట ప్రకంర ధరణి వ్యవస్థను బంగాళఖాతంలో వేసి రైతులకు చుట్టంగా ఉండే విధంగా అధ్భుతమైన భూభారతి చట్టం ప్రవేశపెట్టామని అన్నారు. భూభారతి చట్టం నియమనిభంధనలు కూడా 90 రోజుల్లో ఏర్పాటు చేశామని అన్నారు. ప్రతి మనిషికి ఆధార్ కార్డు ఉన్న విధంగా భూములకు భూదార్ ప్రవేశపెడతామని మాట ఇచ్చారు. దీనికోసం అవసరమైన మేర సర్వేయర్‌లు అందుబాటులో ఉండే విధంగా వివిధ రాష్ట్రాల్లో అధ్యయనంచేసి అందులో అత్యుత్తమ విధానాన్ని అవలంబించి సర్వేయర్‌లను ప్రవేశపెట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డిఆర్ఓ ఎ పద్మశ్రీ, సర్వేయర్ అండ్ ల్యాండ్ రికార్డ్ జాయింట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ ఏడి రాజేందర్, అర్టీఐ మెంబర్ వెంకన్న, వివిపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ, తహసీల్దార్లు, లైసెన్స్ సర్వేయర్‌లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న మహిళలకు అండగా 'షీ టీమ్స్'

### ఏడాదిలో 1,149 ఫిర్యాదులు పరిష్కారం
### క్షేత్రస్థాయిలో ఆకతాయిలపై ప్రత్యేక నిఘా
### రెడ్ హ్యాండెడ్‌గా చిక్కిన 3,826 మంది పోకిరీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నమ్మి స్నేహం చేశారు. ఆ చనువుతో కొన్ని వ్యక్తిగత ఫొటోలు పంచుకున్నారు. అదే ఇప్పుడు ఆమె మెడకు ఉచ్చులా మారింది. 'డబ్బులిస్తావా.. ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టమంటావా?' అంటూ నిత్యం వేధింపులు. చావలేక, బతకలేక నరకయాతన అనుభవించిన ఆ యువతి చివరకు 'షీ టీమ్స్'ను ఆశ్రయించి విముక్తి పొందారు. మరొకరు.. రోజూ ఆఫీస్‌కు వెళ్తుంటే చాలు, నీడలా వెంటపడటం, ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరింపులు. ఫోన్ బ్లాక్ చేసినా కొత్త నంబర్లతో బూతులు తిడుతూ పైశాచిక ఆనందం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ మహిళకు 'షీ టీమ్స్' అండగా నిలిచింది.

ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే కాదు, హైదరాబాద్ నగరంలో ఎంతోమంది మహిళలు అనుభవించిన మూగవేదనకు ప్రతిరూపాలు. నగరంలో మహిళల భద్రతకు పెద్దపీట వేస్తూ, వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆటకట్టించడంలో హైదరాబాద్ షీ టీమ్స్ మరోసారి తమ సమర్థతను చాటుకున్నాయి. ఏడాదిలో మొత్తం



1149 ఫిర్యాదులు అందగా, వాటన్నింటినీ షీ టీమ్స్ అత్యంత బాధ్యతాయుతంగా పరిష్కరించాయి.

**బ్లాక్‌మెయిలింగ్ భూతం నుంచి 366 మందికి విముక్తి..**

ఈ ఏడాది నమోదైన కేసులను విశ్లేషిస్తే, అత్యధికంగా 366 మంది బాధితులు 'బ్లాక్‌మెయిలింగ్' సమస్యతోనే షీ టీమ్‌ను ఆశ్రయించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమై, తీయని మాటలతో నమ్మించి చనువు పెంచుకోవడం, ఆపై వీడియో కాల్స్, వ్యక్తిగత ఫోటోల ద్వారా ఉచ్చు బిగించడం పరిపాటిగా మారింది. వీడియో కాల్ మాట్లాడుతున్నప్పుడు స్క్రీన్ రికార్డింగ్ చేయడం, పంపిన ఫోటోలను సేవ్ చేసుకుని డబ్బుల కోసం వేధిస్తున్నారు. మరికొన్ని కేసుల్లో ప్రేమ విఫలమైన తర్వాత, పాత ఫోటోలను అడ్డం పెట్టుకుని మాజీ ప్రేమికులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. 'నాతో మాట్లాడకపోతే, వేరే పెళ్లి చేసుకుంటే.. మన పాత ఫోటోలు నీ కాబోయే భర్తకు పంపిస్తా' అంటూ వేధిస్తున్న 366 కేసుల్లో షీ టీమ్స్ బాధితులకు అండగా నిలిచింది.

**మఫ్టీలో నిఘా.. 3,826 మందికి కౌన్సెలింగ్..**

కేవలం ఫిర్యాదులే కాకుండా, క్షేత్రస్థాయిలోనూ షీ టీమ్స్ దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. నగరవ్యాప్తంగా 15 బృందాలు బస్టాండ్లు, కాలేజీలు, రద్దీ ప్రదేశాల్లో మఫ్టీలో నిఘా వేసి, 2025లో ఏకంగా 3,826 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మెజారిటీ ఆకతాయిలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వగా, తీవ్రత ఎక్కువగా ఉన్న ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి జైలుకు పంపారు.

**మహిళల జోలికొస్తే కఠిన చర్యలు తప్పవు: హైదరాబాద్ సిపి సజ్జనార్**

'మహిళల జోలికొస్తే, ఇక మీ ఆటలు సాగవు. ముఖ్యంగా 'బ్లాక్‌మెయిలింగ్' పేరుతో ఆడబిడ్డలను భయపెట్టాలని చూస్తే, మీ భవిష్యత్తు జైలు గోడల మధ్యే అంతమవుతుంది. సోదరీమణులారా.. అధైర్యపడకండి. మీ వివరాలు బయట పడతాయన్న భయం అస్సలు వద్దు, వాటిని అత్యంత గోప్యంగా ఉంచుతాం. వేధింపులను మౌనంగా భరించకండి, ఎదురించండి. మీరు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. మీకు రక్షణ కవచంలా నిలబడటానికి 'షీ టీమ్స్' ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురవుతున్నా తక్షణమే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 9490616555 ను సంప్రదించండి.

## 10 మంది డిఎస్‌పిల బదిలీలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో పలువురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డిఎస్‌పి) స్థాయి అధికారులకు బదిలీలు, నియామకాలు చేపట్టారు.ఈ మేరకు ఆదివారం డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయి. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు సిఫారసుల మేరకు ఈ మార్పులు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్. ఆదినారాయణ హైదరాబాద్ సిసిఎస్ నుంచి కొత్తగూడెం ఎస్‌డిపిఒగా నియామకం. షేక్ అబ్దుల్ రెహమాన్ కొత్తగూడెం ఎస్‌డిపింగా ఉన్న ఆయనను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.డి.వి. ప్రదీప్ కుమార్ రెడ్డి సిటిసి నుంచి అదిలాబాద్ ఎసిపిగా బదిలీ. ఎం.ఆది మూర్తి సిఐడి నుంచి మియాపూర్ ట్రాఫిక్‌కు బదిలీ. ఎస్. చక్రపాణి – మల్కాజ్‌గిరి నుంచి జవహర్ నగర్ ఎసిపిగా మార్పు. బి. మోహన్ కుమార్ ఎస్‌బి నుంచి మేడిపల్లి ఎసిపిగా బదిలీ. రవీందర్ టాస్క్‌ఫోర్స్ ఎసిపి సిద్దిపేట నుంచి భువనగిరి ఎస్‌డిపిఒగా నియామకం.సిహెచె. శ్రీధర్ నార్కోటిక్ బ్యూరో నుంచి మలక్‌పేట్ ఎసిపిగా బదిలీ ఎస్. సరంగపాణి తెలంగాణ పోలీసు అకాడమీ నుంచి యల్లందు ఎస్‌డిపిఒగా బదిలీ. ఎన్. చంద్ర భాను యల్లందు ఎస్‌డిపిఒగా ఉన్న ఆయనను డిజిపి కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. బదిలీ అయిన అధికారులను సంబంధిత యూనిట్ అధికారులు రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్ ప్రాంతాల్లో విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని డిజిపి ఆదేశించారు.

## మహేష్ గౌడ్ గురించి మాట్లాడే స్థాయి కవితకు లేదు

### టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తాడు బొంగరం లేకుండా, గమ్యం లేని ప్రయాణం చేస్తున్న కల్వకుంట్ల కవిత, టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్‌ని తన పార్టీలో చేరితే పదవి ఇస్తాననీ అనడం ఆమె స్థాయికి తగ్గ మాటలు కావని టిపిసిసి జనరల్ సెక్రటరీ చనగాని దయాకర్ చురకలు అంటించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కవితకు తెలంగాణ రాజకీయాల్లో స్థానం ఉండదని, తెలంగాణ సమాజం ఆమెను నమ్మదని అన్నారు. తన స్థాయికి మించి మాటలు మాట్లాడితే సహించమన్నారు.



## జాతీయ నాస్తిక మేళా కరపత్రం విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గుంటూరు జిల్లా మంగళగిరిలోని చార్వాక ఆశ్రమంలో జరగనున్న జాతీయ నాస్తిక మేళాను జయప్రదం చేయాలని కోరుతూ వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద జరిగిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు వామన కుమార్, వెంకటేశ్వర్లు, నాస్తిక సమాజం రాష్ట్ర నాయకులు దనగల్ల రవికుమార్, బంద్రపల్లి ఆంజనేయులు, ఆనంద్ కుమార్, అజయ్ కుమార్, సదానంద, మక్తల్ నాయకులు పోలప్ప, నర్సప్ప, సంఖ్యా పాల్గొని మేళా కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాఘవాచారి మాట్లాడుతూ వచ్చేనెల 14, 15వ తేదీలలో చార్వాక హాస్రమము, మంగళగిరి గ్రామంలో 34వ జాతీయ నాస్తిక మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళాను అభ్యుదయ రచయితలు, మేధావులు, విద్యార్థులు, ప్రజాస్వామిక వాధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## ఎపిజె అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి

### అవార్డుల ప్రదానోత్సవంలో ఫిరోజ్ ఖాన్

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** దేశవ్యాప్తంగా విద్య, యువత అభివృద్ధికి దివంగత మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని టిపిసిసి ప్రధానకార్యదర్శి ఎండి.ఫిరోజ్ ఖాన్ కొనియాడారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎపిజె అబ్దుల్ కలాం రూరల్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు సయ్యద్ శిరిన్ సుల్తాన ఆధ్వర్యంలో ఎపిజె అబ్దుల్ కలాం ప్రతిభా అవార్డుల –2025–26 ప్రదానోత్సవం జరిగింది. దీనికి ముఖ్యతిథిగా హాజరైన ఫిరోజ్ ఖాన్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఆయన జీవితంలో ఎక్కువ సార్లు విద్యార్థులతో గడుపుతూ వారిని సరైనమార్గంలో నడిచేలా తపించారన్నారు. నిస్వార్థసేవ చేసిన ఆ మహానీయుడు ప్రజల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 40 మందికి అబ్దుల్ కలాం అవార్డులు అందజేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఐపిఎస్ హిసన్ రజ, సికిందర్ మసూకి, శాస్త్రవేత్త డా.స్వామి, షఫీ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్య వృద్ధి

### 16వ జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
### ఉత్తమ ఎన్నికల అధికారులకు అవార్డుల ప్రదానం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలు తమ ఓటు హక్కును చురుకుగా వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని "నా భారతదేశం, నా ఓటు – భారత ప్రజాస్వామ్య హృదయంలో పౌరుడు'' అనే థీమ్‌తో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ ఓటర్లకు ఇపిక్ ఓటర్ ఐడి కార్డులను పంపిణీ చేశారు. ఎన్నో ఏళ్లుగా ఓటు వేస్తున్న సీనియర్ సిటిజన్స్‌ను ఘనంగా సన్మానించారు. దీనికి ముఖ్యఅతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ విచ్చేయగా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వర్చువల్‌గా పాల్గొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల కల్పించడం, అర్హులైన ఓటర్లకు ఇంటి నుంచే ఓటు వేయించడం, ఎన్నికలను మరింత సమగ్రంగా నిర్వహించే సాంకేతికత చొరవను ప్రశంసనీయమన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక సందర్భంగా డ్రోన్ నిఘాను వినూత్నంగా ఉపయోగించడాన్ని అభినందించారు. జ్ఞానేశ్ కుమార్ వర్చువల్‌గా తన సందేశాన్నిస్తూ 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం స్థాపించారన్నారు. దేశ ఎన్నికల వ్యవస్థ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. యువ ఓటర్లు సమాచారం, నైతిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, ప్రజాస్వామ్యానికి రాయబారులుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమగ్రత, పారదర్శక బలోపేతానికి అనేక చర్యలు చేపట్టామన్నారు. అనంతరం గవర్నర్ ఓటర్ల ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణలో అద్భుత పనితీరు కనబరిచిన అధికారులకు ఉత్తమ ఎన్నికల పద్ధతుల అవార్డులు–25 ప్రదానం చేశారు. కరీంనగర్ కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారిణి ఐఎఎస్ పమేలా సత్పతికి, జనగామ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషాషేక్‌కు, వరంగల్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సత్య శారదతోపాటు వివిధ జిల్లాల ఎన్నికల అధికారులకు అవార్డులు అందజేసి, సత్కరించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని, అధికారులు పాల్గొన్నారు.

## సింగరేణిలో 'పెద్ద చేప'ను కాపాడేందుకే బిఆర్ఎస్ డ్రామాలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణిలో మేఘా కృష్ణారెడ్డి అనే 'పెద్ద తిమింగలాన్ని' రక్షించేందుకు బిఆర్ఎస్ సృజన్‌రెడ్డి అనే 'చిన్న చేప' చుట్టూ టెండర్ల వ్యవహారాన్ని తిప్పుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రూ. మేఘా సంస్థకు రూ. 25 వేల కోట్ల కాంట్రాక్ట్ ఇచ్చే ప్రయత్నం జరుగుతున్నా బిఆర్ఎస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సృజన్ రెడ్డికి గతంలో బిఆర్ఎస్ హయాంలోనే కాంట్రాక్టులు ఇచ్చారని, అప్పుడు ఆయన రేవంత్ రెడ్డి బావమరిది అని గుర్తుకు రాలేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ చిన్న చేప చుట్టూ కథ తిప్పుతూ పెద్ద తిమింగలాన్ని రక్షిస్తున్నారని విమర్శించారు. కార్మికులకు ఇబ్బందులు ఎదురైతే కాంగ్రెస్, బిఆర్ఎస్ స్పందించలేదని, కానీ పెద్ద కాంట్రాక్టర్‌కు టెండర్ రాకపోతే మాత్రం ముందుకు వస్తున్నాయని విమర్శించారు. సింగరేణిలో అమలు చేస్తున్న ఎండిఓ విధానం వల్ల సంస్థకు నష్టాలు వస్తున్నాయని, దానిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ హయాంలో సింగరేణిపై రూ.25 వేల కోట్ల అప్పులు పెరిగాయని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవి రూ.50 వేల కోట్లకు చేరాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జోక్‌గా మారిందని, బాధితులకు న్యాయం జరగడం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల కోసమే ప్రభుత్వం ఈ అంశాన్ని డ్రామాగా మార్చిందని విమర్శించారు. టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు కవిత 'ఓపెన్ ఆఫర్' ఇచ్చారు. ఆయనకు అనుభవం ఉంది కాబట్టి, తమ పార్టీలోకి వస్తే ఆయనకు 'నేషనల్ కన్వీనర్' పదవి ఇస్తాను అని అన్నారు. తాను కాంగ్రెస్‌లో చేరుతానంటూ మహేశ్ గౌడ్ చేస్తున్న వ్యాఖ్యలను కవిత కొట్టిపారేశారు. 'కాంగ్రెస్ అనేది ఒక ఓడిపోయే పార్టీ అని, అలాంటి పార్టీలో నేను ఎందుకు చేరుతాను అని ప్రశ్నించారు.



**హరీశ్‌రావుపై 'గుంటనక్క' విమర్శలు ...**

మాజీ మంత్రి హరీశ్ రావుపై కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయనను 'గుంటనక్క'గా సంబోధిస్తూ ఘాటు విమర్శలు చేశారు. హరీశ్ రావు తవ్విన గుంతలో కెటిఆర్ పడటం బాధాకరమని కవిత వ్యాఖ్యానించారు. హరీశ్ మాటలు నమ్మి కెటిఆర్ కూడా అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తెలంగాణ జాగృతి మాత్రం ఎప్పటికీ సింగరేణి కార్మికుల పక్షాన పోరాడుతుందని, జాగృతి తరఫున ఒక ప్రత్యేక ప్రతినిధి బృందం నైనీ బ్లాక్‌ను సందర్శిస్తుందని కవిత తెలిపారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు.. కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉగ్రవాదుల ముప్పు ఉందని కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరికలు జారీ చేయడంతో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వ అధికారిక వేడుకలు నిర్వహించే సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వేడుకలను వీక్షించేందుకు వచ్చే ప్రతి ఒక్కరిని మెటల్ డిటెక్టర్ ద్వారాల గుండానే రావాలని పోలీసులు సూచించారు. వేదికతో పాటు పార్కింగ్ ప్రదేశాలలో కూడా ముందు జాగ్రత్త చర్యగా బాంబ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీ చేశారు. శాంతిభద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు హైదరాబాద్ నగర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను నగరానికి తరలించి, పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. ముఖ్యమైన రహదారులు, కూడళ్ల వద్ద నిఘా పెంచడంతో పాటు, వాహనాల తనిఖీలు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పోలీసు అధికారులు తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా సిసిటివి కెమెరాల ద్వారా పర్యవేక్షణ, డ్రోన్ నిఘా, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విఐపి, వివిఐపి కదలికలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక భద్రతా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గణతంత్ర దినోత్సవ వేడుకలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని, ట్రాఫిక్ ఆంక్షలను పాటించాలని పోలీసులు కోరారు. నగరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని అధికారులు స్పష్టం చేశారు.దీంతో పాటు రైల్వే, బస్ స్టేషన్‌లలో ప్రత్యేక దృష్టి సారించారు.

## రాజ్యాంగంపై బుల్డోజర్ నడిపించేందుకు బిజెపి సర్కార్ యత్నం

### మానవ హక్కులు కాపాడుకోవాలంటే బిజెపి, ఆర్ఎస్ఎస్‌ను తరిమికొట్టాలి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో మానవ హక్కులను కాపాడుకోవాలంటే బిజెపి,ఆర్ఎస్ఎస్‌ను తరిమి కొట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ ప్యాట్రన్, ఎంపి బృందాకరత్ పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగంపైన బుల్డోజర్ నడిపించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, రాజ్యాంగం అంటే ఒక కాగితాల పుస్తకం కాదని, ఆ పుస్తకంపైన బుల్డోజర్‌ను ప్రయోగించడమంటే, మానవ హక్కులనే బుల్‌డోజ్ చేయడమని తెలిపారు. ప్రజ అనుకూల విధానాలతో కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం దేశానికే వెలుగునిచ్చే పాలనను అందిస్తోందన్నారు. ఐద్వాజాతీయ 14వ మహాసభలో భాగంగా హైదరాబాద్‌లోని బస్‌భవన్‌మైదానంలో ఆదివారం ఐద్వా బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పి.కె. శ్రీమతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బృందాకరత్ ప్రసంగిస్తూ మహిళా ఉద్యమానికి తెలంగాణ గడ్డ స్ఫూర్తినిచ్చిందన్నారు. మహిళా హక్కులు అంటేనే మానవ హక్కులు అని, అలాంటి మహిళా హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. మహిళలకు బిజెపి, ఆర్ఎస్ఎస్ అత్యంత ప్రమాదకరమన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందని, ఆ చట్టాన్ని తిరిగి పునరుద్ధరించుకునేందుకు పోరాడాలని సూచించారు.మత విద్వేషాలను రెచ్చగొట్టేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, ఇందుకు ఆర్ఎస్ఎస్ మహిళలు ప్రచారం చేస్తున్నారని, మైనార్టీలు,దళితులపైన దాడులు జరుగుతున్న పట్టించుకునే పరిస్థితి లేదని విమర్శించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ప్రధాని మోదీ చేసే సెల్యూట్ ప్రజలకు, రాజ్యాంగానికి కాదని, ఆ వేదిక నుంచి ఆర్ఎస్ఎస్‌కు సెల్యూట్ చేస్తారన్నారు. పి.కె.శ్రీమతి మాట్లాడుతూ అన్ని రంగాల్లో కేరళ మొదటి స్థానంలో నిలిచిందని, డబల్ ఇంజన్ సర్కార్‌గా చెప్పుకునే బిజెపి పాలిత రాష్ట్రాలు ఎందుకు ముందు వరుసలో నిలువలేదని ప్రశ్నించారు. అత్యంత పేదరికం లేని రాష్ట్రంగా కేరళ నిలిచిందన్నారు. ఐద్వారాష్ట్ర ప్రధానకార్యదర్శి మరియందేవ్‌లే మాట్లాడుతూ భారతదేశాన్ని రక్షించుకునేందుకు మహిళలందరూ పోరాటం చేసేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం, మానవ హక్కుల కోసం పోరాడుతున్న వారికి బెయిల్ రాదని, కానీ మహిళలపై దాడులకు,హత్యలకు పాల్పడే వారికి త్వరగా బెయిల్ లభిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జాతీయ మహాసభల రిసెప్షన్ కమిటీ గౌరవాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ పురుషుల కంటే ఎక్కువగా మహిళలు శ్రమపడుతున్నప్పటికీ వారికి గుర్తింపు లేక, అసమాతలకు గురవుతున్నారన్నారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ మహిళలను పిల్లలను కనే ఒక యంత్రాలుగా పరిమితం చేయాలన్న సంఘ్ పరివార్ కుట్రలను పారనివ్వబోమన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.అరుణజ్యోతి మాట్లాడుతూ మహిళా హక్కులను కాపాడే దిశగా మహాసభల్లో తీసుకునే నిర్ణయాలను అమలు చేస్తామని అన్నారు. అంతకుముందు ఐద్వా ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లి నుంచి ఆర్‌టిసి బస్‌భవన్ మైదానం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.




## మహిళా హక్కులు కాగితాలకే పరిమితం

### సినీ నటి రోహిణి



దేశంలో మహిళా హక్కులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని, వారిపై ఆంక్షలు, వివక్ష ఇంటి నుంచే మొదలవుతున్నాయని, అందుకే ఇంటి నుంచే మార్పు ప్రారంభంకావాలని ప్రముఖ రచయిత, సినీనటి ఎం.రోహిణి అన్నారు. మహిళలు పోరాటాల ద్వారానే సమానత్వాన్ని సాధించగలరన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. అంతకుముందు ఐద్వా జెండాను పికె శ్రీమతి ఆవిష్కరించారు. అనంతరం అమరులకు నివాళులర్పించారు. మహాసభలకు ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు పి.కె శ్రీమతి అధ్యక్షత వహించగా రోహిణి మహాసభ ప్రారంభోపన్యాం చేయగా, ఐద్వా మహాసభల ఆహ్వాన సంఘం చైర్‌పర్సన్ శాంతా సిన్హా స్వాగతోపన్యాం చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు, ఐద్వా జాతీయ ప్యాట్రన్ బందాకరత్, ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం దావ్‌లే, జాతీయ కార్యదర్శి ఎస్.పుణ్యవతి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రోహిణి మాట్లాడుతూ యువతరం సామ్రాజ్యవాద ప్రమాదాన్ని గమనించాలని, ఆ దిశగా వారిని చైతన్యవంతం చేయాల్సిన బాధ్యతను మహిళలే తమ భుజస్కందాలపై వేసుకోవాలని సూచించారు. శాంత సిన్హా మాట్లాడుతూ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమానత్వం,తమ హక్కుల కోసం మహిళలందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ఏ ఒక్కరూ ఓటును అమ్ముకోవద్దని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించుకునేందుకు జాతీయ స్థాయిలో పోరాటాన్ని కొనసాగించాలన్నారు. బృందాకరత్ మాట్లాడుతూ రానున్న పలు రాష్ట్రాల్లో జరగనున్న శాసనసభ ఎన్నికల్లో వామపక్ష, ప్రజాస్వామిక శక్తులకు మద్దతుగా ఐద్వా ముందు ఉంటుందన్నారు. ఇటీవల కేరళకు వెళ్లిన ప్రధాని మోదీ అభివృద్ధిని ఉద్దేశించి మాట్లాడడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) జాతీయ ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు మాట్లాడుతూ మహిళల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. సామ్రాజ్యవాదం పెరిగిపోతుందని, గజాలో అమానీయ పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆహారం లభించని పరిస్థితులు నెలకొన్నాయని, సహాయం చేసేవారిపైన కూడా ఇజ్రాయిల్ దాడులకు పాల్పడుతోందన్నారు. అమెరికా సామ్రాజ్యవాద దాడులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు.



# రెండు రోజుల్లో మున్సిపల్ షెడ్యూల్

## ఫిబ్రవరి 2వ వారంలో ఎన్నికలు : మంత్రి ఉత్తమ్

**జగిత్యాల :** అన్ని మతాల సమ్మేళనమే కాంగ్రెస్ పార్టీ అని.. దేశంలో బిజెపిని ఓడించాలంటే తమ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ నాయకుల, కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. పార్టీ కోసం కష్టపడి టికెట్లు దక్కని వారు అధైర్య పడొద్దని.. వారికి నామినేట్ పదవులు ఇస్తామన్నారు. సన్నబియ్యం కోసం ఏటా రూ.13,600 కోట్ల నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. రెండు రోజుల్లో మున్సిపల్ షెడ్యూల్ విడుదల అవుతుందని, ఫిబ్రవరి 2వ వారంలో ఎన్నికలు ఉంటాయని పేర్కొన్నారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. 90 శాతం మున్సిపల్‌లను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్ అమలును బిజెపి అడ్డుకుందని విమర్శించారు. మున్సిపల్‌లలో అధికార కాంగ్రెస్ పార్టీ జెండాలు ఎగరవేస్తేనే అభివృద్ధి జరుగుతుందన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, నియోజకవర్గ ఇన్‌ఛార్జి జువ్వాడి నర్సింగరావు పాల్గొన్నారు.

# 15 మంది పోలీసులకు పతకాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి విశిష్ట సేవా పథకాలకు 15 మంది తెలంగాణ పోలీసులు ఎంపికయ్యారు. మెడల్ ఆఫ్ గ్యాలంటరీ అవార్డులకు హెడ్ కానిస్టేబుల్ మర్రి వెంకట రెడ్డి ఎంపిక అయ్యారు. రాష్ట్రపతి విశిష్ట సేవా పథకాలకు ఇద్దరు అధికారులు అదనపు ఎస్‌పి మంద జిఎస్ ప్రకాష్ రావు, ఎస్ఐ ఎ.దామోదర్ రెడ్డి ఎంపిక అయ్యారు. మెడల్ ఫర్ మెరిటేరియస్ సర్వీసెస్ అవార్డుకి 15 మంది పోలీస్ అధికారులు ఎంపిక య్యారు. వీరిలో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ బడుగుల సుమతి, కమాండెంట్ పగుంట వెంకట్ రాములు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మోగిలిచెర్ల శంకర్, సీనియర్ కమాండెంట్ అట్లూరి భాను మూర్తి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.వి.ఎం. ప్రసాద్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సి. వంశీ మోహన్ రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తుమ్మల లక్ష్మి ,సబ్ ఇన్‌స్పెక్టర్ బుర్రా యెల్లయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ వి. పురుషోత్తం రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అబ్దుల్ కరీం, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ బొద్దు ఆనందం, హెడ్ కానిస్టేబుల్ పైలి మనోహర్‌లు ఉన్నారు.

**మావోయిస్టుల లొంగుబాటులో సుమతి కీలక పాత్ర..**

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించిన పోలీస్ పురస్కారాల్లో తెలంగాణ పోలీస్ శాఖకు చెందిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబి) చీఫ్, ఐజి బడుగుల సుమతికి ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. రాష్ట్ర శాంతి భద్రతల పరిరక్షణలో ఆమె అందించిన విశిష్ట సేవలకుగాను కేంద్ర ప్రభుత్వం ఈ గౌరవాన్ని ప్రకటించింది. తెలంగాణలో మావోయిస్టుల లొంగుబాటు, వారి పునరావాస చర్యల్లో సుమతి కీలక పాత్ర పోషించారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో అధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఐజి సుమతి, కీలక భద్రతా అంశాలపై ముందస్తు సమాచారం సేకరణ, విశ్లేషణలో విశేష నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఎన్నికలు, వివిపీ పర్యటనలు, పెద్ద ఎత్తున జరిగే సభలు, సున్నితమైన రాజకీయ పరిణామాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సమర్థవంతమైన ఇంటెలిజెన్స్ వ్యవస్థను నడిపించినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## పద్మ పురస్కారాలకు ఎంపికైన ప్రముఖులకు

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పద్మ భూషణ్, పద్మశ్రీ పురస్కారాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన ప్రముఖులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు నోరి దత్తాత్రేయుడు పద్మ భూషణ్, సైన్స్, టెక్నాలజీ రంగం నుంచి గద్దమణుగు చంద్రమౌళి, కృష్ణమూర్తి బాలసుబ్రహ్మణ్యన్, కుమారస్వామి తంగరాజ్, వైద్య రంగంలో గూడూరు వెంకట్ రావు, పాల్కొండ విజయానంద్ రెడ్డి, పశుసంవర్ధక రంగంలో మామిడి రామా రెడ్డి, కళా రంగం నుంచి దీపికా రెడ్డి, మురళీ మోహన్, రాజేంద్ర ప్రసాద్, గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ లకు పద్మశ్రీ పురస్కారాలు దక్కడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. సేవా, కళా, ఇతర రంగాల్లో వారు చూపిన అంకితభావం, సేవలతోనే ప్రతిష్టాత్మక పురస్కారాలకు ఎంపికయ్యారని ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి కొనియాడారు.



# ఆర్‌పిఎఫ్‌కు ఐదు పథకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఐదుగురు ఆర్‌పిఎఫ్ అధికారులకు కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రకటించింది. పథకాలు దక్కిన వారిలో ఆర్‌పిఎఫ్ ఐజి అరోమా సింగ్ ఠాకూర్, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఉత్తమ్‌కుమార్ బందోపధ్యాయ, సబ్ ఇన్‌స్పెక్టర్ రావుల శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మహేశ్వర్‌రెడ్డి కర్నాటిలు ఉన్నారు. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో తొలి సారిగా సివిల్ డిఫెన్స్, డిప్యూటీ సెక్రటరీ, డిప్యూటీ కంట్రోలర్ కెఎల్‌ఎన్ స్వామికి రాష్ట్రపతి స్థాయిలో మెరిటోరియస్ సర్వీస్ మెడల్‌కు ఎంపిక కావడం విశేషం. సివిల్ డిఫెన్స్ రంగంలో ఆయన చేసిన నిబద్ధ సేవలు, నాయకత్వానికి ఈ పురస్కారం నిదర్శనంగా నిలిచింది. ఇదే సందర్భంలో, 2025లో నిర్వహించిన 63వ సివిల్ డిఫెన్స్ రైజింగ్ డే సందర్భంగా కూడా స్వామికి డైరెక్టర్ జనరల్ డిస్క్ ప్రదానం చేయడం జరిగింది. సివిల్ డిఫెన్స్ పట్ల ఆయన చూపిన అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యానికి గాను ఈ గౌరవం లభించింది. భారతీయ రైల్వేల్లో సివిల్ డిఫెన్స్ వ్యవస్థ విపత్తుల సమయంలో సహాయక దళంగా పనిచేస్తూ, కీలక ఆస్తుల రక్షణ, ప్రయాణికుల భద్రత, రైల్వే కార్యకలాపాల నిరవధిక నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తోంది.ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ కె.ఎల్.ఎన్. స్వామిని అభినందించారు.

## సైట్ విజిట్ సిఫార్సు

# ఏ పనుల కోసం ఇచ్చారో?

### బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణిలో సైట్ విజిట్ సర్టిఫికెట్ ప్రతిపాదన 2018లోనే ఉందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని, కానీ ఆ సైట్ విజిట్ సిఫార్సులను ఎటువంటి పనుల కోసం ఇచ్చారనే అంశాన్ని స్పష్టం చేయలేదని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సైట్ విజిట్ కన్ఫర్మేషన్ సర్టిఫికేట్ అనేది పరిమిత ప్రాంతాల్లో జరిగే డిజైన్, సరఫరా, ఇన్‌స్టాలేషన్ , కమిషనింగ్ పనులకు మాత్రమే వర్తించే ఒక సాంకేతిక నిబంధన అని వివరించారు. సైనిక్ స్కూల్ ఆహ్వానించిన టెండర్ల సప్లై, ఇన్‌స్టాలేషన్ ఆఫ్ క్లాత్ డ్రైయర్ కోసం 'సైట్ విజిట్ ' షరతును విధించారని, దీనిని సింగరేణి ఒబి కాంట్రాక్టుకు ముడి పెట్టడం హాస్యాస్పదమన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ 2025 మే నుంచి ఇప్పటి వరకు ఎంత మంది కాంట్రాక్టర్ల సైట్లు సందర్శించారని, ఎన్ని ఇ మెయిల్స్, లేఖలు వచ్చాయి?, ఎన్ని సర్టిఫికెట్లు జారీ చేశారు?, మిగిలిన వాటిని కారణం చెప్పకుండానే ఎందుకు తిరస్కరించారు? అనే అంశంపైన శ్వేతపత్రం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సైట్ విజిట్ కన్ఫర్మేషన్ సర్టిఫికేట్‌ను 2018లోనే సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇనిస్టిట్యూట్ లిమిటెడ్ (సిఎంపిడిఐ) ప్రతిపాదించిందని భట్టి చెబుతున్నారని, ఆ సిఫార్సు కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల కోసమా? , కోల్ ఎవాక్యుయేషన్ సిస్టమ్ల కోసమా?, స్క్రీనింగ్ లేదా వాషింగ్ ప్లాంట్ల కోసమా? వాస్తవంగానే ఓవర్ బర్డెన్ రిమూవల్ పనుల కోసమా అనేది స్పష్టం చేయలేదన్నారు. గతంలో ఎప్పుడూ కూడా ఒబి పనులకు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం లేదని, 2018 నుంచి 2024సంవత్సరం వరకు ప్రతి ఒబి టెండర్లలో ఈ షరతు లేదని, అలాంటిది ప్రస్తుతం ఈ షరతును ఎందుకు అకస్మాత్తుగా ప్రవేశపెట్టారని హరీశ్‌రావు ప్రశ్నించారు. 2025, జనవరిలో భూపాలపల్లి టెండర్‌కు సైట్ విజిట్ షరతు లేకుండానే రివర్స్ ఆక్షన్ ద్వారా అంచనా రేట్ల కంటే 7 శాతం తక్కువకు పనులు అప్పగించారని, ఈ సమయంలో సైట్ విజిట్ అవసరం లేదా అని అన్నారు. 2025 మేలో వికె ఒసి టెండర్‌కు మాత్రం సైట్ విజిట్ సర్టిఫికేట్ షరతు ను విధించారని, ఫలితంగా అంచనా రేట్లకంటే ఎక్కువ రేట్లకు లబ్ధిదారులు సృజన్ రెడ్డి షోదా కన్‌స్ట్రక్షన్స్‌కు కాంట్రాక్ట్ దక్కిందని, సైట్ విజిట్ సర్టిఫికెట్ షరతు పెట్టడం వల్ల మొట్టమొదటి లబ్ధిదారుడు ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి అని హరీశ్ రావు ఆరోపించారు. ఒక నైని గోల్ బ్లాక్ టెండర్‌ను రద్దు చేయడమే కాదని, సైట్ విజిట్ సర్టిఫికెట్ తో ఖరారైన టెండర్లన్నీ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సాధారణంగా టెండర్ షరతులను మారిస్తే అన్ని కాంట్రాక్టర్లతో సమావేశాన్ని నిర్వహించాలని, ఆ సమావేశంలో అందరి అభిప్రాయాలు తీసుకోవాలని, మినిట్స్ నమోదు చేయాలని, కానీ ఇక్కడ ఆ ప్రక్రియ జరగలేదని, ఈ తతంగం వెనుక ఏం జరిగింది?, మీటింగ్ మినిట్స్ బహిర్గతం చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంలో కింగ్ పిన్ ఏ హోటల్‌లో సమావేశాన్ని నిర్వహించారు?, ముఖ్యమంత్రి బంధువు కూడా ఆ హోటల్‌లో కూర్చున్న ఫోటోలు తమ వద్ద ఉన్నాయని, సమయం వచ్చినప్పుడు అన్ని బహిర్గతం చేస్తామని హరీశ్‌రావు తెలిపారు.



# బహదూర్‌పురాలో ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజినరేగా)ను బలహీనపరుస్తోందని ఆరోపిస్తూ హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) చేపట్టిన ఎంజినరేగా బచావో సంగ్రామ్ యాత్ర రెండో రోజు కొనసాగింది. ఆదివారం నిర్వహించిన పాదయాత్ర గాంధీ విగ్రహం క్రాస్ రోడ్ నుంచి ప్రారంభమై, దూద్‌వాలి గల్లీ, చందూలాల్ బరాదరి, రాంనస్‌పురా, కిషన్‌బాగ్ డివిజన్ల మీదుగా బహదూర్ పురా క్రాస్ రోడ్ వద్ద ముగిసింది. ఈ ర్యాలీలో బహదూరుర్‌పురా అసెంబ్లీ ఇంచార్జి రాజేష్ కుమార్ పులిపాటి, చంద్రాయణగుట్ట ఇంచార్జి బి. నగేశ్, చార్మినార్ ఇంచార్జి మొహమ్మద్ ముజీబుల్లా షరీఫ్, మలక్‌పేట్ ఇంచార్జి షేక్ అక్బర్, యాకుత్‌పురా ఇంచార్జి కె. రవిరాజ్‌తో పాటు ఉజ్మా షకీర్, జి. కన్హయ్యలాల్, సయ్యద్ షా ముజాహిద్ హుస్సేనీ, సయ్యద్ ఇక్బాల్, మీర్ మొహమ్మద్ అలీ, భాను చంద్ర యాదవ్, జ్యోతి శెట్టి, మొహమ్మద్ ఫయాజ్, కృష్ణ కుమార్ తదితర సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక పదాధికారులు పాల్గొనగా, ప్రజల నుంచి ఉత్సాహభరితమైన స్పందన లభించిందని తెలిపారు.

# సీనియర్ నాయకుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐఎస్‌ఎఫ్ ఉద్యమంలో 1970–1980 మధ్యలో క్రియాశీలకంగా రాష్ట్ర స్థాయి, నల్లగొండ జిల్లా స్థాయిలో బాధ్యతలు నిర్వహించిన సీనియర్ నాయకుల ఆత్మీయ సమ్మేళనము ఆదివారం హైదరాబాద్ కర్మన్ ఘాట్‌లోని కొత్త కాపు యాదవరెడ్డి ఫంక్షన్ హాల్‌లో 1970–75లో రాష్ట్రస్థాయిలో సోషల్ ఫీల్ హాస్టల్ విద్యార్థుల సంఘాన్ని ఏర్పాటు చేసి హాస్టల్ విద్యార్థులను సంఘటిత పరిచిన మల్లెపెల్లి ఆదిరెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె. నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటర్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు కందిమల్ల ప్రతాపరెడ్డి, ఎఐటియుసి మాజీ జాతీయ కార్యదర్శి బివి విజయలక్ష్మి, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతోపాటు 100కు పైగా ఆనాటి ఉద్యమంలో బాధ్యతలు ఉన్నవారు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నల్లగొండ జిల్లాలో 1970–80 ప్రాంతంలో ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ ఉద్యమంలో కీలక పాత్ర వహించిన డి రాఘవేంద్రరావు, పల్లా గోవర్ధన్, పాశం రామకృష్ణారెడ్డి, బాధ్యతలు తీసుకొని 1970 దశకములో ఉద్యమంలో పనిచేసి ఉద్యోగరీత్యా వివిధ సంస్థల్లో పనిచేసి రిటైర్మెంట్ అయి ఉన్న హైదరాబాదులో ఉద్యమ నాయకులను ఆత్మీయ సమ్మేళనములకు ఆహ్వానించి నిర్వహించటం అభినందనీయమని పాల్గొన్న వారందరూ హర్షం వ్యక్తం చేశారు. ఇకముందు కూడా సిపిఐ, ప్రజా సంఘాల్లోనూ సామాజిక సేవా బాధ్యతలతో పనిచేస్తామని హర్షదానాల మధ్య తెలిపారు. రిటైర్మెంట్ అయి ఎక్కడెక్కడో నివాసముంటున్న వారందరినీ ఒక వేదిక మీకు తీసుకు రావటం అభినందనీయమని తెలిపారు.

## ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యపై

# గంజాయి స్మగ్లర్ల దాడి హేయమైన చర్య

### విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడే వారిని ఉపేక్షించం: మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గంజాయి అక్రమ రవాణాను అడ్డుకునే క్రమంలో ఎక్సైజ్ సిబ్బందిపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంటుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నిజామాబాద్ జిల్లాలో గంజాయి స్మగ్లర్లు కారుతో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడి, నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై మంత్రి ఆదివారం ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి, సౌమ్యకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో గాయపడిన సౌమ్యకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని మంత్రి జూపల్లి భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది భద్రత, మనోధైర్యం పెంచేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులపై దాడులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించే ప్రసక్తే లేదని, చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.



ఈ ఘటనపై ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసింతో మంత్రి జూపల్లి ఫోన్‌లో సంభాషించారు. కేసు పురోగతి, నిందితుల అరెస్టులు, గంజాయి అక్రమ రవాణా మార్గాలు, ముఠాల కార్యకలాపాలపై సమగ్రంగా చర్చించారు. ఇప్పటికే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను గుర్తించి తక్షణమే అరెస్ట్ చేయాలని, గంజాయి ముఠాలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణా, మత్తుపదార్థాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకోసం ఎక్సైజ్, పోలీస్, ఇతర సంబంధిత శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

**సౌమ్య కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటాం**

**ప్రొహిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్**

ప్రస్తుతం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్య ఆరోగ్య పరిస్థితిపై ప్రొవిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ శ్రీహరికిరణ్ ఆదివారం నేరుగా వెళ్లి వైద్యులతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, పూర్తిస్థాయిలో సౌమ్యను ఆదుకుంటామని, ఆసుపత్రి ఖర్చులు తామే భరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ నుంచి వచ్చే సహాయాన్ని వెంటనే అందించాలని అడిషనల్ కమిషనర్ ఖురేషిని ఆదేశించారు.

## 'ఇసి' జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడం

# ఒక 'విషాదకర ప్రహసనం'

### పశ్చిమబెంగాల్ సిఎం మమతా బెనర్జీ ఎద్దేవా
### బిజెపికి కొమ్ముకాస్తూ ప్రతిపక్షాలను బుల్డోజ్ చేస్తోందని ధ్వజం



**కోల్‌కతా :** కేంద్రంలో పాలకపక్షానికి ఎన్నికల సంఘం (ఇసి) కొమ్ముకాస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ తన తీవ్ర ఆక్షేపణ తెలిపారు. ఎన్నికల సంఘం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడాన్ని ఒక 'విషాదకర ప్రహసనం' అని ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘం 'బిజెపి తరపున' కొమ్ముకాస్తూ ప్రతిపక్షాన్ని బుల్‌డోజింగ్ చేయడం ప్రజాస్వామ్య పునాదులను నాశనం చేయడమేనని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. ఎన్నికల సంఘం తన 'యజమాని స్వరం'గా మారి ప్రజల ఓటు హక్కును లాక్కోవడంలో బిజీగా మారడం శోచనీయమని ముఖ్యమంత్రి మండిపడ్డారు. వారి యజమాని అయిన బిజెపి తరపున ప్రతిపక్షాన్ని భూస్థాపితం చేయడంలో నిమగ్నమై భారత ప్రజాస్వామ్య పునాదులను నాశనం చేస్తోంది అని 'అయినప్పటికీ వారికి ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకునే ధైర్యం ఉంది' అని మమతాబెనర్జీ ఆదివారం తన 'ఎక్స్' పోస్ట్‌లో రాశారు. పశ్చిమ బెంగాల్‌లో కొన్ని నెలల వ్యవధిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్‌ఐఆర్) ను అనవసరమైన తొందరపాటుతో ఇసి నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఆరోపించారు. 'గౌరవనీయ సుప్రీంకోర్టు తీర్పును పాటించడానికి, ప్రజల ప్రజాస్వామ్య ఓటు హక్కులను కాపాడటానికి నియమాలు, నిబంధనల ప్రకారం పనిచేయడానికి బదులుగా, ఎన్నికల కమిషన్ వారిని తిరస్కరించడానికి, వారి నుండి వారి ఎన్నిక ల హక్కులను హరించడానికి ప్రయత్నిస్తున్నందున తార్కిక వ్యత్యాసం పేరుతో భారత ఎన్నికల సంఘం కొత్త సాకులను కనుగొంటోంది'అ ని మమతా బెనర్జీ ఆరోపించారు.

ఎస్‌ఐఆర్ మొదటి దశ పూర్తి అయిన తర్వాత గత ఏడాది డిసెంబరు 16న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 58 లక్షలకు పైగా పేర్లు ఉండటంతో ఓటర్ల సంఖ్య 7.66 కోట్ల నుండి 7.08 కోట్లకు తగ్గింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రెండవ దశ ప్రస్తుతం జరుగుతోంది. 'ఎన్నికలను ప్రజాస్వామ్య పండుగలు అని చెప్పుకోవడం సిగ్గుచేటని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చెబుతూ కానీ మీ పక్షపాత ప్రవర్తన, ఏకపక్ష చట్ట విరుద్ధాలు, సూక్ష్మ పరిశీలకు వేధింపులను పెంచడం, ప్రజలను చావుదెబ్బ కొట్టడం వంటివి మన ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్నాయని, ఈ రోజు మీకు ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకునే హక్కు ఏమాత్రం లేదు' అని మమత నిప్పులు చెరిగారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఎన్నికల సంఘం శనివారం సాయంత్రం తన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జాబితాలో కొంతమంది వ్యక్తుల పేర్లను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిందని ఎన్నికల సంఘానికి చెందిన ఒక అధికారి చెప్పారు. జిల్లా ఎన్నికల అధికారులు జాబితాను డౌన్‌లోడ్ చేసుకుని పంచాయతీ భవన్‌లు, బ్లాక్ కార్యాలయాలలో ప్రదర్శిస్తారు.పశ్చిమ బెంగాల్‌లోని గ్రామ పంచాయతీ భవన్‌లు, తాలూకాల బ్లాక్ కార్యాలయాలు, వార్డు కార్యాలయాలలో 'తార్కిక వ్యత్యాసాల జాబితాలో' ఉన్నవారి పేర్లను శనివారం నాటికి గుర్తించాలని సుప్రీంకోర్టు జనవరి 19న ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో 1.25 కోట్లమంది ఓటర్లు వ్యత్యాసాల జాబితాలో ఉన్నారని గమనించిన ముగ్గురు న్యాయమూర్తుల త్రిసభ్య ధర్మాసనం పత్రాలు, అభ్యంతరాలను సమర్పించడానికి కార్యాలయాలను పంచాయతీ భవనాలు లేదా బ్లాక్ కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించింది. అంతేకాకుండా ఎన్నికల అధికారులకు తగిన సిబ్బందిని అందించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎటువంటి చట్టపరమైన సమస్యలు తలెత్తకుండా అన్ని కార్యకలాపాలు సజావుగా పూర్తి అయ్యేలా చూసుకోవడానికి డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) బాధ్యత వహించాలని కోర్టు ఆదేశించింది.

# సోమశిల సౌందర్యం పర్యాటకానికి మణిహారం

### మంత్రి జూపల్లికృష్ణారావు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నల్లమల అడవుల మధ్య కృష్ణమ్మ ఒడిలో ఒదిగి ఉన్న సోమశిల పర్యాటకకేంద్రం ఆధ్యాత్మికతకు, ప్రకృతి ప్రేమికులకు అద్భుతమైన గమ్యస్థానమని రాష్ట్రపర్యాటక, సాంస్కృతికశాఖ, ఎక్సైజ్‌శాఖమంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. ఆదివారం ఆయన సోమశిల ఎకోటూరిజం పార్కును సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి కృష్ణానది ప్రకృతి అందాలను వీక్షించారు. ఈసందర్భంగా సోమశిలతీరం నుంచి ఎకోపార్కువరకు మంత్రి బోటులో విహరించారు. అక్కడి ప్రకృతి అందాలను, అటవీ , పర్యాటకశాఖ కల్పిస్తున్న మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల సౌకర్యార్థం తెలంగాణ పర్యాటక అభివృద్ధిసంస్థ సోమశిల నుండి శ్రీశైలంవరకు 5గంటలపాటు సాగే ప్రత్యేక బోటింగ్‌సేవలను అందిస్తుందని, ఈప్రయాణంలో నదీతీర అందాలను చూస్తూసాగే ప్రయాణం మధురానుభూతిని కలిగిస్తుందన్నారు.

# 27 నుంచి సీనియర్ మహిళా జాతీయ కబడ్డీ పోటీలు

### మంత్రివాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాసాని 72వ సీనియర్ మహిళ జాతీయ కబడ్డీ చాంఫియన్ షిప్ పోస్టర్ ను రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి*శనివారం హైదరాబాద్ లో ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రితోపాటు రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివాసేన రెడ్డి, క్రీడల విభాగం ఎండీ సోని బాలాజీ, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు కాసాని వీరేశ్, కార్యదర్శి ఎం.మహేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటి చైర్మన్ కాసాని జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ నిర్వహించే 72వ సీనియర్ మహిళ జాతీయ కబడ్డీ చాంఫియన్ షిప్ ను మహిళ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27 నుంచి 30 తేదీ వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.2026 సెప్టెంబర్‌లో జపాన్‌లో జరుగనున్న ఏషియన్ గ్రేమ్స్ కు 72వ సీనియర్ మహిళ జాతీయ కబడ్డీ చాంఫియన్ షిప్ ప్లాట్‌ఫాం కానున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ చాంఫియన్ షిప్ లో 464 అథ్లెట్స్, అంతర్జాతీయ క్రీడాకారులు, అర్జున అవార్డు గ్రహీతలు, కోచ్‌లు, 30 రాష్ట్రాలకు చెందిన జట్లు, భారత రైల్వే టీంలు పాల్గొంటాయని మంత్రి వెల్లడించారు. క్రీడాకారులు, క్రీడా అభిమానుల కోసం క్వార్టర్ ఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లను జీయో హార్ట్ స్టార్ లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారని తెలిపారు. ఛాంపియన్ షిప్ నిర్వహణ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంతోపాటు క్రీడాకారుల కోసం అన్ని వసతులను సమకూరుస్తుందని చెప్పారు. కబడ్డీ ఆటపై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఛాంపియన్ షిప్ లో పాల్గొనాలని మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు.

వాయు కాలుష్యంతో ప్రజలు

# భారీ మూల్యం చెల్లిస్తున్నారు

పిల్లలు, వృద్ధులు ఎక్కువగా నష్టపోతున్నారు : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ:** వాయు కాలుష్యం కారణంగా ప్రజలు తమ ఆరోగ్యం, ఆర్థిక రూపంలో భారీ మూల్యం చెల్లిస్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. పిల్లలు, వృద్ధులు ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళమెత్తాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు రాహుల్ గాంధీ ఆదివారం ఎక్స్‌లో పోస్టు చేశారు. వాయు కాలుష్యం లక్షలాది మంది భారతీయులను ఎలా ప్రభావితం చేసిందో తమ అభిప్రాయాలను తనకు తెలియజేయాలని కోరారు. 'మన ఆరోగ్యం, ఆర్థిక వ్యవస్థతో వాయు కాలుష్యానికి భారీ మూల్యం చేస్తున్నాము. కోట్లాది మంది సాధారణ భారతీయులు ప్రతిరోజూ ఈ భారాన్ని భరిస్తున్నారని రాహుల్‌గాంధీ తెలిపారు. వాయు కాలుష్యం వల్ల పిల్లలు, వృద్ధులే కాకుండా ముఖ్యంగా నిర్మాణ కార్మికులు, రోజు వారీ వేతన జీవుల జీవనోపాధి తీవ్రంగా ప్రభావితమవుతుందన్నారు. వచ్చే శీతాకాలం వరకు సంక్షోభాన్ని మరచిపోలేమని పేర్కొంటూ, 'మార్పు వైపు మొదటి అడుగు మన గొంతులను లేవనెత్తడం' అని ఎక్స్‌లో రాసుకొచ్చారు. 'వాయు కాలుష్యం మిమ్మల్ని లేదా మీ ప్రియమైన వారిని ఎలా ప్రభావితం చేసిందో' అనే కథనాన్ని https://rahulgandhi.in/awaaz bharatkiలో పంచుకోవాలని ఆయన ప్రజలను కోరారు. 'మీ గొంతు ముఖ్యం, దానిని లేవనెత్తడం నా కర్తవ్యం' అని ఆయన అన్నారు. రాహుల్‌గాంధీ పదే పదే వాయు కాలుష్యం అంశాన్ని లేవనెత్తుతున్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ అంశంపై చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# నేడు ఢిల్లీలో భారీ భద్రత నడుమ...

# భారత 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల ప్రదర్శన

ప్రత్యేక ఆకర్షణగా ప్రధాన ఆయుధ వ్యవస్థల నమూనాల శకటాల ప్రదర్శనలు



**న్యూఢిల్లీ:** ఉగ్రవాదులు దేశరాజధాని ఢిల్లీలో విధ్వంసకర చర్యలకు పాల్పడవచ్చన్న నిఘావర్గాల సమాచారం నేపథ్యంలో భారీ భద్రత నడుమ భారత ప్రభుత్వం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు సమాయత్తమైంది. భారతదేశం నేడు (సోమవారం) నిర్వహించనున్న 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తన అభివృద్ధి ప్రయాణం, సాంస్కృతిక వైవిధ్యం, సైనిక బలశక్తిని కొత్తగా ఏర్పరచబడిన యూనిట్లు , ఆపరేషన్ సిందూర్ సమయంలో అభివృద్ధి చేయబడిన ప్రధాన ఆయుధవ్యవస్థల నమూనాలను ప్రదర్శించనుంది. దేశ రాజధానిలో జరిగే ఈ కార్యక్రమానికి యురోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, యురోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లేయన్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నారు. కర్తవ్యపథంలో జరిగే ఈ కార్యక్రమం ప్రధాన ఇతివృత్తం '150 సంవత్సరాల వందేమాతరం' ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నాయకత్వం వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10 30 గంటలకు ప్రారంభమై 90 నిమిషాలపాటు అంటే 12గంటల సమయానికి ముగియనుంది. ఇది ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని సందర్శించడంతో ప్రారంభం అవుతుంది. అక్కడ ఆయన అమరవీరులకు పుష్పగుచ్ఛం అందించడం ద్వారా దేశానికి నివాలులు అర్పిస్తారు. రాష్ట్రపతి, ముఖ్య అతిథులు 'సాంప్రదాయ బగ్గీ' లో వేదిక వద్దకు వస్తుండగా రాష్ట్రపతి అంగరక్షకులు వారికి ఎస్కార్ట్‌గా అనుసరించడం జరుగుతుంది. వివిధత మే ఏక్తా (భిన్నత్వంలో ఏకత్వం) అనే థీమ్‌తో జరిగే ఈ కవాతులో దాదాపు 100మంది సాంస్కృతిక కళాకారులు పాల్గొంటారు. ఈ కవాతు దేశ ఐక్యతను. గొప్ప సాంస్కృతిక వైవిధ్యాన్ని ప్రదర్శించే సంగీతవాయిదాల అద్భుతమైన ప్రదర్శనగా ఉండనుంది. ధ్వజ్ ఫార్మేషన్‌లోని 129 హెలికాప్టర్ యూనిట్‌కు చెందిన నాలుగు ఎంఐ17 ఐవి హెలికాప్టర్లు పూల రేకుల వర్షం కురిపించనున్నాయి. అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గౌరవ వందనం స్వీకరించడంతో కవాతు ప్రారంభం అవుతుంది. ఈ కవాతుకు సెకండ్ జనరేషన్ ఢిల్లీ ఏరియా జనరల్ ఆఫీస్ కమాండింగ్ పరేడ్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ భావ్‌నీశ్ కుమార్ నాయకత్వం వహిస్తారు. అత్యున్నత శౌర్యపతకాలను గెల్చుకున్న గర్వించదగ్గ విజేతలు వారి వారి బృందాలకు సారథ్యం వహించనున్నారు. ఆ జట్టులో పరమవీరచక్ర విజేతలుసుబేదార్ మేజర్ (గౌరవనీయ కెప్టెన్) యోగేంద్ర సింగ్ యాదవ్ (రిటైర్డ్), సుబేదార్ మేజర్ సంజయ్‌కుమార్ సారథ్యం వహించబోతున్నారు. అశోక్ చక్ర విజేతలు మేజర్ జనరల్ సి.ఎ. పితవాలియా (రిటైర్డ్), కల్నల్ డి. శ్రీరామ్ కుమార్ కూడా ఈ టీమ్‌లో భాగం అవుతారు. అంతేకాకుండా యురోపియన్ యూనియన్‌కు చెందిన ఒక చిన్న సైనిక దళం కూడా ఈ కవాతులో కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది. తొలిసారిగా ఈ కవాతులో భారత సైన్యం దశలవారీ శ్రేణి ఫార్మాట్ ప్రదర్శించబడనున్నది. ఇందులో హై మొబిలిటీ నిఘా వాహనం, భారత దేశం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఆర్మర్డ్ లైట్ స్పెషలిస్ట్ వెహికిల్ వంటి వాటి ఏరియల్ సపోర్ట్ కూడా ఉంటుంది. స్వదేశీ ధృవ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ దాని సాయుధ వెర్షన్ రుద్ర, ప్రహార్ నిర్మాణంలో వైమానిక సహాయాన్ని అందిస్తాయని, ఇది యుద్ధ భూమి ఆకృతిని ప్రదర్శిస్తుందని అధికారులు తెలియజేశారు. అనంతరం పోరాట అంశాలు టి90 భీష్మతో ఉంటాయి. అపాచీ ఏహెచ్64ఇ, ప్రచండ్ తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల నుండి వైమానిక దాడులతో సెల్యూలైటింగ్ వేదికను దాటి దూసుకుపోతున్న ప్రధాన యుద్ధ ట్యాంక్ అర్జున్‌కు సంబంధించినవి అనుసరిస్తాయి. ఇతర యాంత్రికస్తంభాలలో నాగ్ క్షిపణి వ్యవస్థ (ట్రాక్ట్) ఎంకె2 తోపాటు బిఎంపిII పదాతి దళ పోరాట వాహనం ఉంటాయి. మే ప్రారంభంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైన్యం మోహరించిన ప్రధాన ఆయుధ వ్యవస్థల ప్రతిరూపాలను ప్రదర్శించే త్రివిధ దళాల శకటం ప్రధాన ఆకర్షణగా నిలువనుందని భావిస్తున్నారు. జాతీయ భద్రతా సవాళ్లను ప్రతిస్పందించడానికి భారతదేశం సంకల్పాన్ని ఈ శకటం ప్రతిబింబిస్తుంది. ఆపరేషన్ సిందూర్ నిర్వహణను క్లుప్తంగా వర్ణించే గాజుతో కప్పబడిన ఇంటిగ్రేటెడ్ ఆపరేషనల్ సెంటర్ కర్తవ్య మార్గంలో కూడా కదులుతుంది. భారత నావికాదళంలో 144మంది యువ సిబ్బంది ఉంటారు. వీరికి లెఫ్టినెంట్ కరణ్ నగ్యాల్ నాయకత్వం వహించగా, కాంటిజెంట్ కమాండర్‌గా లెఫ్టినెంట్ పవన్ కుమార్ గాండి, లెఫ్టినెంట్ ప్రీతి కుమారి, లెఫ్టినెంట్ వరుణ్ ద్రేవేరియా ప్లాటూన్ కమాండర్లుగా ఉంటారు. దీని తర్వాత బలమైన దేశం కోసం బలమైన నావికాదళం అనే ఇతివృత్తాన్ని ప్రదర్శించే నావికా శకటం ఉంటుంది. ఈ శకటం 5వ శతాబ్దానికి చెందిన ఒక ఓడను వర్ణిస్తుంది. ఇప్పుడు దీనిని ఐఎన్ఎస్‌వి కౌండిన్య అని పిలుస్తున్నారు. మరాఠా నావికాదళం గురాబ్ తరగతి నౌకలను, విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఉదయగిరితో సహా ఫ్రంట్ లైన్ స్వదేశీ వేదికలను వర్ణిస్తుంది. కర్తవ్య మార్గంలో మొత్తం 30శకటాలు, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, 13 వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలు ప్రదర్శించబడతాయి. ఈ శకటం జాతీయగీతం వందేమాతరం 150సంవత్సరాల ప్రత్యేక మిశ్రమ, దేశం శరవేగంతో కూడిన పురోగతిని ప్రదర్శించనుంది.ఈ ఏడాది ప్రతీ రాష్ట్రం, కేంద్రపాలిత పారంతం నుండి దాదాపు 2,500 మంది సాంస్కృక కళాకారులు కర్తవ్యపథంలో ప్రదర్శనలు ఇవ్వబోతున్నారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్), సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి)నుండి తీసుకోబడిన మోటార్ సైకిల్ రైడర్ల ఉమ్మడి డేర్‌డెవిల్స్ బృందం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ప్రదర్శితం కానున్నది. కవాతులో అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న కార్యక్రమాలలో ఒకటైన ఈ వైమానిక విన్యాసంలో 16 ఫైటర్ జెట్లు, 4 రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు సహా మొత్తం 29 వైమానిక దళం భాగస్వామ్యం కానున్నాయి. వీటిలో రాఫెల్ ఎస్‌యు30 ఎంకెI, ఎంఐజి29, జాగ్వార్ ఎయిర్ క్రాఫ్ట్ ఉన్నాయి. వీటితో పాటు వ్యూహాత్మక ఆస్తులు సి130, సి295, భారత నావికాదళం పి8i విమానాలు కూడా ఉన్నాయి. వీటిలో అర్జున్, వజ్రాంగ్, వరుణ, విజయ్ ఉన్నాయి.

ప్రజాస్వామ్య ప్రక్రియల్లో పాల్గొనడం

# ఓటర్లకు లభించే గొప్ప అవకాశం

ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి



**న్యూఢిల్లీ:** ఓటరుగా ఉండటం కేవలం రాజ్యాంగపరమైన హక్కు మాత్రమే కాదు... భారత దేశ భవిష్యత్తును రూపొందించడంలో ప్రతి పౌరుడికి గళాన్ని ఇచ్చే ముఖ్యమైన విధి అని ప్రధానమంత్రి నరేంద్ర మో డీ పేర్కొన్నారు. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియల్లో ప్ర జలు పాల్గొనాలని కోరారు. భారత ఎన్నికల సం ఘం స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా 'మై – భారత్' వలంటీర్లకు రాసిన లేఖలో భారతదేశ అభివృద్ధి ప్రయాణంలో విధిని నిర్ణయించేవారు (భాగ్య విధాత) ఓటర్లని ఆయన అభివర్ణించారు. ఓటరుగా ఉండటం ప్రజాస్వామ్యంలో గొప్ప హక్కు, బాధ్యత అని, ఓటు వేయడం అనేది పవిత్రమైన రాజ్యాంగ హక్కు అన్నారు. భారతదేశ భవిష్యత్తులో పాల్గొనడానికి గుర్తుని చెప్పారు. ఓటరు మన అభివృద్ధి ప్రయాణంలో భాగ్య విధాత, వేలుపై ఉన్న ఆ చెరగని సిరా మన ప్రజాస్వామ్యం ఉత్సాహంగా, ఉద్దేశపూర్వకంగా ఉండేలా చూసే గౌరవ చిహ్నం అని మోదీ వివరించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను బలోపేతం చేయడానికి భారత ఎన్నికల కమిషన్‌తో అనుబంధించబడిన వారందరినీ అభినందిస్తున్నానన్నారు. 'ప్రజాస్వామ్య ప్రక్రియలలో ఎల్లప్పుడూ పాల్గొనడం ద్వారా మన ప్రజాస్వామ్య స్ఫూర్తిని గౌరవిద్దామని, తద్వారా వికసిత్ భారత్ పునాదులను బలోపేతం చేద్దామని చెప్పుకొచ్చారు. భారతదేశాన్ని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ప్రజలు అభివర్ణిస్తారని, అదే సమయంలో, ఇది ప్రజాస్వామ్యానికి తల్లి అని కూడా ఆయన తరచుగా చెబుతూ ఉంటారు. 'మన నారీ శక్తి, ముఖ్యంగా యువతుల భాగస్వామ్యం, సమ్మిళిత ప్రజాస్వామ్యానికి చాలా ముఖ్యమైనదని నొక్కి చెప్పాలనుకుంటున్నాను.

# 982 మందికి పోలీస్ పతకాలు



**న్యూఢిల్లీ:** గణతంత్ర దినోత్సవం సందర్భంగా 982 మంది పోలీసు, అగ్నిమాపక, హోంగార్డు, పౌర రక్షణ, దిద్దుబాటు సేవల సిబ్బందికి శౌర్య, వివిధ సేవా పతకాలను ప్రదానం చేయనున్నారు. ఈ అవార్డులలో 125 శౌర్య పతకాలు (గ్యాలంటరీ మెడల్స్ (జిఎం)) ఉన్నాయని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. జమ్ము కశ్మీర్ ఆపరేషన్స్ థియేటర్‌లో మోహరించిన సిబ్బందికి 45 మందితో గరిష్టంగా సాహస పతకాలు వరించాయి. తరువాత 35 మంది నక్సల్ హింస ప్రభావిత ప్రాంతాల నుండి, ఈశాన్య ప్రాంతంలో నియమించబడిన ఐదుగురు ఉన్నారు. శౌర్య పతక విజేతలలో నలుగురు అగ్నిమాపక దళ రక్షకులు ఉన్నారని మంత్రిత్వశాఖ పేర్కొంది. జమ్ముకశ్మీర్ పోలీసులకు అత్యధికంగా 33 మంది శౌర్య పతకాలు రాగా, 31 మంది మహారాష్ట్ర పోలీసులకు, 18 మంది ఉత్తరప్రదేశ్ పోలీసులకు, 14 మంది ఢిల్లీ పోలీసులకు లభించాయి. కేంద్ర సాయుధ పోలీసు దళాలలో 12 పతకాలతో ధైర్య ప్రశంసలు పొందిన ఏకైక దళం సిఆర్‌పిఎఫ్. ఈ జాబితాలో అధికారులు, సిబ్బందికి 101 రాష్ట్రపతి విశిష్ట సేవా పతకం (పిఎస్ఎం), మెరిటోరియస్ సర్వీస్ (ఎంఎస్ఎం)కు 756 పతకాలు వచ్చాయి.

**31 మంది సిబిఐ అధికారులకు కూడా...**

కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య, హేతువాది నరేంద్ర దభోల్కర్ హత్య కేసు దర్యాప్తులను పర్యవేక్షించిన సిబిఐ అధికారులు 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా పోలీసు పతకాలు అందుకున్న కేంద్ర దర్యాప్తు సంస్థకు చెందిన 31 మంది సిబ్బందిలో ఉన్నారు. గుజరాత్ కేడర్‌కు చెందిన 2000 బ్యాచ్ ఐపిఎస్ అధికారి జాయింట్ డైరెక్టర్ వి చంద్రశేఖర్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం లభించింది. కోల్‌కతా ఆసుపత్రిలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన దారుణమైన అత్యాచారం, హత్య కేసు దర్యాప్తును ఏజెన్సీ జాయింట్ డైరెక్టర్‌గా అధికారి పర్యవేక్షించారు. పోలీస్ సూపరింటెండెంట్ అమిత్ శ్రీవాస్తవ, అదనపు పోలీసు సూపరింటెండెంట్ ముఖేష్ శర్మ, సబ్‌ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ కుమార్ యాతి, అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ చమన్ లాల్ , హెడ్ కానిస్టేబుల్ రాము గొల్లలకు కూడా రాష్ట్రపతి విశిష్ట సేవ పతకం లభించింది. ఈ ఏజెన్సీ నుండి ఇరవై ఐదు మంది అధికారులకు మెరిటోరియస్ సర్వీస్ కోసం పోలీస్ మెడల్ లభించింది. వీరిలో ఏజెన్సీలో జాయింట్ డైరెక్టర్‌గా నియమితులైన 2007 బ్యాచ్ ఐపిఎస్ అధికారి సి. వెంకట సుబ్బారెడ్డి, ఉత్తరాఖండ్‌లోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా తన కేడర్‌లో చేరడానికి ఏజెన్సీని డిఐజిగా విడిచిపెట్టిన సదానంద్ శకర్‌రావు డేటే ఉన్నారు. డిప్యూటీ లీగల్ అడ్వైజర్ మన్మోహన్ శర్మ; అదనపు ఎస్పీలు బైద్యనాథ్ సమల్ , కైలాష్ సాహు; డిప్యూటి ఎస్పీలు రూబీ చౌదరి, మనీష్ కుమార్ ఉపాధ్యాయ్, అన్మోల్ సచన్, నిషు కుష్వాహా, అరిజిత్ సిన్హా, శరద్ సురేశ్ భవార్, తాహిర్ అబ్బాస్ పి, ధర్మేంద్ర కుమార్‌లు మెరిటోరియస్ సర్వీస్ (పిఎంఎంఎస్)కు పోలీసు మెడల్ పొందిన వారిలో ఉన్నారు. ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్, ప్రోగ్రామర్ దీప్తి వశిష్ట, ఎస్ఐ వినోద్ కుమార్, ఆఫీసర్ సూపరింటెండెంట్ నారికోటే నందిని, హెడ్ కానిస్టేబుళ్లు నేత్రమ్ చౌరసియా, పురాణ్ మల్ గుజ్జర్, భోలా రాయ్, బాబు వర్గీస్, విక్రమ్ సింగ్, అలాగే కానిస్టేబుళ్లు సంజీవ్ కుమార్, వైఖోమ్ రాజేష్ సింగ్‌లకు కూడా ప్రధాన మంత్రి అవార్డు లభించింది.

# మిగిలిన రాష్ట్రాల్లో త్వరలో 'సర్'

పారదర్శక ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్



**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా మిలిగిన రాష్ట్రాల్లో కూడా త్వరలోనే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అమలు చేస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఇసి) జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. పారదర్శక ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది అని స్పష్టం చేశారు. జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ సజావుగా జరుగుతోంది. స్వచ్ఛమైన ఓటర్ల జాబితాలే ప్రజాస్వామ్యానికి పునాది. ఆ లక్ష్యంతోనే అర్హత గలిగిన ప్రతి ఓటరి పేరు జాబితాలో చేర్చాం. అనర్హుల పేర్లను తొలగించడం కోసమే ఈ ఎస్ఐఆర్‌ను ప్రారంభించాం. బిహార్‌లో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. అక్కడ ఓటర్లు తుది జాబితాపై ఒక్క అప్పీల్ కూడా దాఖలు కాలేదు. ఇది ఎస్ఐఆర్ ప్రక్రియ విశ్వసనీయతకు నిదర్శనం. అసోంలో ఎస్ఐఆర్ ప్రక్రియ జరుగుతోంది. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కూడా త్వరలోనే అమలు చేస్తాం' అని జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు.

**అంతర్జాతీయ స్థాయిలో భారత ఎన్నికల నిర్వహణకు గుర్తింపు**

బిహార్‌లో ఎస్ఐఆర్ తర్వాత నిర్వహించిన ఎన్నికలు చారిత్రాత్మక మైలురాయిగా నిలిచాయని జ్ఞానేశ్ కుమార్ అన్నారు. 1951 తర్వాత అత్యధికంగా 67.13 శాతం ఓటింగ్ నమోదైందని తెలిపారు. ఇంతవరకు లేనంతగా మహిళ ఓటర్లు 71.78శాతం మంది పాల్గొన్నారు. భారత్ ఎన్నికల నిర్వహణలో ప్రపంచ నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లు సిఇసి తెలిపారు. ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెమొక్రసీ అండ్ ఎలక్ట్రోరల్ అసిస్టెంట్ (ఐడిఇఏ) అధ్యక్షత బాధ్యతను భారత్‌కు అప్పగించినట్లు చెప్పారు. జనవరి 21 నుంచి 23 వరకు జరిగిన ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఎన్నికల నిర్వహణ సదస్సును ఇసి నిర్వహించినట్లు తెలిపారు. ఈ సదస్సులో 70కు పైగా దేశాల ఎన్నికల సంఘాల అధిపతులు, సీనియర్ అధికారులు హాజరైనట్లు వెల్లడించారు.

**'ఇసి విజయాల సంవత్సరం 2025'**

2025 సంవత్సరాన్ని ఎన్నికల సంఘం విజయాలు, ఆవిష్కరణల సంవత్సరంగా జ్ఞానేష్ పేర్కొన్నారు. సుమారు 30 కీలక కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. వాటిలో భాగంగా, ఢిల్లీలో ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 5వేల మందికిపైగా బూత్ లేవల్ అధికారులు పర్యవేక్షకులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే ఓటర్ల సౌలభ్యానికి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు. ఇసిఐనెట్ యాప్ ప్రారంభం అన్ని ఓటరు సేవలను ఒకే డిజిటల్ వేదికపై అందుబాటులోకి తీసుకొచ్చిందని చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో మొబైల్ డిపాజిట్ సదుపాయం, ఒక్కో పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్ల పరిమితి చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

# నిరంతర ఒత్తిడిలో ఎన్నికల కమిషన్

దాని స్వతంత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది : ఖర్గే

**న్యూఢిల్లీ :** ఇటీవలి కాలంలో ఎన్నికల కమిషన్ వంటి సంస్థలు నిరంతర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. అందువల్ల ప్రజాస్వామ్యం మనుగడ సాగించడమే కాకుండా నిజంగా అభివృద్ధి చెందేలా వాటి స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవడం మన బాధ్యత అని చెప్పారు. 'ఓటు చోరీ' ప్రణాళిక లేని 'సర్' ద్వారా ఓటు హక్కును లాక్కోవడం వల్ల భారత ప్రతిష్టాత్మకమైన ప్రజాస్వామ్యం మసకబారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆదివారం ఖర్గే ఎక్స్‌లో పోస్టు చేస్తూ నేడు ఒక దేశ భవిష్యత్తు ప్రజలపైనే ఉందని, మన సమష్టి స్వరం ఉమ్మడి విధిని రూపొందించగలదన్నారు. 'భారత ప్రజలు స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన, నిర్భయమైన ఎన్నికలకు అర్హులు. ఇక్కడ సచ్ఛమైన ఓటర్ల జాబితాలు, సమాన స్థాయి ఆట స్థలం ప్రాథమిక అవసరం అని ఖర్గే పేర్కొన్నారు. భారతదేశం గణతంత్ర రాజ్యంగా మారడానికి ఒక రోజు ముందు, జనవరి 25, 1950న ఎన్నికల సంఘం స్థాపించబడింది. గత 16 సంవత్సరాలుగా, ఈ రోజును జాతీయ ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ మార్క్ టుల్లీ కన్నుమూత



**న్యూఢిల్లీ :** ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ మార్క్ టుల్లీ (90) కన్నుమూశారు. ఢిల్లీలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన తుదిశ్వాస విడిచారు. అక్టోబర్ 24, 1935న కోల్‌కతాలో జన్మించారు. 1960 నుంచి ఆయన జర్నలిస్టుగా సేవలందించారు. అంతర్జాతీయ మీడియా సంస్థ బిబిసిలో న్యూఢిల్లీ బ్యూరో చీఫ్‌గా రెండు దశాబ్దాలకుపైగా సేవలందించారు. రచయితగానూ సత్తా చాటారు. దక్షిణాసియాకు సంబంధించిన అనేక అంశాలతో పాటు చారిత్రక, రాజకీయ నేపథ్యం ఉన్న వార్తల్లో తనదైన ముద్రవేశారు. దేశాన్ని కుదిపేసిన ఆపరేషన్ బ్లూ స్టార్ (1984)పై ఆయన విశ్లేషణాత్మక కథనాలు అందించారు. బిబిసి రేడియోలోనూ సేవలందించారు. 'సంథింగ్ అండర్‌స్టుడ్' కార్యక్రమాన్ని నిర్వమించారు. ఫారిన్ కరస్పాండెంట్‌గా జాతీయ, అంతర్జాతీయ అంశాలను బిబిసి ద్వారా ప్రజలకు అందించారు. సంస్థకు ఇండియా తరఫున బ్యూరో చీఫ్‌గా అత్యధిక కాలం సేవలందించి ఆయనే. మరోవైపు రచయితగానూ సత్తా చాటారు. నో ఫుల్ స్టాప్స్ ఇన్ ఇండియా, ఇండియా ఇన్ స్లో మోషన్, ద హార్ట్ ఆఫ్ ఇండియా వంటి పుస్తకాలు రచించారు. రచయితగా, జర్నలిస్టుగా ఆయన అందించిన సేవలకు పలు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు దక్కాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆయనకు 1992లో పద్మశ్రీ పురస్కారం దక్కగా, 2005లో పద్మభూషణ్ పురస్కారం దక్కింది. 2002లో నైట్ హుడ్ పురస్కారాన్ని కూడా అందుకున్నారు. టుల్లీ మృతికి పలువురు రాజకీయ నేతలు, జర్నలిస్టులు సంతాపం ప్రకటిస్తున్నారు.

# 'హిందీ'కి తమిళనాడులో ఎప్పటికీ స్థానం లేదు

భాషా అమరవీరుల దినోత్సవంలో సిఎం స్టాలిన్ స్పష్టీకరణ



**చెన్నై :** తమిళనాడులో హిందీకి ఎప్పటికీ స్థానం లేదని, భవిష్యత్తులోనూ ఉండదని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. గతంలో హిందీ వ్యతిరేక ఆందోళనలో ప్రాణ త్యాగం చేసిన రాష్ట్రంలోని 'భాషా అమరవీరులను' డిఎంకె అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదివారం ప్రశంసించారు. భాషా అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారికి నివాళి అర్పించారు. తమిళ భాషను ప్రాణంలా ప్రేమించే రాష్ట్రంలో హిందీ విధించడంపై ఐక్యంగా పోరాడిందన్నారు. హిందీని రాష్ట్ర ప్రజలపై రుద్దాలని చూసిన ప్రతిసారీ అదే తీవ్రతతో నిరసన తెలిపారన్నారు. అప్పుడు, ఇప్పుడు మరియు ఎప్పటికీ (తమిళ్‌లో) హిందీకి చోటు లేదని సామాజిక మాధ్యమంలో స్టాలిన్ పేర్కొన్నారు. 1965లో తారాస్థాయికి చేరుకున్న హిందీ వ్యతిరేక ఆందోళనకు సంబంధించిన చరిత్ర సంక్షిప్త వీడియోను షేర్ చేశారు. అందులో అమరవీరుల ప్రస్తావనలు, భాషా సమస్యలో దివంగత డిఎంకె ప్రముఖులు సిఎన్ అన్నాదురై, ఎం కరుణానిధి చేసిన కృషి కూడా ఉంది. కాగా, హిందీ వ్యతిరేక ఆందోళనకు నాయకత్వం వహించడం ద్వారా తమిళనాడు ఉపఖండంలోని వివిధ భాషా జాతీయ జాతుల హక్కు, గుర్తింపును కాపాడుకుందని స్టాలిన్ అన్నారు. 'తమిళం కోసం తమ విలువైన ప్రాణాలను అర్పించిన అమరవీరులకు నా కృతజ్ఞతాపూర్వక నివాళులు అర్పిస్తున్నాను. భాషా యుద్ధంలో ఇక ప్రాణం పోదు; తమిళం పట్ల మన ప్రేమ ఎప్పటికీ చనిపోదు! హిందీ విధించడాన్ని మేము ఎప్పటికీ వ్యతిరేకిస్తాము' అని ముఖ్యమంత్రి అన్నారు. భాషా అమరవీరులు తలముత్తు, నటరసన్ స్మారక చిహ్నం వద్ద కూడా ముఖ్యమంత్రి నివాళులర్పించారు. అంతేకాకుండా, నగరంలోని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సిఎండిఎ) భవనంలో వారి ప్రతిమలను ఆయన ప్రారంభించారు. 1964–65లో తమిళనాడు అంతటా జరిగిన హిందీ వ్యతిరేక ఆందోళనలో ప్రధానంగా ఆత్మాహుతి ద్వారా తమ ప్రాణాలను త్యాగం చేసిన వారిని భాషా అమరవీరులు అంటారు. ఈ రోజు వరకు దక్షిణాది రాష్ట్రం తమిళం, ఇంగ్లీష్ రెండు భాషా సూత్రాన్ని అనుసరిస్తుంది. కేంద్రం ఎన్ఇపి–2020 ద్వారా హిందీ విధించాలని చూస్తోందని డిఎంకె ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, ప్రతిపక్ష నేతలు ఎఐఎడిఎంకె చీఫ్ ఎడప్పాడి కె పళనిస్వామి, తమిళగ వెట్రి కజగం నాయకుడు విజయ్ కూడా భాషా అమరవీరులకు నివాళులు అర్పించారు. తమిళ తల్లి మన ప్రాణంతో సమానం అని రాష్ట్ర ప్రతిపక్ష నాయకుడు కూడా అయిన పళనిస్వామి సోషల్ మీడియా పోస్ట్‌లో అన్నారు.

# ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ యాదవ్



**పాట్నా:** బిహార్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు తేజస్వి ప్రసాద్ యాదవ్ రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. పార్టీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఆదివారం పాట్నాలోని ఒక హోటల్‌లో జరిగిన ఆర్‌జెడి జాతీయ కార్యవర్గ సమావేశం తర్వాత తేజస్వీ యాదవ్ నియామకాన్ని ప్రకటించారు. కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో లాలూ ప్రసాద్, రబ్రీ దేవి, మిషా భారతి, పార్టీలోని ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. బిహార్ ఆర్‌జెడి చీఫ్ మంగని లాల్ మండల్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తేజస్వీ నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. తేజస్వి మరింత బాధ్యతగా వహించాలని సమావేశంలో ఉన్న నాయకులలో విస్తృత ఏకాభిప్రాయం ఉందని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు తెలిపారు. తేజస్వీ సోదరుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్, సోదరి రోహిణి ఆచార్య ఎన్నికల్లో పార్టీ పరాజయానికి ఆయనను, ఆయన సహచరులను నిందించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉ ఒడగా, తేజస్వీని ఆర్‌జెడి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించినట్లు వార్తలు వెలువండిన వెంటనే రోహిణి తేజస్వీని లక్ష్యంగా చేసుకుని, తన సన్నిహితులు ఆర్‌జెడి ఎంపి సంజయ్ యాదవ్, మాజీ ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ రమీజ్ నేమత్ ఖాన్‌లను చొరబాటుదారులు, కుట్రదారులుగా అభివర్ణించారు. సమావేశానికి కొన్ని గంటల ముందు, ఆ తర్వాత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఉదయం పార్టీ నియంత్రణ ద్రోహులు, కుట్రదారుల చే తుల్లోకి వెళ్లిపోయిందని ఆరోపించారు. ప్రత్యర్థులు పంపిన వ్యక్తులే ఇప్పుడు పార్టీని నాశనం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఆమె ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. పార్టీ పరిస్థితిపై బాధ్యత వహించాల్సిన నేతలు ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం పాటిస్తున్నారని రోహిణి విమర్శించారు. లాలువాద్ సిద్ధాంతాన్ని కాపాడాల్సినవారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. శ్రేయస్సు కోసం మాట్లాడేవారిని దుర్భాషలాడుతున్నారని పేర్కొన్నారు.

జరిగేది ఎన్నికల పోరుకాదు...

# ప్రజాస్వామ్య యుద్ధం



తమిళనాడు ఎన్నికల్లో ఒంటరిగానే విజయం సాధిస్తాం : విజయ్

**మామల్లపురం:** త్వరలో తమిళనాడులో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను కేవలం ఎన్నికల పోటీగా కాకుండా అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య యుద్ధంగా టివికె చీఫ్ విజయ్ అభివర్ణించారు. స్థిరపడిన రాజకీయ శక్తులను సవాలు చేయడానికి తన పార్టీది ప్రత్యేక స్థానం అని అన్నారు. 'ఇప్పుడు జరగబోయేది కేవలం ఎన్నికలు కాదు; ఇది ప్రజాస్వామ్య యుద్ధం. ఈ ప్రజాస్వామ్య యుద్ధానికి నాయకత్వం వహించబోయే కమాండర్లు మీరే' అని ఆదివారం చెన్నైలో జరిగిన తమిళగ వెట్రి కజగం (టివికె) కార్యకర్తల సమావేశంలో పార్టీ చీఫ్ విజయ్ అన్నారు. ప్రస్తుతం పాలిస్తున్న 'దుష్టశక్తి'ని, గతంలో రాష్ట్రాన్ని పరిపాలించిన 'అవినీతి శక్తి'ని ఎదుర్కోవడానికి ధైర్యం, వైఖరి టివికె మాత్రమే ఉందని విజయ్ ప్రకటించారు. అధికార డిఎంకె, ప్రతిపక్ష ఎఐఎడిఎంకెనుద్దేశించి పరోక్షంగా వ్యాఖ్యానించారు. 'ఈ దుష్టశక్తి అయినా లేదా ఆ అవినీతి శక్తి అయినా, రెండూ తమిళనాడును పాలించకూడదు. అటువంటి పార్టీలను నిజాయితీగా, ధైర్యంగా వ్యతిరేకించే ధైర్యం, వైఖరి తమకు మాత్రమే ఉంది అని విజయ్ అన్నారు. హాని కలిగించాలని అనుకునే వారి నుండి ప్రజలను, భూమిని రక్షించడానికి తాము అండగా ఉంటామని భరోసానిచ్చారు. తన రాజకీయ ప్రవేశ ప్రధాన లక్ష్యాన్ని కూడా ఆయన వివరించారు. తాము ఎవరి కోసమో లేదా దేని కోసం ఎప్పుడూ రాజీ పడబోమన్నారు. తనపై అవినీతి మరక పడబోనీయనన్నారు. రాజకీయ ఒత్తిడి లేదా జాతీయ పార్టీలకు లొంగిపోవడం అనే పుకార్లను కూడా ఆయన తోసిపుచ్చారు. గత పాలకులు 'బిజెపికి బానిసలు' అని ఆయన ఆరోపించారు. ప్రస్తుత డిఎంకె ప్రభుత్వం ఆకర్షణీయమైన ప్రకటనల పరోక్షంగా లొంగిపోయిందన్నారు. కానీ వ్యవస్థను శుభ్రపరచడం అనేది ఒక ప్రక్రియ అని, వ్యక్తిగత లాభం కోరుకోని నాయకుడు అవసరమని ఆయన ఒప్పుకున్నారు. తన పార్టీ కార్యకర్తలను 'ఫ్రంట్‌లైన్ యోధులు', 'కమాండర్లు' అని ముద్ర వేస్తూ, ప్రత్యర్థులు తన బలాన్ని తక్కువగా అంచనా వేస్తున్నప్పటికీ, ప్రజలు ఇప్పటికే తనకు స్పష్టమైన ఆదేశాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నారని విజయ్ పేర్కొన్నారు. ఇతర పార్టీలకు బూత్ అనేది ఓటు వేయడానికి, కొన్నిసార్లు ఓట్లను దొంగిలించడానికి ఒక స్థలం అని పేర్కొంటూ, తన పార్టీకి, బూత్‌లు 'ప్రజాస్వామ్య మందిరాలు' అని ఆయన నొక్కి చెప్పారు. టివికె సైన్యం చాలా ధైర్యంగా ఉందని, ఒంటరిగా నిలబడినా గెలవగలదన్నారు. కాగా, సమావేశంలో విజయ్ తన పార్టీ చిహ్నమైన 'విజిల్' ను ఆవిష్కరించారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
సోమవారం
26-01-2026
www.prajapaksham.in


# వికసించిన సాహితీ కుసుమాలు

మిగతా రంగాలతో పోలిస్తే, ఈ ఏడాది పద్మ అవార్డుల్లో సాహిత్యం–విద్యకు అధిక ప్రాధాన్యం దక్కింది. ఒకరికి పద్మవిభూషణ్, ముగ్గురికి పద్మభూషణ్ అవార్డులు లభించడం సాహిత్యానికి లభించిన సముచిత గౌరవం. కేరళకు చెందిన ఎంటి వాసుదేవన్ నాయర్ (పద్మవిభూషణ్), డా.బిబేక్ డెబ్రాయ్ (పద్మభూషణ్)కు మరణానంతరం అవార్డు లభించగా, డాక్టర్ ఆర్కల్‌గడ్ అనంతరామయ్య సూర్యప్రకాశ్, రాంబహదూర్ రాయ్ (పద్మభూషణ్) దక్కించుకుంటే, 26 మందికి పద్మశ్రీ దక్కింది. సాహిత్యానికి పెద్దపీట వేయడం కొంత ఆనందించతగిన విషయమేగానీ, వీరిలో ఎక్కువ మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బిజెపి లేదా కేంద్ర ప్రభుత్వానికి మద్దతునిచ్చేవారే ఉండడం ఒక దుష్ట సంప్రదాయానికి నిదర్శనం. సాహిత్యాన్ని కూడా రాజకీయం చేయడం దుర్మార్గం. ఏదిఏమైనా, సాహితీ రంగానికి ఆదరణ లభించడం మాత్రం ఆహ్వానించ పరిణామమే. సామర్థ్యానికి, నిజమైన ప్రజాహిత రచయితలకు అవార్డులు దక్కివుంటే, వాటికి మరింత శోభ చేకూరేది. 'పద్మవిభూషణుడు' వాసుదేవన్ నాయర్‌ను అభిమానులు ప్రేమగా 'ఎంటి' అని పిలుచుకుంటారు. సాహితీ రంగానికి విశిష్ట సేవలు అందించారు. కేరళకు చెందిన ఆయన మలయాళ భాష, సాహిత్యం, సినిమాల రంగాల్లో అపూర్వమైన ముద్ర వేసిన సాంస్కృతిక మహావ్యక్తి. రచయితగా మాత్రమే కాకుండా, సినిమా దర్శకుడు, కథా రచయిత (స్క్రీన్‌ప్లే రైటర్), సంపాదకుడు, వక్తగా ఆయన చేసిన సేవలు తరతరాల పాఠకులను, ప్రేక్షకులను అత్యంత ప్రభావితం చేశాయి. ఆయన సాహిత్య దృష్టి, కళాత్మక ప్రమాణాలు, సాంస్కృతిక అవగాహన మలయాళ సాహిత్యాన్ని, సినిమాను కొత్త దశకు తీసుకెళ్లాయని చెప్పవచ్చు. వాసుదేవన్ నాయర్ 1933 జూలై 15న కేరళ రాష్ట్రం పాలక్కాడ్ జిల్లా కుడల్లూరు అనే చిన్న గ్రామంలో జన్మించారు. చిన్ననాటి నుంచే చదవడం, రాయడం పట్ల ఆయనకు అపారమైన ఆసక్తి ఉండేది. పుస్తకాలు ఆయన జీవితంలో విడదీయరాని భాగంగా మారాయి. ఆయన పాలక్కాడ్‌లోని గవర్నమెంట్ విక్టోరియా కాలేజీలో పట్టభద్రులయ్యారు. చదువు పూర్తయ్యేలోపే సాహిత్య రంగంలో ఆయన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. 1954లో న్యూయార్క్ హెరాల్డ్ ట్రిబ్యూన్ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి 'వరల్డ్ షార్ట్ స్టోరీ' పోటీలో మలయాళంలో ఉత్తమ కథకు మొదటి బహుమతి గెలుచుకోవడం ద్వారా ఎంటి పేరు సాహిత్య ప్రపంచంలో మార్మోగింది. ఇది ఒక యువ రచయితగా ఆయనకు వచ్చిన గొప్ప గుర్తింపు. విద్య పూర్తయ్యాక ఆయన కొంతకాలం పాలక్కాడ్‌లోని ఎంబి ట్యుటోరియల్ కాలేజీలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అయితే, సాహిత్యంపై ఉన్న మక్కువ ఆయనను జర్నలిజం వైపు నడిపించింది. 1957లో కేరళలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మలయాళ పత్రిక 'మాతృభూమి'లో సబ్ ఎడిటర్‌గా చేరడం ఆయన జీవితంలో కీలక మలుపు. ఈ సంస్థతో ఆయన అనుబంధం దశాబ్దాల పాటు కొనసాగి, మలయాళ సాహిత్య దిశనే మార్చినంత ప్రభావం చూపింది. 1958లో ప్రచురితమైన ఆయన తొలి నవల 'నాలుకెట్టు' మలయాళ సాహిత్యంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఈ నవలకు కేరళ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. సంప్రదాయ కుటుంబ వ్యవస్థ, మారుతున్న సామాజిక విలువలు, వ్యక్తిగత సంఘర్షణలు వంటి అంశాలను లోతుగా, సున్నితంగా చిత్రించిన ఈ నవల ఆయన రచనా శైలికి ప్రతీకగా మారింది. తరువాత 1965లో ఆయన రాసిన తొలి సినిమా కథా రచన 'మురప్పెన్ను', ఆయన స్వంత చిన్న కథ ఆధారంగా తెరకెక్కింది. ఇది కూడా సాహిత్యం – సినిమా మధ్య ఉన్న బలమైన సంబంధానికి నిదర్శనం. 1968లో ఎంటి 'మాతృభూమి వీక్లీ' సంపాదకుడిగా నియమితులయ్యారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు సాగిన ఆయన సంపాదకత్వ కాలంలో, అనేకమంది కొత్త మలయాళ రచయితలను గుర్తించి, ప్రోత్సహించారు. ఆయన సంపాదకత్వం కేవలం పత్రిక నిర్వహణకే పరిమితం కాకుండా, మలయాళ సాహిత్యాన్ని ఒక సృజనాత్మక ఉద్యమంగా మార్చింది. కొత్త ఆలోచనలు, కొత్త రచనా శైలులు పాఠకుల ముందుకు రావడానికి ఆయన వేదికగా నిలిచారు. సినీ రంగంలో ఆయన తొలి దర్శకత్వ చిత్రం 'నిర్మాల్యం' (1973). ఈ చిత్రం మలయాళ సినిమాకు ఒక క్లాసిక్‌గా నిలిచింది. గ్రామీణ జీవితంలోని ఆచారాలు, విశ్వాసాలు, అంతర్గత సంఘర్షణలను అద్భుతంగా తెరపై ఆవిష్కరించిన ఈ చిత్రం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు గెలుచుకుంది. 1973లో ఉత్తమ చిత్రానికి ప్రెసిడెంట్ గోల్డ్ మెడల్, జకార్తా ఆసియన్ ఫిలిం ఫెస్టివల్‌లో 'గరుడ అవార్డు' వంటి ప్రతిష్ఠాత్మక గౌరవాలు ఈ చిత్రానికి దక్కాయి. ఎంటి వాసుదేవన్ నాయర్ సాహిత్య సృష్టి విస్తృతమైనది. ఆయన 200కు పైగా చిన్న కథలు, 8 నవలలు, అనేక వ్యాసాలు, ప్రయాణ వర్ణనలు, ఒక నాటకం రచించారు. మలయాళ సినిమాలో కథా రచనకు (స్క్రీన్‌ప్లేకు) ఒక స్పష్టమైన నిర్మాణం, శాస్త్రీయమైన రూపం ఇవ్వడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన మొత్తం 55 సినిమాలకు కథా రచన చేయడంతో పాటు, చిన్న చిత్రాల సంకలనానికీ రచయితగా ఉన్నారు. ఆయన దర్శకత్వం వహించిన 7 చిత్రాల్లో చాలా వరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. స్క్రీన్‌ప్లేలను పుస్తక రూపంలో ప్రచురించిన తొలి వ్యక్తుల్లో ఎంటి ఒకరు. దీనివల్ల స్క్రీన్‌ప్లేకు కూడా సాహిత్య విలువ ఉందనే భావన బలపడింది. తరువాతి తరాల అనేకమంది సినిమా రచయితలకు ఆయన రచనలు ఒక మార్గదర్శక గ్రంథంలా మారాయి. 'మాతృభూమి' సాహిత్య పత్రిక సంపాదకుడిగా ఉన్నప్పుడు, ఇతర భారతీయ భాషలతో పాటు ఇంగ్లీష్‌లోని ప్రముఖ రచనలను మలయాళంలోకి అనువదింపజేయడంలో ఆయన ముఖ్య పాత్ర వహించారు. దీని ద్వారా మలయాళ పాఠకులు ప్రపంచ సాహిత్యాన్ని చేరువగా అనుభవించే అవకాశం పొందారు. భాష, సంస్కృతి పరిరక్షణ అవసరాన్ని ముందుగానే గ్రహించిన దూరదృష్టి గల వ్యక్తి ఎంటి 1992లో ఆయన తుంచన్ స్మారక సంస్థ బాధ్యతలు స్వీకరించారు. ఆధునిక మలయాళ భాషకు పితామహుడిగా భావించబడే తుంచత్తు రామానుజన్ ఎజుతచ్చన్‌కు తగిన స్మారకాన్ని నిర్మించేందుకు ఆయన మూడు దశాబ్దాల పాటు అంకితభావంతో కృషి చేశారు. ఈ రోజు అది భారతదేశంలో ఒక భాషకు, ఆ భాషా స్థాపకుడికి అంకితమైన అత్యంత పవిత్రమైన, గౌరవనీయమైన స్మారకంగా నిలుస్తోంది. ఎంటి తన జీవితకాలంలో అనేక పురస్కారాలు, గౌరవాలు అందుకున్నారు. 1970లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, 1995లో జ్ఞానపీఠ్ అవార్డు, 2013లో సాహిత్య అకాడమీ ఫెలోషిప్ ఆయనకు లభించాయి. 2005లో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్'తో సత్కరించింది. జాతీయ చలనచిత్ర అవార్డుల్లో ఉత్తమ కథా రచనకు గాను ఆయన నాలుగు సార్లు (1989, 1991, 1993, 1994) అవార్డులు గెలుచుకుని రికార్డు సృష్టించారు. అంతేకాకుండా 17 రాష్ట్ర అవార్డులు ఆయన ఖాతాలో ఉన్నాయి. వయలార్ అవార్డు, కేరళ సాహిత్య అకాడమీ ఫెలోషిప్, ఎజుతచ్చన్ పురస్కారం, జె.సి. డేనియల్ అవార్డు, కేరళ జ్యోతి పురస్కారం వంటి అనేక గౌరవాలు ఆయన ప్రతిభకు నిదర్శనాలు. 2024 డిసెంబర్ 25న ఎంటి కన్నుమూశారు. ఆయన శరీరం మట్టిలో కలిసిపోయినా, ఆయన సాహిత్యం, సినిమాలు, ఆలోచనలు మాత్రం మలయాళ సంస్కృతిలో శాశ్వతంగా నిలిచిపోయాయి.


ఎం.టి.వాసుదేవన్ నాయర్


సూర్యప్రకాశ్

ఎం.టి. వాసుదేవన్ నాయర్ అనేది కేవలం ఒక రచయిత పేరు కాదు; అది మలయాళ భాషకు, కళకు, సంస్కృతికి ఒక శాశ్వత ప్రతీక.

మీడియా రంగంలో విశేష అనుభవం ఉన్న డాక్టర్ ఆర్కల్‌గడ్ అనంతరామయ్య సూర్యప్రకాశ్ భారత దేశంలోని ప్రముఖ పండితులలో ఒకరు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షకుడు. ఐదు దశాబ్దాలకు పైగా సాగిన తన దీర్ఘమైన వృత్తి జీవితంలో ఆయన ముద్రిత, ఎలక్ట్రానిక్ మీడియా రంగాల్లో విశేష సేవలు అందించారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, పార్లమెంటరీ విధానాలు, రాజ్యాంగ పరమైన అంశాలపై ఆయన చేసిన లోతైన అధ్యయనం దేశంలోని ప్రజా చర్చలను సమృద్ధిగా చేసింది. ముఖ్యంగా భారత ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా పనిచేయాలనే దిశలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమైనది. భారత దేశ ప్రజా ప్రసార సంస్థ అయిన ప్రసార్ భారతి ఛైర్మన్‌గా, అలాగే ప్రధానమంత్రి మ్యూజియం, గ్రంథాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ వైస్‌చైర్మన్‌గా ఆయన నిర్వహించిన బాధ్యతలు దేశ చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయంగా నిలుస్తాయి. డా.సూర్యప్రకాశ్ 1950 ఫిబ్రవరి 9న జన్మించారు. విద్యాపరంగా ఆయన అసాధారణమైన ప్రతిభను కనబరిచారు. బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పట్టా, మైసూరు విశ్వవిద్యాలయం నుండి సమాజశాస్త్రంలో ఎంఎ పూర్తి చేశారు. భారత పార్లమెంట్ పనితీరుపై చేసిన పరిశోధనకు గాను తుమకూరు విశ్వవిద్యాలయం ఆయనకు డి.లిట్ డిగ్రీ ప్రదానం చేసింది. అంతేకాకుండా చౌదరి చరణ్ సింగ్ విశ్వవిద్యాలయం నుండి న్యాయశాస్త్రంలో ఎల్ఎల్‌బి పట్టా కూడా పొందారు. ఈ విభిన్న విద్యా నేపథ్యం ఆయనకు రాజ్యాంగ, న్యాయ, పార్లమెంటరీ వ్యవస్థలను సమగ్రంగా అర్థం చేసుకునే సామర్థ్యాన్ని ఇచ్చింది. 1995లో ఆయన రాసిన 'వాట్ ఎయిల్స్ ఇండియన్ పార్లమెంట్' అనే గ్రంథం భారత పార్లమెంట్ పనితీరుపై వచ్చిన అత్యంత ప్రామాణికమైన అధ్యయనాలలో ఒకటి. ఈ పుస్తకంలో ఎంపిలు రెండు సభల్లో తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తున్నారు, అలాగే నియోజకవర్గాల ఒత్తిళ్లను ఎలా ఎదుర్కొంటున్నారు అనే అంశాలను లోతుగా విశ్లేషించారు. 2013లో ప్రచురితమైన 'పబ్లిక్ మనీ, ప్రైవేట్ ఎజెండా – ది యూజ్ అండ్ అబ్యూజ్ ఆఫ్ ఎంపిలాడ్స్' పుస్తకంలో ఎంపి స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపిలాడ్స్) పనితీరును విమర్శాత్మకంగా పరిశీలించారు. ఈ పుస్తకం దేశవ్యాప్తంగాఎంపిలాడ్స్ సమర్థతపై పెద్ద చర్చకు దారి తీసింది. 2002లో లోక్‌సభ సెక్రటేరియట్ ప్రచురించిన 'ఫిఫ్టీ ఇయర్స్ ఆఫ్ ఇండియన్ పార్లమెంట్' అనే గ్రంథంలో, రాజకీయ పార్టీల పనితీరును నియంత్రించాల్సిన అవసరంపై ఆయన ఒక కీలక అధ్యాయాన్ని రచించారు. ఈ రచనలు భారత ప్రజాస్వామ్య సంస్థలపై ఒక విమర్శాత్మక ఆడిట్‌లా పనిచేశాయని చెప్పవచ్చు. ప్రజాస్వామ్య అధ్యయన రంగంలో అందుబాటులో ఉన్న సాహిత్యాన్ని ఇవి సుసంపన్నం చేశాయి. ఈ క్రమంలోనే ఆయనకు ఎన్నో అవార్డులు, రివార్డులు లభించాయి. 1995లో జర్మనీలోని ఫ్రెడ్రిచ్ ఎబర్ట్ ఫౌండేషన్ ఫెలోషిప్ ద్వారా ఆయన బుండెస్టాగ్ కమిటీల పనితీరును అధ్యయనం చేసే అవకాశం పొందారు. 2002లో నిర్భయ జర్నలిజానికి గాను బిపిన్ చంద్ర పాల్ సమ్మాన్, 2010లో కర్ణాటక రాజ్యోత్సవ పురస్కారం, 2025 ఫిబ్రవరిలో హర్యానాలోని ఎస్‌జిటి విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డి.లిట్ ఆయనకు లభించాయి. తాజా 'పద్మభూషణ్' ఆయన కీర్తికిరీటంలో మరో కలికితురాయి.

బిబేక్ డెబ్రాయ్‌ది భారత మేధో ప్రపంచంలో అరుదైన సమన్వయ వ్యక్తిత్వం. ఆయన కేవలం ప్రముఖ ఆర్థిక వేత్త మాత్రమే కాదు.. విధాన సలహాదారు, ఆలోచనా వేత్త, రచయిత, అలాగే ప్రాచీన భారతీయ తత్త్వసాహిత్యాన్ని ఆధునిక ప్రపంచానికి అనుసంధానించిన విశిష్ట పండితుడు. ఆర్థిక విధానాలు, పాలన, న్యాయ సంస్కరణలు, సంస్కృత గ్రంథాల అధ్యయనం.. వంటి విభిన్న రంగాల్లో ఆయన చేసిన కృషి భారత మేధోచరిత్రలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. 1955 జనవరి 25న జన్మించిన డా.డెబ్రాయ్ విద్యా ప్రయాణం అసాధారణమైనది. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో ఆర్థిక శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసి, ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో మాస్టర్స్ పూర్తి చేశారు. అనంతరం కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సి డిగ్రీ సాధించారు. ఈ బలమైన విద్యా నేపథ్యం ఆయనను అంతర్జాతీయ స్థాయి ఆర్థికవేత్తగా తీర్చిదిద్దింది. వందకు పైగా పుస్తకాలు రచించిన లేదా సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించిన డెబ్రాయ్ రచనలు ఆర్థిక విధానాలు, పాలన, న్యాయం, మిథాలజీ వంటి రంగాలను సమగ్రంగా ఆవిష్కరిస్తాయి.

భారత జర్నలిజం చరిత్రలో ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ చైతన్యం, సామాజిక బాధ్యతలను ఒకే తాటిపై నిలబెట్టిన అరుదైన వ్యక్తిత్వాల్లో రాంబహదూర్ రాయ్ ప్రముఖుడు. 1946 జులై ఒకటో తేదీన ఉత్తరప్రదేశ్ ఘాజీపూర్ జిల్లా సోనాడి గ్రామంలో జన్మించిన రాయ్, విద్యార్థి దశలోనే సామాజిక, రాజకీయ అంశాలపై లోతైన ఆసక్తి పెంచుకున్నారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి 1969లో ఆర్థిక శాస్త్రంలో ఎంఎ పూర్తి చేసి, అనేక ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు. తూర్పు పాకిస్తాన్ విముక్తి ఉద్యమంలో ఆయన భాగస్వామ్యం, ఆలోచనల విస్తృతిని ప్రతిబింబిస్తుంది. 2015లో ఆయనకు 'పద్మశ్రీ' పురస్కారం లభించింది. అవధేశ్ ప్రతాప్ సింగ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. రాంబహదూర్ రాయ్ జర్నలిజం మాత్రమే కాక, ప్రజాస్వామ్య పరిరక్షణలో, ప్రజా చైతన్యంలో, విద్యాసామాజిక రంగాల్లో నిరంతర ప్రేరణగా నిలిచిన మేధావి.

**– ఎస్‌వీఆర్**

# మారుతున్న 'సాహిత్య' నిర్వచనం

సాహిత్యం అంటే ఏమిటనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టం. నేటి కాలంలో ఇది మరింత సంక్లిష్టం. సాహిత్య నిర్వచనం రోజురోజుకూ కొత్త రూపాలను సంతరించుకుంటున్నది. ఒకప్పుడు గ్రంథాలు.. అత్యంత సంక్లిష్టమైన పదజాలంతో కూడిన రచనలే సాహిత్యంగా చెలామణి అయ్యేవి. తదనంతర కాలంలోశాస్త్రం, స్మృతికథనం, జర్నలిజం, రాజకీయ ఆలోచనల రంగాల్లో వెలువడుతున్న కొత్త తరహా రచనలు–మన కాలానికి నిర్వచనంగా మారిన ఒక సత్యాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే వాతావరణ మార్పు, దానితో ముడిపడిన సామాజిక, ఆర్థిక, నైతిక సంక్షోభం. ప్రాచీన కాలపు మహా అంతరించుటల నుంచి హిమాలయ పర్వత ప్రాంతాల దైనందిన జీవితం వరకూ, పాడుబడ్డ నగర ప్రాంతాల నుంచి ప్రపంచ శక్తి నిర్మాణాల వరకూ–ఈ పుస్తకాలు అన్నీ కలిసి మనిషి ఎలా నిలబడగలడు, ఎలా అనుగుణంగా మారగలడు, ఎలా కొత్త జీవన దృక్పథాన్ని నిర్మించగలడో ప్రశ్నిస్తున్నాయి. సర్వైవింగ్ క్లైమేట్ అండ కేయాస్: డైనోసార్లు వాతావరణ మార్పు మరియు సహనశక్తి గురించి మాకు ఏమి నేర్పుతాయి (డిసెంబర్ 2025) అనే గ్రంథంలో ఇవాన్ జెన్నికార్ భౌగోళికంగా అత్యంత దీర్ఘకాలమైన గతాన్ని ఆశ్రయించి మనకు దృష్టికోణాన్ని అందిస్తాడు. సాధారణ డైనోసార్ కథనాలకు భిన్నంగా, వాటి పరిణామాన్ని అప్పటి వాతావరణ మార్పులతో గాఢంగా అనుసంధానించి వివరిస్తాడు. 252 నుంచి 66 మిలియన్ సంవత్సరాల క్రితం కొనసాగిన మెసోజోయిక్ యుగంలో, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే, కార్బన్ అధికంగా ఉన్న వాతావరణానికి అనుకూలమైన శరీర నిర్మాణం వల్ల డైనోసార్లు ఎదిగి, విస్తరించాయి. అయితే 66 మిలియన్ సంవత్సరాల క్రితం జరిగిన గ్రహశకలం ఢీకొనడం వలన ఏర్పడిన ఆకస్మిక వాతావరణ మార్పు, అత్యంత ప్రత్యేక లక్షణాలు కలిగిన (ప్రత్యేకంగా ఎగరలేని) డైనోసార్లు కూడా తట్టుకోలేని స్థాయిలో మారిపోయింది. నేటి మానవ చర్యల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పులు కూడా అప్పటి ప్రకృతి విపత్తులను తలపిస్తున్నాయని జెన్నికార్ చెబుతాడు. తీవ్రమవుతున్న తుఫాన్లను ట్రయాసిక్ కాలపు మాన్సూన్‌లతో పోల్చుతూ, శిలాజ ఇంధనాల దహనంతో వెలువడుతున్న కార్బన్ ఉద్గారాలను ప్రాచీన అగ్నిపర్వత కార్యకలాపాలతో అనుసంధానిస్తాడు. అయినప్పటికీ, ఆయన వినాశన భవిష్యత్తును ప్రవచించడు. అటవీ పునరుద్ధరణ, కార్బన్‌ను పట్టిపడేసే సాంకేతికతలు, వ్యక్తిగత స్థాయిలో వాతావరణ చైతన్యం వంటి పరిష్కార మార్గాలను సూచిస్తూ, మనిషిని బాధితుడిగా కాకుండా భూమి సంరక్షకుడిగా చూపిస్తాడు. ఇదే వాతావరణ మార్పును విశాల కాలప్రమాణంలో చూసిన జెన్నికార్‌కు భిన్నంగా, అనురాధ రాయ్ రచించిన కాల్డ్ బై ద హిల్స్: ఎ హోమ్ ఇన్ ది హిమాలయ (జనవరి 2026) వ్యక్తిగత అనుభవాల ద్వారా ఈ సమస్యను మన ముందుకు తెస్తుంది. గత 25 సంవత్సరాలుగా రాణిఖేత్ కొండ ప్రాంతాన్ని తన నివాసంగా చేసుకున్న రాయ్, అడవుల్లో సంచరించే చిరుతలు, ఇళ్ల పైకప్పులపై ఆడే లంగూర్ కోతులు, తానే నాటిన చెట్ల కథలను మనతో పంచుకుంటుంది. ఆమె రచనలోని సహనం, వ్యక్తిగత స్పర్శ–ఆమె తోటను చూసుకునే విధానాన్ని తలపిస్తుంది. అయితే ఈ అందమైన చిత్రణ వెనుక, వాతావరణ మార్పు వల్ల ఋతువులు గందరగోళమవుతూ, ఒకప్పుడు శాశ్వతంగా అనిపించిన అడవులు అంతరించిపోతున్నాయనే విషాదం దాగి ఉంది.

ఈ పుస్తకం ఒకవైపు నివాసంపై ప్రేమలేఖగా, మరోవైపు నశిస్తున్న ప్రకృతిపై విలాపంగా నిలుస్తుంది. ఆశకు కేంద్రస్థానం ఇచ్చే గ్రంథం ఫ్రెడ్ పియర్స్ రాసిన డిస్ట్రస్ట్ ఇట్ ఆల్: ఎ హ్యాండ్‌బుక్ ఫర్ క్లైమేట్ హోప్‌ఫుల్స్ (ఫిబ్రవరి 2026). ఓటమి అనివార్యం అనే భావన మన ఆలోచనా పరిధిని సంకుచితం చేస్తుందని ఆయన వాదిస్తాడు. ఇది శాస్త్రీయ గ్రంథం కాదని చెప్పుకున్నప్పటికీ, స్పష్టమైన వివరణలు, విశ్వసనీయ ఆధారాలతో పాఠకుడిని విస్తృత చర్చ వైపు తీసుకెళ్తుంది. అసమానతలపై ఆయన చేసిన విశ్లేషణ ప్రత్యేకంగా ప్రభావవంతంగా ఉంటుంది. 1990 తర్వాత ప్రపంచ ఉష్ణోగ్రత పెరుగుదలలో రెండుమూడవ వంతుకు కారణమైనది సంపన్నులైన 10 శాతం ప్రజలేనన్న వాస్తవాన్ని ఆయన ముందుంచుతాడు. వ్యక్తిగత జీవనశైలి మార్పులకంటే, సమిష్టి రాజకీయ, సాంకేతిక చర్యలే కీలకమని చెబుతూ, ఓజోన్ పొర రక్షణలో ప్రపంచ సమన్వయం సాధించిన విజయాన్ని ఉదాహరణగా చూపుతాడు. ఈ పుస్తకం ఆశను కల్పితంగా కాకుండా ఆధారాలతో నిలబెడుతుంది. సహనశక్తి అనే భావన హేజెల్ షెఫీల్డ్ రచించిన ఫ్రంటియర్‌ల్యాండ్స్ (ఫిబ్రవరి 2026)లో నిర్మిత పర్యావరణానికి విస్తరిస్తుంది. ప్రపంచంలో అత్యంత కేంద్రీకృత భూమి యాజమాన్యం ఉన్న దేశాల్లో యుకే ఒకటని ఆమె పేర్కొంటుంది. కర్మాగారాలు మూసివేయడం, అద్దెల పెరుగుదల కారణంగా వేలాది భవనాలు పాడుబడి ఉన్నాయని వివరిస్తుంది. అయితే నిరాశకు లోనవకుండా, కళాకారులు, సంఘటకులు, కార్మికులు కలిసి ఈ స్థలాలను తిరిగి సమాజానికి ఉపయోగపడేలా మార్చుతున్న కథలను ఆమె నమోదు చేస్తుంది. సమూహ యాజమాన్యం, తక్కువ కార్బన్ పునర్నిర్మాణం, స్థానిక ఉత్పత్తి– ఇవన్నీ వాతావరణ మార్పులకి తగినట్లు జీవించడానికి మార్గాలని ఈ గ్రంథం వాదిస్తుంది. చివరగా, రెబెక్కా సోల్నిట్ రచించిన ది బిగినింగ్ కమ్స్ ఆఫ్టర్ ది ఎండ్ నోట్స్ ఆన్ ఎ వరల్డ్ ఆఫ్ చేంజ్ (మార్చి 2026) నాగరికత స్థాయి మార్పును ప్రతిపాదిస్తుంది. నేటి ధ్రువీకరణ, నియంతృత్వ పునరుద్ధరణ, ప్రగతిశీల విలువలపై దాడులను ఆమె ఒక విస్తృత చారిత్రక ప్రవాహంలో ఉంచుతుంది. గర్భస్రావ వేదనలతో కొత్త జీవితం పుట్టే ఉపమానాల ద్వారా, ప్రస్తుత సంక్షోభం ఒక పాత వ్యవస్థ అంత్యదశ అని, కొత్త ప్రపంచ ఆరంభ సంకేతమని ఆమె చెబుతుంది. ఆదివాసీలకు భూమి తిరిగి ఇవ్వడం వంటి సంఘటనలు, ఉద్యమాల విజయాలు.. ఈ గ్రంథానికి ఆశకు బలమైన ఆధారాలు.ఈ పుస్తకాలన్నీ కలిపి ఒకే మాట చెబుతున్నాయి. వాతావరణ మార్పు ఒక శాస్త్రీయ సమస్య మాత్రమే కాదు; అది చారిత్రకమైనది, వ్యక్తిగతమైనది, రాజకీయమైనది. భవిష్యత్తు అనిశ్చితమైనదైనా, లొంగిపోవడం మాత్రమే మనకు ఉన్న మార్గం కాదని ఇవి గుర్తుచేస్తున్నాయి. గత అంతరించుటల నుంచి నేర్చుకోవడం, నశిస్తున్న ప్రకృతిని ప్రేమతో కాపాడటం, అసమానతలను ప్రశ్నించడం, సమాజాలను తిరిగి నిర్మించడం–ఇవన్నీ కలిసి మనిషి నిలబడటమే కాదు, కొత్త ప్రపంచాన్ని సృజించగలడని ఈ రచనలు విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి.

ఈ వారం కవితలు

## దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది
అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!

– దేవులపల్లి రమేశ్
9963701294

## రండి రండి పోదాం.. మేడారం జాతర.!

పల్లవి
జాతరంటే జాతర...
మేడారం జాతర.!
సమ్మక్క సారలమ్మలు
వెలిసినట్టి జాతర!

రెండేళ్ల కొకసారి
సాగేటి జాతర
తెలంగాణ కుంభమేళా
గిరిజనుల జాతర
కోట్లమంది భక్తులొచ్చే
ప్రఖ్యాత జాతర

కాకతీయ రాజులతో
పోరాడిన శివంగులంట
అవినీతిని ఎదిరించిన
త్యాగనిరతి వీరిదంట

కన్నెపల్లి సారలమ్మ
చిలుకలగుట్ట సమ్మక్కలు
కలుసుకునే రోజంట
నియంతపాలకుల
నిప్పులతో కడగమని
వేడుకొని వొద్దాము
యుద్ధం జేసిన నేలను
చూసొద్దాము.

– గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

## గెలవాలి.. గెలవాలి..

గెలవాలి.. గెలవాలి..
ఆటల్లో గెలవాలి,
ఆత్మవిశ్వాసాన్ని కవచం చేసుకుని
శ్రమిస్తూ, చమట కారుస్తూ
మైదానంలో మెరుపులు చిందించాలి.

పాటల్లో గెలవాలి,
స్వరాల సవ్వడితో
మనసుల్ని దోచుకుని
హృదయాల్లో హరివిల్లులు
పూయించాలి.

మాటల్లో గెలవాలి,
మాధుర్యమే మంత్రంగా,
మంచితనమే మార్గంగా
వాక్యాలతో విజయాన్ని ముద్దాడాలి.

వేటలో గెలవాలి,
లక్ష్యాన్ని కళ్లలో నిలిపి,
ఓర్పును ఒడిలో పెట్టుకుని
సాధనతో సాఫల్యం అందుకోవాలి.

చేతల్లో గెలవాలి,
కష్టాన్ని కౌగిలించుకుని,
కళగా మలచిన పనితో
సమాజానికి నైపుణ్యం చూపాలి.

రాతల్లో గెలవాలి,
అక్షరాలకు ప్రాణం పోసి,
భావాలకు రెక్కలు కట్టి
సాహిత్యంలో చిరంజీవిగా నిలవాలి.

పోటీల్లో గెలవాలి,
ఈర్ష్యను పక్కన పెట్టి,
ప్రతిభతో ముందుకు దూకి
విజయ మేడలు అధిరోహించాలి.

జీవితంలో గెలవాలి,
పతనాల్లో పాఠాలు నేర్చుకుని,
విజయాల్లో వినయం నిలిపి
భవిష్యత్తును బంగారం చేసుకోవాలి.

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం


## చదవాల్సిన పుస్తకం

### ఆత్మశోధనే 'త్వమేవాహం'




ప్రఖ్యాత తెలుగు కవి, రచయిత ఆరుద్ర (పూర్తి పేరు: భాగవతుల సదాశివ శంకర శాస్త్రి) రచించిన 'త్వమేవహం' ఆధునిక తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాముఖ్యమైన కావ్యంగా గుర్తింపు పొందింది. ఈ గ్రంథం పేరు అర్థం 'నీవే నేను' (నువ్వూ నేనూ సమానం) అన్న తాత్విక భావాన్ని వ్యక్తం చేస్తుంది. స్వాతంత్ర్యం అనంతర కాలంలో, ముఖ్యంగా 1948లో హైదరాబాద్ సంస్థానంలో జరిగిన రజాకార్ ఉద్యమం సమయంలో చోటుచేసుకున్న హింస, అరాచకత్వం, సామాజిక అసమానతలే ఈ కావ్యానికి నేపథ్యం. సమకాలీన రాజకీయ–సామాజిక పరిణామాలను కవిత్వ రూపంలో విశ్లేషించిన అరుదైన రచనగా ఇది నిలుస్తుంది. ఈ కావ్యంలో కథానిర్మాణం సాంప్రదాయ పద్ధతిలో కాకుండా, ఒక అలంకారాత్మక భావనపై ఆధారపడి ఉంటుంది. ఇందులో మరణం ఒక వ్యక్తిగా అవతరించి మనిషితో మాట్లాడుతుంది. 'నువ్వూ నేనూ వేరు కాదు' అని ప్రకటించడం ద్వారా, హింసకు పాల్పడేవాడు.. బలయ్యేవాడు, అధికారి... పీడితుడు అన్న భేదాలు చివరికి ఒకే మానవ వాస్తవంలో కలిసిపోతాయని రచయిత సూచిస్తాడు. ఈ రచనపై మార్క్సిస్టు/కమ్యూనిస్టు దృక్కోణం స్పష్టంగా కనిపిస్తుంది. సమాజాన్ని వర్గాలుగా విభజించి, అధికార సంబంధాలు ఎలా పనిచేస్తాయో అరుద్ర కవితాత్మకంగా ఆవిష్కరించాడు. ఇందుకోసం ఆయన వినూత్న సాహిత్య పరికరాలను వినియోగించాడు. కాలాన్ని చూపించడానికి కల్పిత ఇసుకగడియారం, నీటిగడియారంలను ఉపయోగించాడు. ఇందులో గంటలు ధనిక వర్గానికి ప్రతీకగా, నిమిషాలు మధ్యతరగతిని సూచించగా, క్షణాలు కార్మిక వర్గాన్ని ప్రతినిధ్యం వహిస్తాయి. అదేవిధంగా, స్టాప్‌వాచ్‌ను విప్లవానికి చిహ్నంగా, తాళం చెవిను విప్లవాన్ని రగిలించే శక్తిగా, అలారంను సమాజానికి ఇచ్చే హెచ్చరికగా రూపకంగా వినియోగించడం ఈ కావ్యానికి విశేష బలాన్ని ఇచ్చింది. విమర్శకుల దృష్టిలో 'త్వమేవహం' స్వాతంత్ర్యం తర్వాత కాలంలో రచించబడిన అత్యుత్తమ తెలుగు కావ్యాల్లో ఒకటి. భావపరంగా గాఢత, శైలిలో ఆధునికత, సామాజిక స్పృహ... ఈ మూడింటి సమ్మేళనంగా ఇది ప్రత్యేక స్థానం సంపాదించింది. కేవలం కవిత్వం మాత్రమే కాక, ఒక కాలపు చైతన్యాన్ని ప్రతిబింబించిన సాహిత్య పత్రంగా ఇది విలువైనదిగా భావించబడుతుంది. ప్రస్తుతం ఈ గ్రంథం వివిధ పుస్తక విక్రయ కేంద్రాలలో అందుబాటులో ఉంది. 'త్వమేవహం' అరుద్రను కేవలం కవిగా కాక, సమాజాన్ని ప్రశ్నించిన ఆలోచనాశీలిగా నిలబెట్టిన మైలురాయి రచనగా చెప్పవచ్చు.

### మార్క్సిస్టు తత్వాన్ని ఆవిష్కరించిన 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్'




బ్రిటిష్ మార్క్సిస్టు తత్వవేత్త మారిస్ కార్న్‌ఫోర్త్ రచించిన 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్' మార్క్సిస్టు తత్వశాస్త్రంలో అత్యంత కీలకమైన గ్రంథాలలో ఒకటి. ఈ పుస్తకం ముఖ్యం గా జ్ఞానం ఎలా ఏర్పడుతుంది, అది వాస్తవంతో ఏవిధంగా సంబంధం కలిగి ఉంటుంది అనే ప్రశ్నలకు మార్క్సిస్టు–ద్వంద్వ భౌతికవాద దృష్టితో సమాధానం ఇస్తుంది. తత్వశాస్త్రాన్ని అబ్స్ట్రాక్ట్ చర్చల నుంచి బయటకు తీసుకుని, సామాజిక–చారిత్రక వాస్తవాలతో అనుసంధానించిన రచనగా దీనికి ప్రత్యేక స్థానం ఉంది. 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్'లో కార్న్‌ఫోర్త్, తత్వశాస్త్రంలో ఉన్న ఆదర్శవాదం, యాంత్రిక భౌతికవాదం.. రెండింటినీ విమర్శిస్తాడు. జ్ఞానం అనేది కేవలం మనస్సులో పుట్టే ఆలోచన మాత్రమే కాదు, అలాగే అది ఒక స్థిరమైన ప్రతిబింబం కూడా కాదని స్పష్టం చేస్తాడు. జ్ఞానం అనేది మనిషి–ప్రకృతి–సమాజం మధ్య నిరంతర పరస్పర చర్య ఫలితం అని ఈ గ్రంథం ప్రధానంగా వాదిస్తుంది. ఈ పుస్తకంలో కార్న్‌ఫోర్త్ శాస్త్రీయ అభివృద్ధి, సామాజిక మార్పులు, మానవ శ్రమ పాత్రను ఉదాహరణలతో వివరిస్తాడు. తత్వశాస్త్రాన్ని సామాన్య పాఠకుడికి అర్థమయ్యేలా స్పష్టమైన భాషలో చెప్పడం ఈ గ్రంథానికి బలమైన అంశం. అందువల్ల ఇది కేవలం తత్వవేత్తలకే కాదు, రాజకీయ కార్యకర్తలకు, విద్యార్థులకు కూడా ఉపయోగపడే రచనగా నిలుస్తుంది. ఈ పుస్తకం పూర్తిగా మార్క్సిస్టు జ్ఞాన సిద్ధాంతం మీద ఆధారపడి ఉంటుంది. ఇందులోని ముఖ్యమైన మార్క్సిస్టు భావనలను పరిశీలిస్తే, మొదటిది భౌతిక ప్రపంచం మనస్సుకు ముందే ఉంది. ఆలోచనలు, భావనలు, సిద్ధాంతాలు అన్నీ భౌతిక వాస్తవం నుంచి పుట్టినవే. ఇది మార్క్సిజంలో మౌలికమైన సిద్ధాంతం. చైతన్యం వాస్తవాన్ని నిర్ణయించదు; వాస్తవమే చైతన్యాన్ని నిర్ణయిస్తుంది అనే మార్క్సిస్టు భావనను ఈ గ్రంథం బలంగా ప్రతిపాదిస్తుంది. ఇందులోని రెండో అంశం, జ్ఞానం స్థిరంగా ఉండదు.. అది అభివృద్ధి చెందుతుంది, మారుతుంది.



ఈ మార్పు విరుద్ధాల సంఘర్షణ వల్ల జరుగుతుంది. నిజం–తప్పు, సిద్ధాంతం–ఆచరణ, వ్యక్తి–సమాజం మధ్య జరిగే పరస్పర చర్యల ద్వారా జ్ఞానం మరింత ఉన్నత స్థాయికి చేరుతుందని కార్న్‌ఫోర్త్ వివరిస్తాడు. ఇది హెగెలియన్ డయలెక్టిక్స్‌ను భౌతికవాద పునాది మీద నిలబెట్టిన మార్క్సిస్టు దృక్కోణం. మూడవది, ఆచరణ అవసరాన్ని వివరిస్తుంది. మార్క్సిస్టు సిద్ధాంతంలో ఆచరణే సత్యానికి ప్రమాణం. కార్న్‌ఫోర్త్ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా చెబుతాడు. మనిషి శ్రమ, సామాజిక చర్యలు, ఉత్పత్తి ప్రక్రియల ద్వారానే జ్ఞానం పరీక్షించబడుతుంది. కేవలం సిద్ధాంతం సరిపోదు; అది ఆచరణలో నిజమని నిరూపితమవాలి. నాలుగో అంశంగా జ్ఞానం, వర్గ స్వభావం గురించిన వివరణ ఉంటుంది. జ్ఞానం తటస్థమైనది కాదని, అది సమాజంలోని వర్గ సంబంధాలతో ముడిపడి ఉంటుందని కార్న్‌ఫోర్త్ వాదిస్తాడు. పాలక వర్గాలు తమ ప్రయోజనాలకు అనుగుణంగా ఆలోచనా విధానాలను రూపొందిస్తాయి. అందువల్ల శాస్త్రం, తత్వశాస్త్రం కూడా ఒక వర్గ స్వభావం కలిగి ఉంటాయి. ఇది మార్క్సిస్టు ఐడియాలజీ విశ్లేషణకు కేంద్ర బిందువు. చివరగా ఆదర్శ వాదంపై విమర్శ. కాంట్, బర్క్లీ వంటి తత్వవేత్తల ఆదర్శవాద దృక్కోణాలను కార్న్‌ఫోర్త్ తీవ్రంగా విమర్శిస్తాడు. వాస్తవాన్ని మనస్సు సృష్టించిందని చెప్పే సిద్ధాంతాలు చివరికి సామాజిక మార్పును అడ్డుకుంటాయని ఆయన అభిప్రాయం. మార్క్సిజం మాత్రం వాస్తవాన్ని మార్చే శక్తి మనిషి సామూహిక ఆచరణలో ఉందని చెబుతుంది. మొత్తానికి 'ది థియరీ ఆఫ్ నాలెడ్జ్' ఒక తత్వశాస్త్ర గ్రంథం మాత్రమే కాదు; అది మార్క్సిస్టు ప్రపంచ దృష్టిని అర్థం చేసుకునే మార్గదర్శిని. జ్ఞానం ఎలా పుడుతుంది, అది సమాజంతో ఎలా ముడిపడి ఉంటుంది, ఆచరణ ఎందుకు కీలకం అన్న ప్రశ్నలకు ఇది స్పష్టమైన సమాధానాలు ఇస్తుంది. మార్క్సిజాన్ని సిద్ధాంతంగా కాకుండా, జీవితాన్ని అర్థం చేసుకునే శాస్త్రీయ పద్ధతిగా చూడాలనుకునేవారికి ఈ పుస్తకం అత్యంత ముఖ్యమైన గ్రంథంగా నిలుస్తుంది.

# మేడ్చల్ జిల్లాలో కుదించుకొనిపోయిన ప్రజా ప్రతినిధులు

నాడు 900 నేడు 84 మందే

సర్పంచ్‌ల స్థానంలో కౌన్సిలర్లు, కౌన్సిలర్ల స్థానంలో కార్పొరేటర్లు

గ్రామాలు మున్సిపాలిటీల్లో, 9 మున్సిపాలిటీలు గ్రేటర్‌లో విలీనమవటమే కారణం

జెడ్‌పిటిసి, ఎంపిటిసిలు, జడ్‌పి చైర్మన్, మేయర్లు, చైర్మన్లు, కౌన్సిలర్లు లేని జిల్లా

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దేశంలోని పలు రాష్ట్రవాసులు, పరిశ్రమలు, విద్యా సంస్థలతో నగర శివారు జిల్లాగా 2016లో కొత్త జిల్లాగా రూపాంతరం చెందిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తాజా పరిణామాలతో మూడంకెలతో ఉన్న ప్రజా ప్రతినిధుల సంఖ్య నేడు కేవలం రెండంకెలకు పడిపోయింది. గ్రేటర్ మున్సిపల్‌లో తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలు విలీనమవటం, గ్రామాలన్నీ మున్సిపాలిటీల్లో విలీనమవటమే ప్రధాన కారణమైంది. ఫలితంగా నాటి గ్రామ సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు, మేయర్లు, కౌన్సిలర్లు, జడ్‌పిటిసి చైర్మన్, జడ్‌పి, ఎంపిటిసి సభ్యులు ఇక మాయమై పోనున్నాయి.మూడు నుండి ఐదు గ్రామ సర్పంచ్‌లను కలిపి మున్సిపాలిటీలో వార్డు సభ్యులు, అదే తరహాలో మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌లలోని కౌన్సిలర్ల సంఖ్యను మూడు నుండి ఏడు వరకు కలిపి ఒక కార్పొరేటర్‌గా మార్చటంతో కౌన్సిలర్లు, మేయర్లు, చైర్మన్లు, మరో పక్క జిల్లాలో గ్రామాలు లేక పోవటంతో జడ్‌పిటిసి, ఎంపిటిసిలే కాకుండా జడ్‌పి చైర్మన్ పదవులను సైతం మాయమయ్యాయి.

**నాటి 900 మంది ప్రజా ప్రతినిధులు నేడు కేవలం 84**




తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన అనంతరం 2016లో రాష్ట్రంలో ఏర్పడిన కొత్త జిల్లాల్లో ఒకటిగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాగా అవతరించింది. వివిధ పదవులతో తొలి దశలో ఉన్న 900 మంది ప్రజా ప్రతినిధుల సంఖ్య ఇటీవలి పరిణామాల నేపథ్యంలో కేవలం 84 తగ్గింది. గతంలో ఈ జిల్లాలో 60 మంది గ్రామ సర్పంచ్‌లు, 37 మంది ఎంపిటిసి, సభ్యులు, ఐదుగురు జడ్‌పిటిసిలు, జిల్లా పరిషత్ చైర్మన్, ఏడు మంది చైర్మన్లు, ముగ్గురు మేయర్లు, 600 మంది వరకు వార్డు సభ్యులు ఉండేవారు. ప్రస్తుతం మిగిలిన మున్సిపాలిటీల్లో ఎల్లంపేటలో 24, మూడుచింతలపల్లిలో 24 వార్డులు, ఆలియాబాద్‌లో 20 వార్డులకుగాను 68 కౌన్సిలర్లు ఉండనున్నారు. నేడు గతంలో బోడుప్పల్, జవహర్‌నగర్, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్లు, దమ్మాయిగూడ, దుండిగల్, ఘట్‌కేసర్, కొంపల్లి, మేడ్చల్, నాగారం మున్సిపాలిటీలు, జిహెచ్ఎంసి పరిధిలో ఉప్పల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, ఆల్వాల్ సర్కిల్ పరిధుల్లో కార్పొరేటర్లు, 15 మండలాల్లో 162 గ్రామ సర్పంచ్‌లతో ఈ జిల్లా ఏర్పాటైంది. కాగా ఇటీవలి పరిణామాలతో జిల్లాలోని గ్రామాలన్ని సమీప మున్సిపాలిటీల్లో విలీనమై మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, 12 మున్సిపాలిటీలుగా మారాయి. కాగా తాజా జిహెచ్ఎంసి గ్రేటర్ మహానగరంగా మారిన దరిమిలా వీటిలో గ్రామాల విలీనంతో నూతనంగా ఏర్పాటైన మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీలు మినహా మిగిలిన మూడు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాలిటీలను జిహెచ్ఎంసిలో విలీనం చేసారు. జిహెచ్ఎంసి విలీనం కాకముందు 20 నుంచి 30 వరకు ఒక్కో మున్సిపాలిటీల్లో ప్రజాప్రతినిధులు ఉండగా విలీనంతో ఒక్కో మున్సిపాలిటీకి ఒక్కొక్కరు లేదా ఇద్దరు కార్పొరేటర్లు మాత్రమే ఉండనున్నారు.

**కౌన్సిలర్లు, కార్పొరేటర్లతో కుదించుకుపోయిన పురపాలక సంఘాలు**

తొమ్మిది మున్సిపాలిటీలు జిహెచ్ఎంసిలో విలీనమైన తర్వాత మిగిలిన వార్డుల సంఖ్య కుదించి కార్పొరేటర్లుగా మారాయి. మేడ్చల్ మున్సిపాలిటీలో 23 వార్డులు, గుండ్లపోచంపల్లిలోని 15 వార్డులకు ఒక డివిజన్, నాగారంలోని 18 వార్డులు ఒక డివిజన్, దమ్మాయిగూడలోని 20 వార్డులు 2 డివిజన్లు, ఘట్‌కేసర్‌లోని 18 గ్రామాలు 2 డివిజన్లు, తూంకుంటలో 16 వార్డులకు ఒక డివిజన్, జవహర్‌నగర్‌లోని 28 కార్పొరేటర్లు ఉండగా 2 డివిజన్లు, బోడుప్పల్‌లోని 20 కార్పొరేటర్లు రెండు డివిజన్లు, పీర్జాదిగూడలో 26 కార్పొరేటర్లకు రెండు డివిజన్లుగా తగ్గింది.

## గట్టు మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గట్టు మైసమ్మ జాతరకు భక్తులు పోటెత్తారు. ప్రజలు వేలాదిగా తరలివచ్చి గట్టు మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు మహిళలు డప్పు చప్పుళ్లతో పోతరాజుల విన్యాసాల మధ్య గట్టు మైసమ్మ అమ్మవారికి బోనాలతో ర్యాలీగా వచ్చి తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గట్టు మైసమ్మ జాతర సందర్భంగా బైపాస్‌రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్, స్థానిక పోలీసులు 200 మందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్,మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, బండారి శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు మామిడ్ల ముత్యాలు యాదవ్, మాజీ రైతు సమన్వయ అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభకర్ రెడ్డి, బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్ రెడ్డి, గొంగళ్ల బాలేష్, మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్లు, వివిధ రాజకీయ నాయకులు ఏసీపీ, సిఐలు, ట్రాఫిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన జీవితానికి పార్కులు కీలకం

ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ఆహ్లాదకరమైన, ఆరోగ్యవంతమైన జీవితానికి పార్కులు ఎంతగానో దోహదపడతాయని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం డివిజన్ బాలాజీ లే అవుట్ కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్కును స్థానిక ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నేటి గజిబిజి యాంత్రిక జీవితంలో మానసిక ప్రశాంతత పొందాలంటే పార్కులు అవసరమని అన్నారు. పిల్లలకు ఆటవిడుపు అందించడంలో, వ్యాయామం చేసుకోవడానికి పార్కులు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రావుల శేషగిరి, జగన్, సత్యనారాయణ, సురేశ్ రెడ్డి, నాయకులు మన్నెరాజు, రవి యాదవ్, శ్రీనివాస్ యాదవ్, దుదిమెట్ల సోమేశ్ కుమార్, విజయ్ రాంరెడ్డి, కమలాకర్, నవాబ్ భాయ్, అంజన్ గౌడ్, మక్సూద్ అలీ, సాయి, సుంకరి చందు, గోవర్ధన్, చిన్నా చౌదరి, వెంకటేష్, రాములు గౌడ్, సమ్మయ్య యాదవ్, ప్రసాద్, నవీన్, శివా నాయక్ పాల్గొన్నారు.

**శ్రీమాతా యోగా అన్నపూర్ణేశ్వరి సేవలో ఎమ్మెల్యే వివేక్...**

గాజులరామారం డివిజన్ మహాదేవపురం కాలనీలో శ్రీ మాతా యోగ అన్నపూర్ణేశ్వరి దేవాలయంలో యోగాచార్య పూజ శ్రీ జగన్ గురూజీ ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కెపి వివేక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ శ్రీ మాతా యోగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారి కరుణ కటాక్షలతో ప్రజలంతా సుఖ:సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు రావుల శేషగిరి, జగన్, సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు మురళీ కృష్ణ, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, కార్తీక్, చందు, చరణ్, భాను, భవన్ పాల్గొన్నారు.



**అంగరంగ వైభవంగా గాజులరామారం శ్రీ చిత్తారమ్మ దేవి జాతర**

భక్తితో కోరుకున్న ప్రతి భక్తుని ఇంట్లో కొంగు బంగారమై శ్రీ చిత్తారమ్మ దేవి తల్లి వెలుస్తుంది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని శ్రీ చిత్తారమ్మ దేవి జాతర వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ప్రారంభమైన ఈ జాతర వేడుకలకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డిలు వేర్వేరుగా విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా కార్పొరేటర్‌లు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, తల్లి దయతో ప్రజలంతా సుఖ:సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు.

## విద్యార్థి దశ కీలకం


ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవడానికి విద్యార్థి దశ ఎంతో కీలకమని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బోడుప్పల్ సర్కిల్లోని బియంఆర్ఎస్ గ్రామర్ హైస్కూల్ 18వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం హరిహర కళాభవన్‌లో అత్యంత ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ బిఎంఆర్ఎస్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలను విద్యార్థుల్లో నాటుతూ సమాజానికి ఉత్తమమైన పౌరులను అందిస్తుందని ప్రశంసించారు. అలాగే విద్యతో పాటు సంస్కృతిక కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యమిస్తూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నందుకు స్కూల్ యాజమాన్యాన్ని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ బిఎంఆర్ఎస్ స్కూల్ యాజమాన్యం నాణ్యమైన విద్య క్రమశిక్షణ విద్యార్థుల అభివృద్ధి లక్ష్యంగా గత 18 సంవత్సరాలుగా విద్యారంగంలో అందిస్తున్న సేవలకు ఇది ఒక గర్వకారణం అని కొనియాడారు. స్కూల్ డైరెక్టర్ జైపాల్ రెడ్డి అతి చిన్న వయసులోనే విద్యారంగంలో అడుగుపెట్టి తల్లిదండ్రులు తనపై పెట్టిన నమ్మకాన్ని బాధ్యతగా భావించి విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చి దిద్దుతున్నారని, ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు వారు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి యాదగిరి, మాజీ రైల్వే డైరెక్టర్ టీ ప్రభు చరణ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, కొత్త లక్ష్మీ రవి గౌడ్, ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, మాజీ కార్పొరేటర్ సామల పవన్ రెడ్డి, బిఎంఆర్ స్కూల్ చైర్మన్ బి.మల్లారెడ్డి, డైరెక్టర్ జయపాల్ రెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ సభ్యులు బి.రాఘవేందర్ రెడ్డి, బి.విజయేందర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## 42.23 ఎకరాల ప్రభుత్వ స్థలానికి కంచె

కంచె ఏర్పాటు చేసేందుకు నివేదికను పంపిన తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి



దుందిగల్ గండిమైసమ్మ మండల తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** దుందిగల్ గండిమైసమ్మ మండలంలో కబ్జాకు గురికాకుండా సుమారు 42.23 ఎకరాల ప్రభుత్వ స్థలానికి కంచెను ఏర్పాటు చేసేందుకు తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి రంగం సిద్ధం చేశారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుందిగల్ గండిమైసమ్మ మండలంలోని గ్రామాల్లో పలు ప్రభుత్వ సర్వేనంబర్లలో భూ బకాసురుల కబంద హస్తాల్లో కబ్జాకు గురికాకుండా 42. 23 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కంచెను ఏర్పాటు చేసేందుకు నివేదికను మండల తహసీల్దార్ రూపొందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో కబ్జాకు గురై అమాయక ప్రజలకు విక్రయించి ప్లాట్లుగా విభజించి నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న వాటి జోలికి వెళ్లకుండా ప్రభుత్వ సర్వేనంబర్లలో మిగిలిన స్థలాన్ని గుర్తించడం జరిగిందని తెలిపారు. మండలంలోని మల్లంపేట్‌లో సర్వేనంబర్లు 258లో 3.11 ఎకారలు, 147లో 0.10 ఎకారాలు, 55లో 0.20 ఎకారాలు, గాగిల్లాపూర్‌లో సర్వేనంబర్లు 213లో 3.36 ఎకరాలు, 07లో 2.30 ఎకరాలు, బౌరంపేట్‌లో సర్వేనంబర్లు 550లో 5.5 ఎకరాలు, 272లో 1.09 ఎకరాలు, 541లో 0.25 ఎకరాలు, 576లో 0.30 ఎకరాలు, 694లో 0.37 ఎకరాలు, 821లో 0.30 ఎకరాలు, దుందిగల్ సర్వేనంబర్లు 133లో 0.03 ఎకరాలు, 222లో 0.12 ఎకరాలు, 255లో 0.08 ఎకరాలు, 414లో 0.18 ఎకరాలు, దొమ్మర పోచంపల్లి సర్వేనంబర్లు 120లో 10.00 ఎకరాలు, 167లో 1.14 ఎకరాలు, 332లో 3.00 ఎకరాలు, 335లో 0.20 ఎకరాలు, 337లో 0.17 ఎకరాలు, శంంభీపూర్ సర్వేనంబర్ 80లో 0.20 ఎకరాలు, బహద్దూర్ పల్లి సర్వేనంబర్లు 3లో 0.10 ఎకరాలు, 190లో 0.03 ఎకరాలు, 212లో 0.15 ఎకరాలు, 239లో 1.20 ఎకరాలు, 131లో 3.00 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని వివరించారు. మండలంలోని ఆయా సర్వే నంబర్లలో మిగిలిన మొత్తం 42.23 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని, ఇట్టి స్థలం కబ్జాకు గురికాకుండా కంటెను వేసేందుకు గాను నివేదికను కలెక్టర్, ఆర్‌డిఓ, హైడ్రాకు నివేదించామని తెలిపారు. ఇట్టి స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.




## నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు

సిపిఐ సభ్యత్వం పంపిణీ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి మండల పరిధిలోని శ్రీశ్రీ నగర్ సిపిఐ కార్యాలయంలో సభ్యత్వం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం శ్రీశ్రీ నగర్ కార్యదర్శి కె.మనోచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి జి.కృష్ణ పాల్గొని సిపిఐ సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేని చరిత్ర కమ్యూనిస్ట్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. నిత్యం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు కృష్ణాచారి, నర్సింహ, గంగన్న, రాములు, చంద్రమ్మ, ఉమాదేవి, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ వరం




**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఖరీదైన వైద్యం పొందేందుకు పేద కుటుంబీకులకు సిఎం రిలీఫ్ ఫండ్ ఓ వరంలాంటిదని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. దీని కోసం అవసరమైన వారు తమ చికిత్సలకు సంబంధించి వైద్యుల పత్రాలతో తనను సంప్రదించాలని ఆయన సూచించారు. ఆదివారం గౌతంనగర్ డివిజన్‌కు చెందిన ఫణికుమార్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన పత్రాలను ఆయన అందచేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నేతలు మేకల రాము యాదవ్, బైరు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తారమ్మ తల్లిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారంలో శ్రీశ్రీశ్రీ చిత్తారమ్మ దేవి జాతరలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఆలయ కమిటీ సభ్యులు కూన శ్రీశైలంగౌడ్‌ను శాలువాతో సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్, సలహాదారు కూన శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు, నరసింహ, ఇంద్రసేనగుప్తా, బుచ్చిరెడ్డి, పెంటరెడ్డి, గౌరిశెట్టి శివ, సత్తయ్య, ఇంద్రసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మెగా వైద్య శిబిరం



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** మూసాపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ఓం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పగడాల శిరీష, మాజీ కార్పొరేటర్లు శ్రావణ్ కుమార్ బాబురావులతో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరం అమోర్ ఆసుపత్రి, ఆరాధ్య ఆసుపత్రిల సహకారంతో ఏర్పాటు చేసి బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి, దంత పరీక్షలతో ఆపటు చిల్డ్రన్స్, గైనకాలజిస్ట్, ఎముకల స్పెషలిస్టులు, ఈసిజి పరీక్షలు నిర్వహించారు. 500మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు స్వప్న, సాయికీర్తన, నాయకులు వద్దేపల్లి రాజేశ్వరరావు, రామారం శ్రీశైలంగౌడ్, ఐలయ్య యాదవ్, జిల్లా గోపాల్, కర్క పెంటయ్య, ట్రస్ట్ సభ్యులు అనంతరెడ్డి, గౌరి శంకర్, జగన్మోహన్, విష్ణు, హనుమంత్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో పాల్గొన్న గ్రాండ్ మాస్టర్ వి.రవీందర్ కుమార్



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జై రామ్ నగర్ సుచిత్ర లో నిర్వహించిన బిఆర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ పరీక్షలు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు వంద మంది విద్యార్థులు పాల్గొని తమ యుద్ధ కళా నైపుణ్యాలను ప్రదర్శించారు. విద్యార్థులు కరాటేలోని కటాస్, స్పైరింగ్, టెక్నిక్స్ మరియు ఆత్మరక్షణ పద్ధతులను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు,ఎల్లో బెల్ట్, ఆరెంజ్బెల్ట్, మరియు పర్పుల్ బెల్టులతో పాటు సర్టిఫికేట్లను అందజేశారు. అనంతరం మాస్టర్ రవీందర్ కుమార్ మాట్లాడుతూ, చదువుతోపాటు,కరాటే కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, అది క్రమశిక్షణను మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్ మార్షల్ ఆర్ట్ ఫౌండర్ రేవప్ప కరాటే అన్వర్, జ్యోతిష్, మురళి రవి నాయక్ పాల్గొన్నారు.

## భార్యాభర్తలు అనుమానాస్పద మృతి



**ప్రజాపక్షం/బంట్వారం :** భార్యభర్తలు ఒకే రోజు తనువు చాలించిన సంఘటన బంట్వారం మండల పరిధిలోని యాచారం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఇద్దరు దంపతులు నక్కలి ధశరథం (58), లక్ష్మి (54) శనివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేసుకొని పంచానామ నిర్వహించి, శవ పరీక్ష నిమిత్తం మర్పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని కేసును దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం అనతంతరం మృతికి సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రఘు రాములు, స్థానిక ఎస్ఐ పి.విమల పేర్కోన్నారు.

## విశ్వ బ్రాహ్మణులు రాజకీయంగా ఎదగాలి

శాసనమండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి



**ప్రజాపక్షం/ఉప్పల్ :** తెలంగాణ రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతీయులు రాజకీయంగా, సామాజికంగా మరింత ఎదగాలని శాసన మండలి విపక్ష నేత సిరికొండ మధుసూదనా చారి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షులు డాక్టర్ వేములవాడ మదన్మోహన్ అధ్యక్షతన నిర్వహించిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లుగా గెలుపొందిన వారి సన్మాన, అభినందన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతి సంవత్సరం తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం ఆధ్వర్యంలో అమర శిల్పి జక్కనాచార్య, విశ్వ శిల్పి రామప్ప పురస్కారాలను సీనియర్ విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ శిల్పులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, గౌరి శంకర్, చొల్లేటి కృష్ణమాచార్యులు, రాగిఫణి రవీంద్రాచారి, కన్నెకంటి వెంకట రమణ, సుంకోజి కృష్ణమాచారి, వింజమూరి రాఘవాచారి, శశిధర్ శిల్పి, రంగు లక్ష్మణాచారి, వేములవాడ ద్రోణాచార్యులు, మారోజు సుదర్శనాచారి, నెళ్ళోజు సాల్వాచారి తదితరులు పాల్గొన్నారు.

## రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/కాప్రా :** స్వాతంత్ర సమర యోధుడిగా, సమాజ సేవకుడు రాజా బహదూర్ వెంకట్రామరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆయన ఆశయాల మేరకు ముందుకు కదలాలని పిలుపిచ్చారు. రాజా బహదూర్ వర్ధంతి సందర్భంగా మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కల్సి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ రెడ్డి సంఘ ప్రధాన కార్యదర్శి దోమ శ్రీనివాసరెడ్డి, కోదండం ధర్మారెడ్డి, ముత్యంరెడ్డి కృష్ణారెడ్డి, మల్లారెడ్డి శైలేష్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సోమిరెడ్డి శ్రీనివాసరెడి వెంకట్‌రెడ్డి, రంగారెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**క్యాలెండర్ల ఆవిష్కరణ..** మల్లాపూర్‌లో జరిగిన మరో కార్యక్రమంలో ఎమ్మెల్యే మీర్పేట కౌండిన్య సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను స్థానిక కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

## పార్కు నిర్మాణాన్ని విరమించుకోవాలి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఓల్డ్ మల్కాజిగిరిలోని హనుమాన్ వ్యాయామశాలకు చెందిన ఖాళీ స్థలంలో పార్కు నిర్మాణాన్ని విరమించుకోవాలని స్థానికులు కోరారు. కాలనీలోని ఈ స్థలంలో చిరకాలంగా పేద కుటుంబీకులు వివాహాలు జరుపుకొనేందుకు, పలు సందర్భాల్లో భక్తులు అన్నదానంలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, పార్కు ఏర్పాటు వల్ల ఇలాంటి అవకాశాలు కోల్పోతారని కాలనీ వాసులు ఆదివారం సమావేశమై తీర్మానించారు. ఈ మేరకు ఎమ్మెల్యే, జిహెచ్ఎంసి అధికారులకు వినతి పత్రాలిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, చింతల మల్లేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మహేందర్, చెన్నయ్య, బాబయ్య, నరహరి, శ్రీకాంత్, గన్న అశోక్, జెమిని, శీనున, వినోద్, మధు, ఎట్టాల, రాధమ్మ, కళావతి, అశ్విని, భూదేవి, మరియ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.6.75కోట్ల నిధులు మంజూరు

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మున్సిపాలిటి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని, అందుకు ప్రభుత్వం నుండి రూ.6.75కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని మొదటి వార్డులో రూ.50లక్షలు, 10వ వార్డులో కోటి, 8వ వార్డులో 40లక్షలు, 7వ వార్డులో కోటి, 19వ వార్డులో 25లక్షలు, 17వ వార్డులో రూ.25లక్షలు, 18వ వార్డులో 50లక్షలు, 4వ వార్డులో 50లక్షలు, 15వ వార్డులో 25లక్షలు, 27వ వార్డులో 60లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ సంక్షేమానికి పెద్ద పీట వేశామని, త్వరలోనే శంకుస్థాపనలు చేసిన పనులు ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. గతంలో ఎన్నడు లేని విధంగా పెద్ద ఎత్తున ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి పనులు చేస్తున్నామని తెలిపారు. ఏ వార్డులో ఏ సమస్యలు ఉన్నా తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే మున్సిపల్ అభివృద్ధికి ప్రభుత్వం నుండి రూ.88కోట్ల నిధులు తీసుకువచ్చి పనులు చేశామని గుర్తు చేశారు. వచ్చే మున్సిపల్ అభివృద్ధికి పట్టం కట్టేందుకు కృషి చేయాలని ఓటర్లు కృషి చేయాలని కోరారు. ప్రజలతో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నేతలను గుర్తించి టికెట్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, టికెట్లు రానివారు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులు గెలిపించుకొని రావాలని, వారికి నామినెటేడ్ పోస్టులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు చెంది తిరుపతిరెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, రఘునాయక్, జమృద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వంగ మధుసూదన్ భవితరాలకు ఆదర్శ ప్రాయుడు : మధుయాష్కి గౌడ్



**ప్రజాపక్షం/హయత్ నగర్:** రాజకీయ నైతిక విలువకు కట్టుబడిన వ్యక్తి, చంపాపేట్ కార్పొరేటర్, అయ్యప్ప టెంపుల్ చైర్మన్ వంగ మధు సుధన్ రెడ్డి బావితరాలకు ఆదర్శ ప్రాయుడని మాజీ ఎంపి, ఎల్‌బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మధు యాష్కి గౌడ్ అన్నారు. ఆదివారం వంగ మధు సుధన్ రెడ్డి అకాల మరణం పొందిన విషయం తెలుసుకున్న మధుయాష్కి గౌడ్ ఆయన భౌతికకాయనికి నివాళులర్పించారు.వారి నివాసానికి వెళ్లి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వంగ మధు సుధన్ రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్న మధుయాష్కి పాడే మోశారు. భూపేష్ గుప్తా నగర్ లోని స్మశాన వాటికలో జరిగిన దహన సంస్కారాల్లో పాల్గొని.. ఆత్మీయ సోదరుడు మధుసూదన్ రెడ్డి కి తుది వీడ్కోలు పలికారు.

**జన హృదయ నేత మధుసూదన్ రెడ్డి: కొప్పుల నర్సింహ్మా రెడ్డి**



చంపపేట్ డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అకాల మరణం ఎల్బీనగర్ రాజకీయ రంగానికి, ముఖ్యంగా భారతీయ జనతా పార్టీకి తీరని లోటని కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి అన్నారు ఈ విషాదకర సందర్భంలో మన్సూరాబాద్ చౌరస్తాలో జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి స్థానిక బిజెపి డివిజన్ నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మునగాల హరీష్ రెడ్డి సాయిరాం గౌడ్,శ్రీధర్ గౌడ్,గోపి యాదవ్,తదితరులు పాల్గొన్నారు

## అన్నదాతలు రైతు మార్ట్‌లను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** అన్నదాతలు రైతు మార్ట్‌ను సద్వినియోగం చే సుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఆదివారం పట్టణంలోని విజయనగర్ కాలనీలో నూతనంగా మధుసూదన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు మార్ట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడు తూ రైతులకు సరసమైన ధరలో నాణ్యమైన వస్తువులను ఇచ్చేందుకే రైతు మార్ట్‌ను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో నకిలీ వస్తువులు అనేకంగా వస్తున్నాయని, దాంతో రైతులు ఎంతో నష్టపోతున్నారని వివరించారు. రైతు శ్రేయస్సు కోసం ఏర్పాటు చేసిన రైతు మార్ట్‌ను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాలని ఆకాంక్షించా రు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ప్రశాంత్‌రెడ్డి, రంగయ్య గౌడ్, మాజీ ఎంపిటిసి భార్గవ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మన్మథరెడ్డి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని సర్పంచ్ వాకిటి నవకిరణి నరసింహ అన్నారు. ఆదివారం రథసప్తమిని పురస్కరించుకొని జడ్చర్ల పరిధిలోని గంగాపురం గ్రామంలో వెలిసిన లక్ష్మీ చెన్న కేశవులు స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాకిటి నవకిరణి నరసింహ మాట్లాడుతూ భక్తి భావంతోనే ముక్తి మార్గం లభిస్తుందని, ప్రజలందరు దైవ భక్తిని అలవర్చుకొని భగవన్నామస్మరణ చేయాలని కోరారు. చెడు అలవాట్లకు బానిసకాకుండా సన్మార్గంలో నడుచునేందుకు కృషి చేయాలని యువతకు సూచించారు. గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా పండి ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామస్తులు అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతుడిని కోరుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కావలి శ్రీశైలం, గ్రామస్తులు సంజీవయ్య యాదవ్, గున్న కృష్ణయ్య యాదవ్, ఆర్ల యాదయ్య యాదవ్, బద్దుల లక్ష్మయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# ‘ఉపాధి హామీ’ పథకాన్ని పునరుద్ధరించాలి

తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి,ఎఐసిసి సెక్రెటరీ విశ్వనాథన్




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఉపాధి హామీ పథకాని కి మహాత్మా గాంధీ పేరు తొలగించి బిజెపి ప్రభుత్వం ముద్దుపేరుగా జీరామ్‌జీ పేరు పెట్టి ఎవరైనా వ్యతిరేకిస్తే రాముణ్ణి వ్యతిరేకించినట్లు అనే భావన కలిగే విధంగా ప్రవర్తిస్తున్నదని తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి,ఎఐసిసి సెక్రెటరీ విశ్వనాథన్ అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని తోల్కట్ట లో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథ కం పేరును మార్పును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యం లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఐసి సి సెక్రెటరీ విశ్వనాథన్ హాజరయ్యారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా మన్నిం చు గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరులో మహాత్మా గాంధీ పేరు తొలిగించి రామ్ వచ్చే విధంగా నామకరణం చేసి బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అందరినీ ఆగ్రహానికి గురిచేసిందని తీవ్రంగా ధ్వజమెత్తరు. 140 కోట్ల మంది భారత ప్రజలు జాతిపితగా భావిస్తున్న మహాత్మా గాంధీ పేరిట మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని పార్లమెంట్ ఆమోదంతో 2005లో చట్టంగా ఏర్పడిందని గుర్తు చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే నూతన చట్టాన్ని తెచ్చారు.ఇప్పటికే అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రాష్ట్రాలకు మోయలేని భారంగా మారిన ఈ పథకం వల్ల రాష్ట్రాలు పనులకు అయ్యే ఖర్చులో 40 శా తం భరించాలని నిబంధన విధించారు. పనుల ప్రాంతాలను, పనుల స్వరూపాన్ని పూర్తిగా నిర్ణయించే అధికారం కేంద్రానికి మాత్రమే ఉండ దం గమనార్హం, రాష్ట్రాల హక్కులను, ఆకాంక్షలను హరించే విధంగా కేంద్రం చట్టంలో మార్పులు చేసిందని వారు తీవ్రంగా దుయ్యబట్టా రు. ఒక వేళ పని వ్యయం ఎక్కువ అయితే మిగిలిన పని ఖర్చు పూర్తిగా రాష్ట్రమే భరించాలి,కొత్త చట్టంలో కార్మికులకు ఉపాధి కల్పించే రోజుల ను 100 నుండి 125కు పెంచామని చెబుతూనే వ్య వసాయ పనులు జరిగే స మయంలో రెండు నెలలు ఉపాధి హామీ పనులు నిషేధించడం ఎట్లా అర్థం చేసుకోవాలని వారు ప్రశ్నించారు. కార్మికులకు పని దినాలు కల్పించాల్సిన ప్రభు త్వం యంత్రాలను ఉపయోగించే విధంగా మా ర్పులు ఎందుకు చేసిందో చెప్పాలని, మోదీ ప్ర భుత్వం తెస్తున్న వికసిత్ భారత్ జీరామ్‌జీ బిల్లు కార్మికులకు ఉన్న పని హక్కును కాలరాసే విధంగా ఉన్నదని,స్వాతంత్ర ఉద్యమంలో క్రి యాశీలక పాత్ర పోషించిన మహాత్మా గాంధీ పాత్రను చరిత్రనుండి చెరిపివేసే కుటిల ప్రయత్నం తప్ప మరొకటి కాదని, రాజకీయ అవసరాల కోసం కేంద్రం ఈ చట్టాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ భీమ్ భరత్, ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన వంగ మధుసూదన్ రెడ్డి

గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ విజయలక్ష్మి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి అకాల మరణం పట్ల గ్రేటర్ హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆదివారం మేయర్ వంగ మధుసూదన్ రెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించి నివాళు లు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యుల ను ఓదార్చి, ఈ కష్ట సమయంలో జిహెచ్‌ఎంసి తరఫున పూర్తి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన వంగ మధుసూదన్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన స్నేహపూర్వక స్వభావం, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండటం, సమాజ సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన తీ రును ఆమె కొనియాడారు. ప్రజాసేవలో చివరి శ్వాస వరకు అంకితభావంతో పనిచేసిన వంగ మధుసూదన్ రెడ్డి, చంపాపేట్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు.

## వీకెండ్‌స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్

పట్టుబడిన 399 మందు బాబులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 399 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. వీరిలో 321 ద్విచక్ర వాహనదారులు, 31 ఆటోలు, 47 కార్లు, హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే 364 మంది ఎంజి/100 ఎంఎల్ నుంచి 200 ఎంజి/100 ఎంఎల్ మధ్య, 25 మంది 201 ఎంజి/100 ఎంఎల్ నుంచి 300 ఎంజి/100 ఎంఎల్ మధ్య, 10 మంది 301 ఎంజి/100 ఎంఎల్ నుంచి 550 ఎంజి / 100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించినట్లు తేలింది. వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని హైరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత 2023 లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత

- స్వచ్ఛమైన గాలి, నీరు రాజ్యాంగం కల్పించిన హక్కు
- వ్యవస్థల వైఫల్యంపై నిపుణుల ఆందోళన
- ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో పర్యావరణ అంశాలపై సదస్సు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వచ్ఛమైన గాలి, నీరు పొందడం అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, వీటిని కాపాడటంలో ప్రభుత్వాలు, యంత్రాంగం విఫలమవుతున్నాయని పర్యావరణ నిపుణులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆదివారం ‘ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) తెలంగాణ స్టేట్ సెంటర్’, ‘లీడ్ ఫౌండేషన్ పర్యావరణ న్యాయ వేదిక’ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన ఐసిటి శాస్త్రవేత్త కె.బాబురావు మాట్లాడుతూ పాలనలో జరుగుతున్న తప్పులను ప్రశ్నించే వారు కరువవడంతో ప్రజాస్వామ్యం బలహీనపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యంపై కఠినంగా ఉండాల్సిన నియంత్రణ మండలి ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందో అర్థం కాని స్థితిలో ఉందని విమర్శించారు. పారిశ్రామిక ప్రమాదాలపై కమిటీలు వేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల బాధ్యులకు శిక్షలు పడటం లేదన్నారు. విదేశాల్లో తిరస్కరణకు గురైన కంపెనీలకు మన దేశంలో అనుమతులు ఇస్తూ పర్యావరణాన్ని బలిపెడుతున్నారని, పెట్టుబడుల పేరుతో పేదల భూములను సైతం లాక్కుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ మెంబర్ శ్యాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక వ్యర్థాల వల్ల నల్లగొండ జిల్లా తీవ్రంగా నష్టపోతోందని తెలిపారు. నీరు, ఆహారం, పశుగ్రాసం అన్నీ కలుషితమై చివరకు తల్లి పాలు కూడా విషతుల్యం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ కాలుష్యం వల్ల 70 వేల ఎకరాల్లో పంటలు ప్రభావితమవుతున్నాయని, ప్రస్తుత ప్రభుత్వం మూసీ ప్రక్షాళనపై తీసుకుంటు న్న చర్యలను ఆయన ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి ఇంజనీర్లు చొరవ చూపాలని కోరారు. ఎన్విరాన్‌మెంట్ జస్టిస్ ఫోరం అధ్యక్షుడు పి.నారాయణ రావు మా ట్లాడుతూ రాజ్యాంగ నిబంధనలు, పర్యావరణ పరిరక్ష ణ ఆవశ్యకతను వివరించారు. ఆర్టికల్ 21 ప్రకారం జీ వించే హక్కులో భాగంగానే స్వచ్ఛమైన పర్యావరణం ప్ర భుత్వాలు కల్పించాలన్నారు. ఆర్టికల్ 48ఏ, 51బి ప్రకా రం సహజ వనరుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అయి తే, పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి కనీస కర్తవ్యమని గుర్తు చేశారు. కోర్టులు, గ్రీన్ ట్రిబ్యునల్స్ ఎన్నో తీర్పులు ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో యంత్రాంగం వాటిని అమలు చేయడం లేదని ఆయన విమర్శించారు. సదస్సు అధ్యక్షత వహించిన ఐఈఐ చైర్మన్ రమణా నాయక్ మా ట్లాడుతూ స్వచ్ఛమైన గాలి, నీరు అనేవి మానవ హక్కులని, వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ సెక్రటరీ మర్రి రమేష్, కొండల్ రావు, పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ జి. రామేశ్వర్ రావు పాటు పలువురు ఇంజనీర్లు, పర్యావరణ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జహంగీర్ ఫీర్ దర్గా మాస్టర్ ప్లాన్ అమలు చేసేందుకు చర్యలు

రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్




**ప్రజాపక్షం/కొత్తూరు:** మాస్టర్ ప్లాన్ ప్రకారమే జెపి దర్గాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ వివరించారు. ఆదివారం కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జహంగీర్ ఫీర్ దర్గాలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో మంత్రి అజారుద్దీన్ బాబాకు ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పటాన్ చెరువు కాంగ్రెస్ నాయకుడు రాంమోహన్ న్యాజ్ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ పవిత్ర పుణ్యక్షేత్రమైన జెపి దర్గాను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. బాబా వద్దకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, మాస్టర్ ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే దర్గాలో సమస్యలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని పరిష్కరించేందుకు తగిన నిధులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. గత పాలకుల నిర్లక్ష్య వైఖరీ కారణంగానే అభివృద్ధి పూర్తిగా వెనుకబడి పోయిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలన ప్రభుత్వంలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలతో పాటు భక్తులకు మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. దర్గాకు వచ్చి బాబాను దర్శించుకోవడం తనకు మొదటి సారని, ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే విజ్ఞాప్తి మేరకు దర్గాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రగ్స్ సేవిస్తూ పట్టుబడిన విద్యార్థులు

10 గ్రాముల ఎండిఎంఎ స్వాధీనం.. ఐదురుగు అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని పంజాగుట్టలో డ్రగ్స్ కలకలం సృష్టించాయి. ఐదుగురు విద్యార్థులు మత్తు పదార్థాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగార్జున సర్కిల్ దగ్గర ఐదుగురు విద్యార్థులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. దీంతో వారిని ఆపి పోలీసులు తనిఖీ చేయగా, వారు డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వారిని తనిఖీ చేసి,10 గ్రాములు ఎండిఎంఎను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ విద్యార్థులంతా పంజాగుట్టలోని హోమ్‌స్టెక్ కాలేజీకి చెందిన వారు కావడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. విద్యార్థుల దగ్గరకు డ్రగ్స్ ఎలా వ చ్చాయి? వారికి ఎవరు సరఫరా చేస్తున్నారు? అనే కోణంలో విచారణ చేపట్టారు.

## ఒత్తిళ్లకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్ నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని, ముఖ్యంగా యువ ఓటర్లు బాధ్యతగా ప్రతి ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో విభిన్న సంస్కృతులు,భాషలు, సంప్రదాయాలు ఉన్నప్పటికి మనమందరం భారతీయులమన్నారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత 25 జనవరి1950 నాడు భారత రాజ్యాంగంలో 21 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును కల్పించడం జరిగిందని దీని గుర్తుగా 2011 సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం జనవరి 25వ తేదీన జాతీయ ఓటర్ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. కాగా తర్వాత ఓటు హక్కు వయసును 18 సంవత్సరాలకు సవరించి అమలు చేయడం జరిగిందని తెలిపారు. ఏ దేశంలో లేని విధంగా భారత రాజ్యాంగం మన దేశంలో పౌరులకు స్వేచ్ఛను స్వాతంత్రాన్ని కల్పించిందని ఏ ఎన్నికలైనా కూడా ఓటు ప్రధాన పాత్ర పోషిస్తదని, కాబట్టి పౌరులందరూ తమకు నచ్చిన, సమాజానికి మేలు చేసే వ్యక్తులను ఎన్నుకోవడానికి ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని, ఓటు హక్కు ప్రాధాన్యతను ఇతరులకు తెలియజేయాలన్నారు. ఎన్నికలలో ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిడిలకు లొంగకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం జి ల్లాలోని సీనియర్ సిటిజనలైన సి.కృష్ణారెడ్డి, చౌదరి, మధుసూదన్ రావు,ఎం.సత్తయ్య గౌడ్, పి.ప్రతాప్ రెడ్డిలను జిల్లా కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. ప్రజాస్వామ్యములో ఓటర్ల పాత్ర అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచన పోటీలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు, ఎన్నికల్లో పని చేసిన కె.సౌమ్య,జెవై భాస్క ర్, జె.దేవదాస్,నాగరాజ్, ఏ.అశోక్,రాజశేఖర్, ఎన్.నరేశ్, కె.వెంకటయ్య బిఎల్‌ఓలకు అవార్డులను కలెక్టర్ అందజేశారు. యువ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకున్న శివరాం కనుగుల, ఎడ్ల మహేష్, శ్యాం ప్రసాద్, వడియాల వరుణ్ లకు ఓటర్ కార్డులను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.చంద్రా రెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,జిల్లా గ్రామీణాభివృద్ధి పిడి అధికారి శ్రీలత,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఓటు ఎంతో అమూల్యం




**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఓటు ఎంతో అమూల్యమైందని, 18ఏళ్ళు నిండిన ప్రతి యువతీ, యువకుడు ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని షాద్‌నగర్ ఆర్‌డిఓ సరిత సూచించారు. ఆదివారం ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ కార్యాలయం నుండి షాద్‌నగర్ ముఖ్యకూడలి వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులో రెవిన్యూ అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఓ సరిత మాట్లాడుతూ దేశ భవిష్యత్, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, రాజ్యాంగ విలువల పరిరక్షణకు ఓటు ఎంతో అమూల్యమైందన్నారు. ఓటు వేయడం కేవలం హక్కు మాత్రమే కాకుండా గణతంత్రాన్ని బలోపేతం చేసే ఒక పవిత్రమైన పౌర బాధ్యత అని గుర్తు చేశారు. భారత భవితను పదిలంగా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి బాలవర్ధన్, ఫరూఖ్‌నగర్ డిప్యూటి తహశీల్దార్ రాకేష్, డిపిఓలు విద్యార్థులు పాల్గొన్నారు.

**కేశంపేటలో..** : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం కేశంపేట మండల పరిధిలోని బోధునంపల్లి గ్రామంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని విఆర్‌ఏ అనసూయ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎదిరే నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎంతో విలువైందని, ఓటు హక్కుగా నమోదు చేసుకొని వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు మన ఆకాంక్షలకు రూపమిచ్చే పనిముట్టు అని కేశంపేట మాజీ జెడ్‌పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటయ్య, బీరప్ప, నరేందర్, గ్రామస్తులు అంజయ్య, నరసింహ, రవి, బాలకిష్టి, శేఖర్‌రెడ్డి, యాదయ్య, మల్లేష్, లక్ష్మయ్య, మల్లేష్, కొమురయ్యలు పాల్గొన్నారు.

**కొందుర్గులో:** జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆదివారం కొందుర్గు మండల పరిధిలోని లాల్ పహాడ్ వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు జాతీయ ఓటర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చౌదరిగూడ తహశీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఓటు అనే ఆయుధంపై అవగాహన కలిగి ఉండాలని, భవిష్యత్‌లో జరగబోయే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటును స్వచ్ఛందంగా వేయాలని సూచించారు. ఓటు అనేది బాబా సాహెబ్ అంబేద్కర్ పోరాటం చేసి 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కును ప్రసాధించిన మహానీయుడు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంగమ్మ, అంజమ్మ, జిపిఓలు ప్రవీణ్, నవీన్, వెంకటేష్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



# పొట్టి సిరీస్ భారత్ కైవసం




**సునామీలా విరుచుకుపడిన సూర్య, అభిషేక్..**

పొట్టి క్రికెట్‌లో భారత జట్టు తమకు తిరుగులేదని చాటుతూ వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లో పంజా విసిరింది. గువాహటిలో ఓపెనర్ అభిషేక్ శర్మ(68 నాటౌట్) శివాలెత్తిపోగా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(57 నాటౌట్) బౌండరీలతో చెలరేగాడు. వీరిద్దరి విధ్వంసంతో కివీస్ బౌలర్లు కుదేలవ్వగా.. పది ఓవర్లలోనే 154 పరుగుల లక్ష్యాన్ని టీమిండియా ఉఫ్‌మనిపించింది. నిర్ణయాత్మక మ్యాచ్‌లో బ్యాటుతో, బంతితో తేలిపోయిన కివీస్ మూడో ఓటమితో సిరీస్ సమర్పించుకుంది. స్వదేశంలో పొట్టి ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ భారత జట్టు సిరీస్ విజయంతో రెచ్చిపోయింది. వేదిక మారినా విజయం మాదే అన్నట్టుగా చెలరేగిన టీమిండియా వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలుపు గర్జన చేసింది. స్వల్ప ఛేదనలో న్యూజిలాండ బౌలర్లను బెంబేలెత్తిస్తూ ఓపెనర్ అభిషేక్ శర్మ(68 నాటౌట్) సిక్సర్ల మోత మోగించాడు. పవర్ ప్లేలోనే సంజూ శాంసన్(0), ఇషాన్ కిషన్(28) ఔటైనా.. తన జోరుకు బ్రేకుల్లేవంటూ.. దొరికిన బంతిని దొరికినట్టు బౌండరీకి లేదంటే స్టాండ్స్ లోకి పంపాడీ చిచ్చరపిడుగు. డఫ్ఫీ వేసిన ఆరో ఓవర్లో 4, 4, 6తో 14 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. రాయ్‌పూర్‌లో హాఫ్ సెంచరీతో ఫామ్ అందుకున్న సూర్యకుమార్ యాదవ్(57 నాటౌట్) తన మార్క్ షాట్లతో విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ పోటాపోటీగా బంతిని బౌండరీకి తరలించగా కివీస్ బౌలర్లు తెల్ల మొఖం వేశారు. అగ్నికి వాయువు తోడైనట్టు అభిషేక్ జతగా సూర్య చెలరేగడంతో.. పది ఓవర్ల లోనే 154 పరుగుల లక్ష్యాన్ని అందుకుంది భారత్. తద్వారా వరుసగా తొమ్మిదో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకుంది.

**ఫిలిప్స్ ఒక్కడే**

గువాహటిలో భారత బౌలర్లు న్యూజిలాండ్ బ్యాటర్లకు బ్రేకులు వేశారు. భారీ స్కోర్‌తో సిరీస్ కాపాడుకోవాలనుకున్న వారి ప్రయత్నాలకు గండికొడుతూ.. వికెట్ల వేటతో ఒత్తిడి పెంచారు. జస్ప్రీత్ బుమ్రా(3–17) విజృంభణకు రవి బిష్ణోయ్(2–18)స్పిన్ మ్యాజిక్ తోడవ్వగా.. కివీస్ హిట్టర్లు తడబడ్డారు. పవర్ ప్లేలోనే 3 వికెట్లు కోల్పోయిన జట్టును గ్లెన్ ఫిలిప్స్(48), మార్క్ చాప్‌మన్(32), కెప్టెన్ మిచెల్ శాంట్నర్(27) ఆదుకున్నారు. వీరి మెరుపులతో కోలుకున్న బ్లాక్‌క్యాప్స్ పోరాడగలిగే స్కోర్ చేయగలిగింది.

## వరల్డ్‌కప్ కోసం ఫైనలిస్ట్‌తోనే వామప్ మ్యాచ్..!



రెండేళ్ల క్రితం బార్బడోస్‌లో టీ20 ప్రపంచకప్‌ను ఒడిసిపట్టిన భారత్ స్వదేశంలో ట్రోఫీపై కన్నేసింది. ట్రోఫీని నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న సూర్యకుమార్ సేన ఇప్పటికే న్యూజిలాండ్‌తో సిరీస్‌లో అదరగొడుతోంది. వరల్డ్‌కప్ సన్నద్ధతలో భాగంగా కివీస్‌తో సిరీస్ ముగియగానే విశ్రాంతి తీసుకోకుండా వామప్ మ్యాచ్ ఆడనుంది టీమిండియా. గత సీజన్ ఫైనల్లో తలపడిన దక్షిణాఫ్రికాతోనే ప్రాక్టీస్ మ్యాచ్‌తో మెగా టోర్నీలో అడుగుపెట్టనుంది. స్వదేశంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ కోసం భారత జట్టు పక్కాగా సిద్ధమవుతోంది. ఇప్పటికే దక్షిణాఫ్రికాను ఓడించిన టీమిండియా.. సొంతగడ్డపై ఐదుమ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్‌ను వణికిస్తోంది. ఫిబ్రవరి1న సిరీస్ ముగియడమే ఆలస్యం.. ఫిబ్రవరి 3న ముంబై చేరుకో నుంది సూర్యకుమార్ సేన. మరసటి రోజే అక్కడి డీవై పాటిల్ మైదానంలో సఫారీలతో వామప్ మ్యాచ్ ఆడనుంది.

## ఐసిసి ఆహ్వానాన్ని స్వాగతిస్తున్నాం..

**భారత్‌లో ఆడేందుకు నిరీక్షణ : స్కాట్లాండ్**

ఐసిసి పురుషుల టీ20 ప్రపంచకప్ లోకి స్కాంట్లాండ్ అనూహ్యంగా వచ్చేసింది. మొన్నటివరకూ ద్వైపాక్షిక సిరీస్‌లకు సన్నద్ధమైన ఆ జట్టు ఇప్పుడు వరల్డ్‌కప్ బరిలోకి దిగనుంది. బంగ్లాదేశ్ స్థానంలో ర్యాంకింగ్స్ ఆధారంగా బెర్తు సాధించిన స్కాంట్లాడ్. తమకు అవకాశం కల్పించినందుకు అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి)కి కృతజ్ఞతలు తెలిపింది. ఆ దేశ క్రికెట్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ట్రుడీ లిండ్‌బ్లేడ ఐసిసి ఆహ్వానాన్ని స్వాగతిస్తున్నామని చెప్పాడు. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడబోమని పతంపట్టిన బంగ్లాదేశ్‌కు షాకిస్తూ.. యూరప్ దేశమైన స్కాట్లాండ్‌కు అవకాశమిచ్చింది ఐసిసి. బంగ్లాదేశ్ బోర్డు డిమాండ్లు ఐసిసి నిబంధనలకు లోబడిలేనందున.. షెడ్యూల్ మార్చే ప్రసక్తే లేదని సిఇఒ సనోజ్ గుప్తా శనివారం ఐసిసికి లేఖ రాశాడు. దాంతో.. అధికారికంగా ప్రపంచకప్ బరిలోని 20 జట్ల జాబితాలోంచి బంగ్లాను తప్పించి.. స్కాట్లాండ్‌కు చోటు కల్పించారు. ప్రపంచకప్ బెర్తు ఆడలేకపోయామనే దిగులుతో ఉన్న స్కాట్లాండ్ క్రికెట్, ఆటగాళ్లు ఐసిసి ఆహ్వానంతో ఎగిరి గంతేశారు. 'శనివారం ఐసిసి నుంచి మాకు ఆహ్వానం అందింది. పురుషుల టీ20 ప్రపంచకప్ కోసం మీ జట్టును పంపిస్తారా? అని ఐసిసి మమ్మల్ని అడిగింది. అత్యున్నత క్రికెట్ బోర్డు ప్రతిపాదనను మేము స్వాగతించామ'ని ట్రుడీ లిండ్‌బ్లేడ వెల్లడించాడు. 'స్కాంట్లాండ్‌కు వరల్డ్‌కప్ ఆడే అవకాశమిచ్చిన ఐసిసికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ఐసిసి అధ్యక్షుడు జై షా నిర్ణయాన్ని మా జట్టు తరఫున స్వాగతిస్తున్నాం. విశ్వవేదికపై.. లక్షలాదిమంది అభిమానుల మధ్య ఆడడం స్కాట్లాండ్ ఆటగాళ్లకు దక్కిన మహాద్భుత అవకాశం ఇది. ఊహించని పరిణామాలతో మాకు వరల్డ్‌కప్ బెర్తు దక్కిందనే విషయం మాకు తెలుసు. ఇప్పటివరకూ మా జట్టు విదేశీ పర్యటనలకు సిద్ధమవుతోంది. ఇప్పుడు భారత్‌లో ప్రపంచకప్ కోసం సన్నద్ధం కానుంది' అని క్రికెట్ స్కాట్లాండ్ చైర్మన్ విల్ఫ్ వాల్ష్ పేర్కొన్నాడు. త్వరలోనే స్క్వాడ్‌ను ప్రకటిస్తామని ఆయన తెలిపాడు.




# ఆరోగ్యం

## భవిష్యత్ మహమ్మారులతో జాగ్రత్త!



భవిష్యత్తులో వచ్చే మహమ్మారులను ఎదుర్కోవాలంటే అవసరమైన పని ఇప్పుడే మొదలుపెట్టాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. యుద్ధం లేని సమయంలోనే యుద్ధానికి సిద్ధమవుతున్నట్లుగా, మహమ్మారి రాకముందే దానికి ఎదురుగ నిలిచే వ్యవస్థలను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. సూక్ష్మ జీవ శాస్త్ర (బ్యాక్టీరియాలజీ) ప్రయోగశాలలు, పరిశోధనా సంస్థలు ఈ దిశగా కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహమ్మారిని ఎదుర్కోవడానికి పాలన, నిఘా వ్యవస్థలు, పరిశోధన, భాగస్వామ్యాలు అనే నాలుగు అంశాలు అత్యంత ముఖ్యమని అంటున్నారు. ఈ నాలుగు మూల స్తంభాలు సమన్వయంగా పనిచేసినప్పుడే, కొత్త అంటువ్యాధులు ప్రపంచాన్ని కుదిపేయకముందే వాటిని నియంత్రించే శక్తి దేశానికి కలుగుతుందని నిపుణుల అంచనా. ముఖ్యంగా భవిష్యత్తులో మహమ్మారులుగా మారే అవకాశం ఉన్న ప్రాధాన్యత గల రోగకారక సూక్ష్మ జీవాలపై ముందుగానే లోతైన పరిశోధన జరగాల్సిన అవసరం ఉందని వారు సూచిస్తున్నారు. మహమ్మారి నివారణ వ్యూహంలో కీలక అంశంగా పరిశోధన ఫలితాలను ప్రయోగాత్మక దశల వరకే పరిమితం చేయకుండా, కనీసం రెండో దశ క్లినికల్ ట్రయల్స్ వరకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకోసం పరిశ్రమలతో భాగస్వామ్యంగా పనిచేయడం, సమర్థవంతమైన సరఫరా గొలుసులను అభివృద్ధి చేయడం, అవసరమైనప్పుడు వేగంగా స్పందించగల సామర్థ్యాన్ని ప్రదర్శించడం దేశానికి అత్యంత అవసరమని పేర్కొన్నారు. మహమ్మారి వ్యాప్తి మొదటి వంద రోజుల్లోనే ఉపయోగపడే ప్రతిరోధక చర్యలను అందుబాటులోకి తీసుకురాగలగడం భవిష్యత్తు సిద్ధతలో కీలక లక్ష్యంగా ఉండాలని సూచించారు.




భవిష్యత్ మహమ్మారి సిద్ధత అనేది ఒక్క రంగానికి సంబంధించిన బాధ్యత కాదని, ఇది సమిష్టి ప్రయత్నం కావాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. శాస్త్రవేత్తలు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, పాలన వ్యవస్థలు, ఆరోగ్య రంగం తదితర వ్యవస్థలన్నీ కలిసి పనిచేసినప్పుడే వేగవంతమైన, ప్రభావవంతమైన స్పందన సాధ్యమవుతుంది. ముందస్తు ప్రణాళికలు, నిరంతర పరిశోధన, సమర్థవంతమైన భాగస్వామ్యాలే భవిష్యత్తులో దేశాన్ని మహమ్మారుల నుంచి రక్షించే కవచంగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సారాంశంగా చెప్పాలంటే, మహమ్మారులను ఎదుర్కోవడం అనేది సంక్షోభం వచ్చిన తర్వాత మొదలుపెట్టే పని కాదు. సంక్షోభం రాకముందే శాస్త్రీయంగా, వ్యవస్థాగతంగా సిద్ధమవడం అవసరం. ఈ రోజు చేస్తున్న పరిశోధనలు, నిర్మిస్తున్న వ్యవస్థలే రేపటి ఆరోగ్య భద్రతకు పునాదిగా మారతాయి. భవిష్యత్తు మహమ్మారుల ముప్పును తగ్గించాలంటే, ఇప్పుడే చర్యలు తీసుకోవడం కాలావసరమని నిపుణుల సూచన స్పష్టంగా చెబుతోంది.

ఇటీవల జరిగిన ఒక శాస్త్రీయ కార్యక్రమంలో, కొవిడ్19 మహమ్మారిని ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలన్నీ శాస్త్రీయ ఆధారాలు, సాక్ష్యాలపై ఆధారపడి ముందుకు సాగాయని గుర్తు చేశారు. ఈ ప్రక్రియలో ప్రభుత్వం మాత్రమే కాకుండా, దేశం మొత్తం, సమాజం మొత్తం భాగస్వాములుగా మారాయని తెలిపారు. పాలన, శాస్త్ర విజ్ఞానం, ప్రజల భాగస్వామ్యం కలిసి పనిచేసినప్పుడు మాత్రమే ఇలాంటి పెద్ద సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని కొవిడ్ అనుభవం స్పష్టం చేసిందని విశ్లేషించారు. కొవిడ్ కాలంలో సూక్ష్మ జీవ శాస్త్ర పరిశోధనా సంస్థలు పోషించిన పాత్రను కూడా నిపుణులు ప్రశంసించారు. వ్యాధి నిర్ధారణ కోసం ఆర్‌టీ–పీసీఆర్ పరీక్షలు నిర్వహించడం, వైరస్ వ్యాప్తిపై నిఘా పెంచడం, కొత్త రకాల వ్యాక్సిన్ అభివృద్ధికి దోహదపడడం, యాంటీవైరల్ ఔషధాల స్క్రీనింగ్ వంటి కార్యక్రమాలు దేశానికి ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నారు. ఇవి కేవలం అత్యవసర పరిస్థితుల్లోనే కాకుండా, భవిష్యత్తు సిద్ధతకు కూడా బలమైన పునాదిగా నిలుస్తాయని అభిప్రాయం వ్యక్తమైంది. భవిష్యత్తులో ఎదురయ్యే మహమ్మారులు తప్పనిసరిగా కొవిడ్ తరహాలోనే ఉంటాయని అనుకోవడం పొరపాటు అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొత్త రకాల వైరసులు, బ్యాక్టీరియా, లేదా ఔషధ నిరోధక సూక్ష్మ జీవాలు పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. అందుకే యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్, సహజ వ్యవసాయానికి సంబంధించిన సూక్ష్మ జీవాల పరిశోధన, బయోరిమిడియేషన్, నాడీ సంబంధిత వ్యాధులపై సూక్ష్మ జీవాల ప్రభావం వంటి రంగాల్లో కొనసాగుతున్న పరిశోధనలు భవిష్యత్తులో కీలకంగా మారతాయని విశ్లేషణ. సూక్ష్మ జీవ శాస్త్రంలో ఆవిష్కరణలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా, ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా ఉండాలనే దృష్టి అవసరమని పరిశోధనా వర్గాలు భావిస్తున్నాయి. ప్రాథమిక పరిశోధనల నుంచి ఉపయోగకరమైన ఉత్పత్తులు, చికిత్సా విధానాలు, నిర్ధారణ సాంకేతికతలు వెలుగులోకి రావాలంటే అనువర్తిత పరిశోధనకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. దీనికి అనుగుణంగా బలమైన అనువర్తన వ్యవస్థను నిర్మించుకోవడం దేశానికి అత్యంత అవసరం.

## ఆదర్శ కమ్యూనిస్టు సీతారావమ్మ

**సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు**



ప్రజాపక్షం/చింతకాని : బ్రతికినంత కాలం ఎర్రజెండా చేతపట్టి నిబద్ధత గల కమ్యునిస్టుగా కొల్లి సీతారావమ్మ బ్రతికిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు పేర్కొన్నారు. రాఘవాపురం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు కొల్లి సీతారావమ్మ దశదినకర్మ ఆదివారం రాఘవాపురంలో జరిగింది. ఈ సందర్భంగా బాగం హేమంతరావు రాఘవాపురంలో జరిగిన కార్యక్రమంలో సీతారావమ్మ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా జిల్లా కార్యరవ్గ సభ్యులు పోటు కళావతి, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతా దేవి, తాటి వెంకటేశ్వర్లు, ఎర్ర బాబు, మండల కార్యదర్శి దూసరి గోపాల రావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, మార్గం శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహన్‌రావు, రాఘవాపురం సర్పంచ్ కాంపల్లి కోటమ్మ, బస్వాపురం సర్పంచ్ ఆవుల నర్సింహారావు, దొబ్బల వెంగళరావు, కొల్లి శ్రీనివాసరావు, కొల్లి గోవిందరావు, కొండపర్తి బాలాజీ, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐని గెలిపిస్తే ప్రజల తరపున బలమైన స్వరం

**సిపిఐ యాద్రద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి**

ప్రజాపక్షం/భువనగిరి రూరల్ : త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో నిరంతరం ప్రజల కోసం సమస్యలపై ఉద్యమాలు నిర్వహించే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు శాఖ సమావేశం గుండెబోయిన స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి యానాల దామోదర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం, డబల్ బెడ్ రూం ఇండ్ల పంపిణీ వంటి మౌలిక వసతుల పరిష్కారంలో ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న పార్టీ సిపిఐ అన్నారు. మున్సిపాలిటీలో నిజమైన ప్రజాపాలన అందించగలదని, అన్ని వర్గాల ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న సిపిఐ అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐని గెలిపించి ప్రజల స్వరం బలంగా వినిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమి తి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్, మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, శాఖ కార్యదర్శి చింతల పెంటయ్య, సభ్యులు బద్దం వెంకట్ రెడ్డి, దాసరి మారయ్య, ఎస్ కె షేర్ఫోద్దీన్, కదారి మల్లేశం, పెద్ద మల్లేష్, దాసరి యాదగిరి, కిష్టయ్య, యాదగిరి, ఆస్కాని మోహన్, ఎదునూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికలకు సిపిఐ శ్రేణులు సిద్ధం కండి

- కరీంనగర్ కార్పొరేషన్‌లో అడుగు పెట్టండి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపు




ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మున్సిపల్ ఎన్నికలు నిర్వహించడానికి సిద్ధంగా ఉన్న తరుణంలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఐ శ్రేణులు సిద్ధం కావాలని, కరీంనగర్ కార్పొరేషన్ లో సిపిఐ కార్పొరేటర్లుగా అడుగు పెట్టాలని సిపిఐ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో నగరానికి చెందిన సిపిఐ ముఖ్య నాయకులతో చాడ వెంకట్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అను ని త్యం ప్రజా క్షేత్రంలో ఉండి ప్రజల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న పార్టీ సిపిఐ అని,గత అనే క సంవత్సరాలుగా నగరంలో ఉన్న సమస్యలు, వార్డుల్లో ఉన్న సమస్యలపై నగర పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నా రని, రోడ్లు, డ్రైనేజీలతో పాటు, గతంలో స్మార్ట్ సిటీ పేరుతో నిర్మించిన రోడ్ల, ఫుట్ పాత్‌ల నిర్మాణాలపై అలాగే తీగల వంతెన నిర్మాణ నాణ్యతపై, మానేరు రివర్ ఫ్రంట్ పై పోరాటాలు చేశామని, వాటి నిర్మాణంలో జరిగిన అవినీతిపై,అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరపాలని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేసిన ఏకైక పార్టీ సిపిఐ అని చాడ వెంకటరెడ్డి అన్నారు. నగరంలో నివసిస్తున్న పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని,నిర్మించి ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లు పేదలకు కేటాయించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, పెన్షన్ ఇవ్వాలని, నగరంలో నివసిస్తున్న పేదలకు కూడా ఉపాధి హామీ పథకాన్ని వర్తింప జేయాలని అనేక దఫాలుగా మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ధర్నాలు నిర్వహించి పోరాడిన పార్టీ సిపిఐ అని అలాంటి పార్టీని నగర ప్రజలు ఆదరించాలని, రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని, పోటీ చేసే వారు ప్రజల మధ్య ఉండి వారికి సేవ చేయాలని వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి న్యాలపట్ల రాజు, నగర నాయకులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, గామినేని సత్యం, మాడిశెట్టి అరవింద్, బాకం ఆంజనేయులు, కూన రవి, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



# కొత్త భూగర్భ గనులు ఏర్పాటు చేయండి

**సింగరేణి కార్మికులకు రూ.30లక్షల వడ్డీలేని రుణం ఇవ్వాలి**

**ఇల్లందు గెస్ట్ హౌస్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలసిన ఎమ్మెల్యే కూనంనేని**

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి కొత్తగూడెం పర్యటనలో భాగంగా కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు మంత్రిని ఇల్లందు గెస్ట్ హౌజ్‌లో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ మనుగడ, కార్మికుల సంక్షేమానికి సంభందించిన పలు కీల అంశాలతో కూడిన మెమోరాండంను మంత్రికి అందజేసారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెంచేందుకు పెనగడప, పునుకుడుచెలక, రాంపూర్, గుండాలలో తక్షణమే కొత్త భూగర్భ గనులను ఏర్పాటు చేయాలని కోరామని తెలిపారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు, సాకారం చేసేందుకు రూ.30 లక్షల వడ్డీలేని గృహరుణాలను అందజేయాలన్నారు.అలాగే ఉద్యోగ విరమణ చేసిన వారికి పెన్షన్ పది వేయిలకు తగ్గకుండా చూడాలని మంత్రిని కోరారు. వీటతో పాటుగా కార్మికుల కార్పొరేట్ మెడికల్ బోర్డును ఎటువంటి ఆటంకాలు లేకుండానిర్విరామంగా కొనసాగించాలని, పాత సింగరేణి క్వార్టర్‌లను కూల్చకుండా ప్రస్తుతం నివసిస్తున్న మాజీ కార్మికులకే ఇవ్వాలని కోరారు.సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తూనే, కార్మికుల న్యాయమైన హక్కులను కాపాడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఈ అంశాలపై సానుకూలంగా స్పందించాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు నేరల్ల రమేష్, పి. సత్యనారాయణ, చారి తదితరులున్నారు.

# నాగేశ్వర్ రావు మృతి పార్టీకి తీరని లోటు

**నివాళులర్పించిన సిపిఐ(ఎం), సిపిఐ జిల్లా కార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి**



ప్రజాపక్షం/హనుమకొండ : సిపిఎం ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ఉప్పునపెల్లి నాగేశ్వర్ రావు అనారోగ్యం కారణంగా మృతి చెందారు. నాగేశ్వర్ రావు గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ, చికిత్స పొందుతున్నారని సోమవారం హైదరాబాద్‌లోని ఎంఎన్‌జె హాస్పిటల్‌లో మరణించారు. కాగా సిపిఎం హనుమకొండ జిల్లా కార్యాలయంలో ఆయన భౌతిక కాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శిలు జి.ప్రభాకర్ రెడ్డి, కర్రె భిక్షపతి నివాళులర్పించి మాట్లాడుతూ నాగేశ్వర్ రావు మొదటి నుండి పార్టీలో కష్టపడి పని చేస్తూ, పార్టీ నిబంధనావళిని పాటిస్తూ అత్యంత క్రమశిక్షణగా, మిలిటెంట్ నాయకుడిగా తుదికంటా ఎర్ర జెండా బిడ్డగానే బతికాడన్నారు. వరంగల్ నగరంలో నిర్వహించినటువంటి భూ పోరాటాలలో పేద ప్రజానీకానికి వెన్నుదన్నుగా ఉండి , అనేక కేసులను ఎదుర్కొన్నారని, ఇప్పటికి కేసులు ఉన్నాయన్నారు. పత్రిక అవసరాల రీత్యా ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాశక్తి ఇంచార్జి గా సుదీర్ఘ కాలం పనిచేసారు. ఆ తరువాత గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, పార్టీలో వరంగల్ నగర, అర్బన్ జిల్లా కమిటీ సభ్యులుగా, కాజీపేట మండల కార్యదర్శిగా, నవతెలంగాణ పత్రిక జిల్లా మేనేజర్‌గా, కొత్తగూడెం జిల్లాలో లక్ష్మి దేవిపల్లి మండల కార్యదర్శి పనిచేశార ని గుర్తుచేశారు. ఆనతి కాలంలోనే నాగేశ్వర్ రావు మంచి ప్రజా నాయకుడిగా ఎదిగారని అన్నారు. అలంటి కామ్రేడ్‌ని కోల్పోవడం పార్టీకి తీరని లోటు అని వారు అన్నారు. నేడు ఉన్నటు వంటి పార్టీ కార్యకర్తలు క్రమ శిక్షణని ఆచరించే విషయంలో నాగేశ్వర్ రావును ఆదర్శంగా తీసుకోవాలని వారు ఈ సందర్భంగా నాగేశ్వర్ రావు సేవలను కొనియాడారు. సోమవారం ఉదయం కాకతీయ మెడికల్ కాలేజీకి నాగేశ్వర్ రావు బాడీని అందచేస్తామని తెలిపారు. నాగేశ్వర్ రావుకి నివాళులర్పించిన వారిలో సిపిఎం సీనియర్ నాయకులు సారంపెల్లి వాసుదేవరెడ్డి, సిపిఎం వరంగల్ జిల్లా కార్యదర్శి సిహెచ్.రంగయ్య, ములుగు జిల్లా మాజీ కార్యదర్శి టి. వెంకట్ రెడ్డి, జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, మహబూబాద్ జిల్లా కమిటీ సభ్యులు బొమ్మన అశోక్, సిపిఐ జిల్లా నాయకులు ఏదునూరి వెంకట్రాజం, వేల్పుల సారంగపాణి, బి.సంతోష్, కొట్టెపాక రవి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవి యాదవ్, రిటైర్డ్ లెక్చరర్ డోలి రాజలింగం, అవయవదానం ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు శంకర్ రావు, శ్రవణ్ కుమార్, దలపతి, సిపిఎం నాయకులు ఎం.చుక్కయ్య, గొడుగు వెంకట్, మంద సంపత్, కాడబోయిన లింగయ్య, డి.తిరుపతి, డి.భాను నాయక్, డి.రాజేందర్, మంద సుచందర్, నరేష్, ఎం.నారాయణ, ఎం.కుమారస్వామి, యాకుబ్, రావుల నర్సింహా, దుర్గయ్య, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



## విబి జి రామ్ జీ చట్టాన్ని రద్దు చేయాలి

నారాయణపేట జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విబి జి రామ్ జీ చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ డిసిసి అధ్యక్షుడు కె.ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో మండల కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విబిజి రామ్ జీ చట్టం ప్రజా వ్యతిరేకమైందని, ఈ చట్టం వల్ల సామాన్య ప్రజల హక్కులు హరించబడుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలపై భారం మోపే ఈ చట్టాన్ని ప్రభుత్వం తక్షణమే రదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడే పేదలు, రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను దిగజార్చే విధానాలను కాంగ్రెస్ పార్టీ సహించదని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు నిరంతరం ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించిన ఆయన, వీబీజీ రామ్ జీ చట్టం రద్దు అయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిన్న పొర్ల గ్రామ సర్పంచ్ నిఖిల ప్రశాంగత్, మాజీ ఎంపీపీ మణెమ్మ, ఉట్కూర్ మాజీ సర్పంచ్ సూర్యప్రకాశ్ రెడ్డి, ఉట్కూర్ మాజీ పీఎస్ఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, పులిమామిడి మాజీ సర్పంచ్ సూరయ్య గౌడ్, చిన్న పొర్ల మాజీ సర్పంచ్ రవీందర్, ఉట్కూర్ మండల యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేష్, కృష్ణ, రమేష్, మిరజ్, వాలియద్ పాషా, ఉపాధి హామీ కూలీల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు , రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కాలువకు గండి శ్రమదానంతో పూడ్చివేత

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** తూముకుంట పెద్ద చెరువుకు వచ్చే ప్రధాన కాలువకు గండి పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో ఏర్పడిన ఈ గండి కారణంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే విలువైన సాగునీరు వృథాగా పోతుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ సమస్యపై తూముకుంట, సంగినేనిపల్లి గ్రామాల రైతులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి స్పందన లేకపోయిందని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో కాలువ గండి అలాగే ఉండిపోవడంతో, పెద్ద చెరువు కింద సాగు చేస్తున్న రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఏర్పడింది. ఈ పరిస్థితిని గమనించి తూముకుంట గ్రామ సర్పంచ్ పలుస రాముడు ప్రత్యేక చొరవ చూపారు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు లోడుగా రాజు, మౌలాలిలతో పాటు పలువురు రైతులను సమన్వయం చేస్తూ శ్రమదానం చేపట్టారు. అందరూ కలిసి స్వయంగా పనుల్లో పాల్గొని కాలువకు పడిన గండిని పూడ్చివేయడం విశేషం. పెద్ద చెరువులో పుష్కలంగా నీరు ఉండటంతో మొదటి పంటను రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగు చేసుకున్నారు. ఇప్పుడు కలవ మరమ్మతులు పూర్తవడంతో రెండో పంటకు కూడా సాగునీటి సమస్య ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందన లభించడం గ్రామీణ ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. ఈ శ్రమదానం రైతుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.




## విద్యార్థులతో ఓటల్ల దినోత్సవం ర్యాలీ

ఓటు హక్కు ప్రతి ఒక్క పౌరుని హక్కు

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థుల ఘనంగా ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మోడల్ స్కూల్ నుండి ధన్వాడ వీడి గుండా తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. ప్రజలలో ఓటు హక్కు విలువను తెలియజేయడానికి, అవగాహన కల్పించడానికి విద్యార్థులు ర్యాలీలో సూక్తులు పాడుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వైశాలి వ్యాసు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## కేంద్ర బృందం పర్యటన

**ప్రజాపక్షం/ దామరగిద్ద :** దామరగిద్ద మండల కేంద్రంలో జాతీయ కేంద్ర బృందం పర్యాటించి మండలంలోని సమస్యలని స్థానికులతో అడిగి వివిధ అంశాలు గురించి తెలుసుకున్నారు.డ్రైనేజీ, రోడ్లు, విధి ధిపాల నిర్వహన, బ్యాంకింగ్ రంగం సేవాలు, డ్రైనేజీ కలువలు, నిర్వాహన దెబ్బతిన్న సిసి రోడ్ల మరమతులు గురించి స్థానికులతో అడిగి తెలుసుకున్నారు.




## ఘనంగా గట్టు తిమ్మప్ప బ్రహ్మోత్సవాలు

స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి దంపతులు



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ మండలంలోని మాద్వార్ గ్రామ శివారులో వెలసిన శ్రీ గట్టు తిమ్మప్ప (శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి) వారి బ్రహ్మోత్సవాలో భాగంగా రథసప్తమి సందర్భంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇవాళ స్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి పట్టు వస్త్రాలు తలపై ఉంచుకొని భాజాభజంత్రీల మధ్య గుట్టపై వెలిసిన స్వామి వారి దేవాలయానికి చెరుకుని మంత్రి శ్రీహరి, లలిత దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు పట్టు వస్త్రాలు అందజేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్న మంత్రి వాకిటి శ్రీహరిని ఆలయ ధర్మకర్తలు వైష్ణవం ప్రహ్లద్, వైష్టవం సురేందర్ తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాద్వార్ గ్రామ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, సంతోష్ రెడ్డి, సత్యనారాయణ, బి.శంకర్, వడ్ల బాల రాజ్, కాంగ్రెస్ నాయకులు బోయ రవి కుమార్, రాయికోడ్ ఆనంద్, వాకిటి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ ఓటర్ల దినోత్సవం

**ప్రజాపక్షం/దామరగిద్ద :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా దామరగిద్ద మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులలో జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా జరుపుకోవటం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ తిర్పతయ్య, ఆర్ ఐ బాలరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తహసీల్దార్ తిర్పతయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కు అనేది రాజ్యం మనకు ఇచ్చిన ఆయుధం అని ప్రతి ఒక్కరు తమ ఓటును ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలి అన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు ఒక ఆయుధం

**ప్రజాపక్షం/కృష్ణ :** ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రతి ఏటా జనవరి 25వ తేదీన దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయ సిబ్బంది. అంగన్వాడీ సిబ్బంది, మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల సిబ్బంది, గ్రామ ప్రజలు, రాజకీయ నాయకులు, విద్యార్థులు గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి, ఓటు హక్కుపై అవగాహన కల్పించి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు దండు శేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్థంభం ఓటని, భారత దేశ పౌరులుగా, ఓటరుగా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవికుమార్, వార్డు సభ్యులు తాయప్ప, జిపిఒ సునీత, బిఎల్ఒలు కవిత, సునీత, వెంకటేశ్వరమ్మ, రాజకీయ పార్టీ నాయకులు దండు రాఘవేంద్ర నరేందర్, శివ హన్మంతు, రంగప్ప, సిబ్బంది మహాదేవ, భీరప్ప, శిరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ముఖ్యమంత్రి సహకారంతో మహబూబ్‌నగర్ అభివృద్ధి

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో దిశానిర్దేశం, సంపూర్ణ సహకారంతో మహబూబ్‌నగర్ నగరంలో గత రెండు సంవత్సరాలుగా గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నగరంలోని అరుంధతి భవన్‌లో అరుంధతి బంధు సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, క్యాలెండర్‌ను ఆవిష్కరించి, మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను తెలంగాణలోనే అగ్రగామి నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత, మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్‌పి.వెంకటేశ్, అరుంధతి బంధు సేవా సమితి అధ్యక్షులు జుట్ల హన్మంతు, కార్యదర్శి లింగాల రాములు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**రూ.3 కోట్లతో 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్..**





మహబూబ్‌నగర్ నగరంలోని పాత పాలమూరు బాలాజీనగర్ ప్రాంతంలో రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మా రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఇ బీమా నాయక్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన...**

మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని 20వ డివిజన్‌లో జనరల్ ఫండ్ నుంచి మంజూరైన రూ.8లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని శంకుస్థాపన చేశారు.

అనంతరం కాలనీలో ఉన్న పార్కును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ రోజా తిరుమల వెంకటేష్, వెంకట్ నర్సయ్య, ఉమ్మడి పురుషోత్తం నాచా శ్రీను, గంజి ఆంజనేయులు, శివకుమార్, రజిని పాల్గొన్నారు.

## అధునాతన ఆసుపత్రులు ఏర్పాటు అభినందనీయం

ప్రైవేట్ ఆసుపత్రిని ప్రారంభించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి






**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** వనపర్తి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ట్రో లివర్ ప్యాంక్రియాస్, ఎండోస్కోపి కేంద్రాన్ని ఆదివారం వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. వనపర్తి పట్టణంలో నూతనంగా గ్యాస్ట్రో లివర్ ప్యాంక్రియాస్, ఎండోస్కోపి కేంద్రాన్ని ఏర్పాటు చేసిన డాక్టర్ కిరణ్ కుమార్ ఎమ్మెల్యే అభినందించారు. దినదిన అభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణానికి రోజు లక్షల సంఖ్యలో ప్రజలు వస్తూపోతూ ఉంటారని, అభివృద్ధి చెందుతున్న ఇలాంటి పట్టణాల్లో అధునాతన ఆసుపత్రులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎక్కువగా నిరుపేదలు ఉంటే ఈ ప్రాంతంలో బాధితులు నాణ్యమైన వైద్యాన్ని అందిస్తూ, వైద్యాన్ని వ్యాపారంతో కాకుండా సేవా భాగంగా భావంగా భావించి ప్రజలకు ఆయన వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సాయినాథ్ రెడ్డి స్థానిక కౌన్సిలర్లు, పి.జె బాబు, తిరుమల మహేష్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

**డోలారోహణ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే**

పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన కుప్పిరెడ్డి బాల్‌రెడ్డి, మౌనిక కుమారుడు రియాన్స్ రెడ్డి డోలారోహణ కార్యక్రమానికి ఆదివారం వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిన్నారి బాబును ఆశీర్వదించారు. పిల్లల జీవితాన్ని చెరిగిపోని కొన్ని సందర్భాలను ఈ విధంగా చేసుకోవడం ద్వారా వారి భవిష్యత్తులో ఇలాంటివి తీపి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డోలారోహణ వేడుకకా చేసిన చిన్నారి తల్లిదండ్రులను ఎమ్మెల్యే అభినందించారు.

కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్లు పెద్దమందడి, కార్యకర్తలు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## మాడ్గుల భారతమకు ఘన నివాళి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలపరిధిలోని గోకారం గ్రామంలో ఆదివారం సిపిఐ మండలనాయకులు మాడ్గుల నర్సింహ్మా సతీమణి మాడ్గుల భారతమ్మ చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్‌లు నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐజిల్లా నాయకులుడాక్టర్ చిలువేరు శ్రీనివాసులు, శివశంకర్, పులిజాల పరుషరాములు, నాగయ్య, కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు

**ప్రజాపక్షం/వంగూర్ :** మండలపరిధిలోని గాజర గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అనంతరం రథోత్సవ వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయంనుండే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందికలగకుండా గ్రామసర్పంచ్ శ్రీపతిరావు అన్ని ఏర్పాట్లను చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రాబోయేరోజుల్లో ఆలయాన్ని మరింత అభివృద్ధిపరుస్తామని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/మక్తల్ :** లయన్స్ క్లబ్ ఆఫ్ మక్తల్ భీమా ఎం.కె సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మహబూబ్ నగర్ వారి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ సత్య ఆంజనేయులు అధ్యక్షతన ప్రోగ్రాం చైర్మన్ లయన్ రమేష్ రావ్ ఆధ్వర్యంలో జక్లేర్ గ్రామంలో డాక్టర్ కుమార్ ఎంబిబిఎస్,ఎండి, వారి బృందం దాదాపు 600 మంది కి ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు సిరప్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జక్లేర్ గ్రామ సర్పంచ్ నిర్మల బాయ్, మాధవరావు, గ్రామ పెద్దలు, స్కూల్ హెడ్మాస్టర్ వి. నరసింహులు ఎం.కె హాస్పిటల్ సిబ్బంది, లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు కొండయ్య, ట్రెజరర్ ఆదేం సత్యనారాయణ, అనుగొండ శ్రీనివాసులు, ఎస్. రమేష్ రావు, యాలాల విరేశం, తంగిడి నాగరాజు, గవినోళ్ల ,జైపాల రెడ్డి, పృథ్వీ రాజ్, బి. అంబాదాస రావు, రవికుమార్ గౌడ్, డాక్టర్ విక్రమ్ భార్గవ్ రాణా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

25 మక్తల్ 3ఎ

## డిండి పేరుతో గండి కొడితే సహించేది లేదు

సిఎం రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకొని డిండి ఎత్తిపోతల ప్రాజెక్టును రద్దు చేయాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ :** గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి వల్ల మహబూబ్ నగర్ జిల్లా రైతాంగానికి తీవ్రమైన నష్టం కలుగుతున్నదని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు హనీఫ్ అహ్మద్ ఆవేదన వ్యక్తం చేశారు. డిండి ప్రాజెక్టు పేరుతో పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి గండి కొడితే సహించేది లేదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే సాగునీటి ప్రాజెక్టుల పై జోక్యం చేసుకొని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించాల్సిన ఆరో రిజర్వాయర్ లక్ష్మీ దేవి పల్లి రిజర్వాయర్ పనులను చేపట్టాలని కోరారు. నల్గొండ జిల్లా రైతాంగానికి సాగునీటిని ఇచ్చేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. నల్గొండ జిల్లాలోని బస్వాపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని తరలించి నల్లగొండ, దేవర కొండ, మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ ద్వారా కూడా నల్గొండ జిల్లాకు సాగునీరు తాగునీరు ఇవ్వవచ్చని తెలిపారు. అలాంటి ప్రయత్నాలు చేయకుండా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని నీటిని అమ్రాబాద్ ఎత్తిపోతలకు తరలించి అక్కడి నుండి దేవర కొండ నియోజకవర్గం ద్వారా నల్గొండ రైతులకు సాగునీటిని అందించేందుకు డిండి ఎత్తిపోతల పథకాన్ని తెరమీదకి తెచ్చారని తెలిపారు. అప్పర్ లెవెల్ డిండి, మిడ్ లెవల్ డిండి, లోయర్ లెవెల్ డిండి పథకాలుగా చేపట్టి పాలమూరు రంగారెడ్డి రైతుల నోట్లో మట్టి కోట్టేందుకు నల్లగొండ జిల్లా నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మహబూబ్ నగర్ జిల్లా వాసిగా సీఎం రేవంత్ రెడ్డి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు కు జరుగుతున్న అన్యాయాన్ని సరి చేయకపోతే తరతరాలుగా ఇక్కడి రైతాంగం తీరని వేదనకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పార్టీలకు అతీతంగా ఉద్యమించి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను రెండో అవకాశంగా జూరాల ప్రాజెక్టు ద్వారా నీటిని తీసుకునే విధంగా రూపకల్పన చేసి సాధించుకోవాలని కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మహబూబ్ నగర్ రైతుల పక్షాన తమ గళం విప్పాలని, కృష్ణా నదిలో నీటి హక్కును సాధించుకోవాలని హనీఫ్ అహ్మద్ పిలుపునిచ్చారు.

## గ్రామ భారతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో 'ఎన్ఎంఎన్ఎఫ్' కార్యక్రమం




**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లాలో భారత ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయ విస్తరణలో భాగంగా నేషనల్ మిషన్ ఆన్ నాచురల్ ఫార్మింగ్ సాదన కొరకు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామ భారతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎన్ఎమ్ఎన్ఎఫ్ 5 రోజుల ముగింపు కార్యక్రమం 25 జనవరి 2026 రోజున ఘనంగా గ్రామ భారతి నారాయణపేట గౌరవ అధ్యక్షులు జయచంద్ర మోహన్ వ్యవసాయ క్షేత్రంలో ముగిసింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి జాన్ సుభాకర్, సభను ఉద్దేశించి కృషి సఖీలకు నారాయణపేటలో ప్రకృతి వ్యవసాయ విస్తరణకు వారి బాధ్యతలు, అలాగే ప్రతి నెల వారికి గౌరవవేతనంతో పాటు ఇంకా ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయని విషయాలు తెలిపారు. ముఖ్య అతిథులుగా గ్రామ భారతి గౌరవాధ్యక్షులు, నాబార్డు పూర్వ సిజియం పాలాది మోహనయ్య , గ్రామ భారతి అధ్యక్షులు మోటూరి సూర్యకళ కృషి సఖీలను ఉద్దేశించి ఈ కార్యక్రమం ప్రతి నెల జయచంద్ర వ్యవసాయ క్షేత్రంలో ఇకముందు కూడా కొనసాగుతుందని, దీని వాళ్ల నారాయణపేట జిల్లా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందటం, దీనికి మన ప్రభుత్వం మహిళలకు శిక్షణ ఇచ్చి ముందంజలో ఉంచడం వ్యవసాయ విధానంలో పెనుమార్పుకు దారి తీస్తుందని హర్షం వ్యక్తం చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న కృషి సఖీలకు ధృవీకరణ పత్రాలను ప్రకృతి వ్యవసాయ పుస్తకాలను సాహిత్యాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రఘోత్తమ ఆచార్యులు, భారతీయ కిసాన్ సంఘ్ వెంకోబ, గ్రామ భారతి నారాయణపేట ప్రధాన కార్యదర్శి మన్నపురం సత్యనారాయణ, దేవేందర్ రాజు, ముకుందా రెడ్డి, జ్ఞానేశ్వర్, శిక్షకులు రాజేష్, పాలమూరు గ్రామ భారతి అధ్యక్షులు రాజనరసింహ, నారాయణపేట రైతులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ఓ సెక్యులర్ పార్టీ

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట** : కాంగ్రెస్ ఓ సెక్యూలర్ పార్టీ అని మైనార్టీలకు పెద్దపీట వేస్తోందని ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలు చూస్తున్నారని, ఈ అభివృద్ధియే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించి తీరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతేగాక మైనార్టీలంతా ఏకతాటిపై ఉండి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 34వ వార్డులోని మాజీ కౌన్సిలర్ యూసఫ్‌తోపాటు సుమారు 50 మంది కార్యకర్తలు వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్‌ల సమక్షంలో పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ ఆధ్వర్యంలో చేరగా సర్వోత్తమ్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌస్, సాజిద్ నీడ్స్, ఖాజా యూసుఫుద్దీన్, ఖమ్రుద్దీన్, ఇమ్రానుద్దీన్, శంసోద్దిన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కళ్లల్లో ఆనందమే ప్రభుత్వ ధ్యేయం


### గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం మాందాపురం గ్రామంలో నూతనంగా 25 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాందాపురం సర్పంచ్ దంతూరి యాదమ్మ ఆంజనేయులు గౌడ్‌తో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందని పేద ప్రజల కళ్ళలో ఆనందం చూడడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం 10 లక్షల వ్యయంతో నిర్మించనున్న మహిళా సంఘ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు గరిసె రవి, మాజీ ఎంపీటీసీ వంగాల అశోక్ గౌడ్, బత్తిని సహదేవ్ గౌడ్, మాందాపురం ఉప సర్పంచ్ కుసంగి రాములు, వార్డ్ మెంబర్లు గ్రామపంచాయతీ స్థల దాతలు సోలిపురం ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రథమ పూజిత మహా గణపతి పూజతో ఉత్సవశోభ

### బ్రహ్మోత్సవాలు ప్రారంభించిన ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి** : తెలంగాణలో రెండవ శ్రీశైలంగా ప్రసిద్ధక్షేత్రంగా పేరొందిన చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభంతో చెర్వుగట్టుకు ఉత్సవ శోభ సంతరించుకుంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథులుగా హాజరై బ్రహ్మోత్సవాలను లాంఛనంగా ప్రారంభించారు. అతిథులకు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ,ఆలయ ఈ వో మోహన్ బాబు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.అనంతరం దేవాలయ మహా మండపంలో యాగ్నికులు సుబ్రహ్మణ్య దీక్షితావదాని మంగళ వాయిద్యాల నడుమ ఉత్సవాల కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మొదట యాగ ప్రదక్షణ, గణపతి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో చెర్వుగట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ వారాల రమేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, ధర్మకర్తలు, యువజన నాయకుడు వడ్డే భూపాల్ రెడ్డి,స్థానిక సర్పంచ్ నేతగాని కృష్ణ, నాయకులు శశిధర్ రెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ నిర్బంధమే రాజేష్ ప్రాణం తీసింది

### ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సూర్యాపేట జిల్లాలో సంచలనం సృష్టించిన కర్ల రాజేష్ మృతి కేవలం పోలీసుల అక్రమ నిర్బంధం వల్లే జరిగిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం హుజూర్‌నగర్ పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవనంలో నిర్వహించిన అఖిలపక్ష నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోదాడ పట్టణానికి చెందిన కర్ల రాజేష్ మృతికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, బాధితుల తరుపుననాయకులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై తక్షణమే ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్ ) ఏర్పాటు ఏసి పోలీస్‌శాఖ గౌరవాన్ని కాపాడాలని వారు డిమాండ్ చేశారు. విచారణలో పారదర్శకత ఉండాలంటే, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఏ ఒక్క పోలీస్ అధికారి (హోంగార్డు నుండి ఎస్పీ వరకు)సీట్ బృందంలో ఉండకూడదని వారు డిమాండ్ చేశారు. ఇతర జిల్లాలకు చెందిన నిష్పక్షపాత అధికారులతో విచారణ జరిపించాలని డిజిపిని కోరారు.

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మౌనం వీడాలి..?** సూర్యాపేట జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉన్నారని వారు ప్రశ్నించారు. గతంలో మరియమ్మ లాకప్‌డెత్ జరిగినప్పుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పోలీసుల అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడామని, గవర్నర్, ముఖ్యమంత్రికి లేఖలు కూడా రాశామని పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు....?** సురేష్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని బాధితులకు ప్రభుత్వం అండగా ఉండి న్యాయం చేయాలన్నారు. ఒక వేళ ప్రభుత్వం త్వరితగతిన స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర నాయకులు శానంపూడి సైదిరెడ్డి, బొబ్బా భాగ్యరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జక్కుల నాగేశ్వరరావు, బెల్లకొండ అమర్‌గౌడ్, నాయకులు దూళిపాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఓటుహక్కు శక్తివంతమైన ఆయుధం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఓటు హక్కు శక్తివంతమైన ఆయుధమని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.16 వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ఓటు హక్కు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని,ప్రతి ఓటరు చైతన్యం కావాలన్నారు.దేశంలో యంగ్ ఇండియన్స్‌ను చైతన్యం చేసేందుకు వివిధారకాల ఓటరు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలి గ్రామ పంచాయతీ ఎన్నికలలో జిల్లాలో80 శాతం ఓటర్లు ఓటు వేశారని,అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ లో 60 శాతం ఓటర్లు మాత్రమే ఓట్లు వేశారన్నారు. జిల్లాలో గ్రామ స్థాయిలో ని ప్రతి ఓటరు ను నమోదు చేసి ఎస్ఐఆర్ 74 శాతంపూర్తి చేసినందుకు జాతీయస్థాయిలో అవార్డు రావడం పట్ల ఈఆర్వోలను, బిఎల్ఓ లను అభినందించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సండే సైకిల్ అనే నినాదంతో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రారంభిస్తూ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు అవగాహనతో పాటు, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి,రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ప్రభాకర్, ఈఆర్వోలు, బిఎల్ఓలు,విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.



### ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలి : కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫారం 6 ద్వారా ఓటు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంతకుముందు సూర్యాపేట జిల్లా అధికారులు, సిబ్బంది, స్కూల్, కాలేజీ విద్యార్థులు, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ క్యాడట్లు మందడి ఏవిన్యూ నుండి ఓటు యొక్క ప్రాముఖ్యత తెలియజేస్తూ ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ చేరుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఫారం 6 ద్వారా కొత్త ఓటర్ల నమోదు కోసం కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలకు ప్రశంసా పత్రాలు, షిల్డ్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ వేణుమాధవ్, డిఇఓ అశోక్, డిఎస్‌పి ప్రసన్నకుమార్, సామాజిక పర్యావరణవేత్త సత్యనారాయణ, తహశీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.



### ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తించాలని స్థానిక సంస్థల, రెవిన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు సూచించారు. ఆదివారం జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి పట్టణ పుర విధులగుండా ర్యాలీ నిర్వహించారు. 16వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని, ర్యాలీలో జిల్లా అధికారులు, సీనియర్ సిటిజన్స్, ప్రజా ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## రాళ్ల జనగాంలో 'పులి' కలకలం దూడ మృతి!

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### డ్రోన్ కెమెరాలతో గాలింపు చేపట్టాలని అధికారులకు ఆదేశం



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదగిరిగుట్ట మండలం రాళ్ల జనగాం గ్రామ పరిధిలో పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. గ్రామ శివార్లలోని ఓ వ్యవసాయ బావి వద్ద పులి దాడి చేసి ఒక దూడను హతమార్చింది. ఈ విషయం తెలియగానే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య వెంటనే స్పందించి, సంఘటనా స్థలాన్ని స్వయంగా పరిశీలించారు. పులి దాడిలో పశువును కోల్పోయిన బాధిత రైతును ఎమ్మెల్యే పరామర్శించారు. ప్రభుత్వం తరపున బాధిత రైతుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం అటవీ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఎవరూ భయపడవద్దు, కానీ అప్రమత్తంగా ఉండాలని, పులి జాడను కనిపెట్టేందుకు డ్రోన్ కెమెరాలు, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టాలని అధికారులను ఆదేశించాం. బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రామంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఎమ్మెల్యే గ్రామస్తులకు రైతులు, కూలీలు చీకటి పడకముందే ఇళ్లకు చేరుకోవాలి. పశువులను రాత్రి వేళల్లో సురక్షితమైన పాకలలో ఉంచాలి. ఒంటరిగా అటవీ ప్రాంతం లేదా వ్యవసాయ బావుల వద్దకు వెళ్లకూడదు. ప్రస్తుతం అటవీ శాఖ అధికారులు గ్రామంలో మొహరించి, పులి అడుగుజాడలను బట్టి అది ఏ ప్రాంతానికి వెళ్లిందో గుర్తించే పనిలో పడ్డారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట టౌన్ సిఐ భాస్కర్, దాతరుపల్లి సర్పంచ్ సరిత భాస్కర్, రాళ్ల జనగాం సర్పంచ్ తుమ్మల జ్యోతినాగరాజు, మాజీ సర్పంచ్ తెలుజూరి శ్రీశైలం, వార్డు మెంబర్లు పాండురాజు కమలాకర్, తుమ్మల సురేష్, తుమ్మల లక్ష్మణ్, పొన్నాల పాండు, జిల్లా ఈదాలు, బాల్రాజ్, రైతులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

### పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా:మంత్రి

**ప్రజాపక్షం/నల్లగొండ** : మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో 48 డివిజన్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు,గ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పోటీ చేసే పలువురి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల పేర్లను ఆదివారం మంత్రి ప్రకటించారు.ఈసందర్భంగా కార్పొరేషన్‌లోని 6వ డివిజన్లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టి 25,41,19 డివిజన్‌లో నిర్వహించిన కార్యక్రమాలలో పాల్గొన్నారు.అనంతరం మంత్రి మాట్లాడుతూ ఫిబ్రవరిలో జరిగే కార్పొరేషన్ ఎన్నికలలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలన్నారు.మున్సిపల్ కార్పొరేషన్‌లోని 48 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్నందున పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఎ హఫీజ్ ఖాన్,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి,మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు జూలకంటి శ్రీనివాస్,కర్నాటి కరుణాకర్ రెడ్డి, కేసాని వేణుగోపాల్ రెడ్డి,గోగుల గణేష్,లోకేశ్వరి రెడ్డి,కత్తుల వెంక పాల్గొన్నారు.

## పోలీస్ పరేడ్ గ్రౌండ్ సిద్ధం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. జనవరి 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా పోలీసు కార్యాలయం నందు నూతన పరేడ్ గ్రౌండ్ సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం గణతంత్ర దినోత్సవ పరేడ్ (ప్రాక్టీస్) రిహార్సల్‌ను ఎస్‌పి పరిశీలించారు. అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని వేడుకలకు హాజరయ్యే పౌరులకు అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. పరేడ్ కమాండర్‌గా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ వ్యవహరించ నున్నారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పి జనార్థన్ రెడ్డి, డిఎస్‌పి నరసింహారావు, పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, ఆర్‌ఐలు ప్రవీణ్ కుమార్, జానయ్య, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

## హెల్మెట్ ప్రాణ రక్షణ కవచంలా భావించాలి

### మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్‌రాజు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను, ఫోర్ వీలర్ నడిపేవారు సీట్ బెల్ట్‌ను భారంలా కాకుండా ప్రాణరక్షణ కవచంలా భావించాలని మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో నిర్వహించిన జనయేత్రి ఫౌండేషన్ ఐదవ వార్షికోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆస్తులు కాదు మంచి సంస్కారం ఇవ్వాలన్నారు. ఒక చిన్న నిర్లక్ష్యం కుటుంబం మొత్తాన్ని కోలుకోలేని విధంగా దెబ్బ తీస్తుందని అన్నారు. జనయేత్రి ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలకు పోలీసుల సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ప్రజలందరు పోలీసువారికి సహకరించి, ప్రయాణాల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ప్రపంప ప్రఖ్యాత బ్లడ్ డోనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ జనయేంత్రి ఫౌండేషన్ విద్యా, వైద్యంలో మరిన్ని సేవలు అందించాలన్నారు. యువత రక్తదానాలు చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. హాస్య నటుడు సుమన్ శెట్టి మాట్లాడుతూ గతంలో డాక్టర్లే దేవుళ్లుగా భావించేవారని, ప్రస్తుతం పేద ప్రజలకు ఫౌండేషన్ ద్వారా సేవలు అందిస్తున్న వారే నిజమైన దేవుళ్లని అన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అహ్మద్ మాట్లాడుతూ కుల, మత, వర్గ, వైషమ్యాలకు తావు లేకుండా సహృదయంతో సేవానిరతిని పాటిస్తూ నిస్వార్థంగా పేదలకు, నిరుపేద విద్యార్థులకు, రోగులకు, ఆర్తితో తల్లడిల్లే అభాగ్యులకు సహాయ, సహకారాలు ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నామన్నారు. రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ సాజిదా ఖాన్, లింగారెడ్డి, అజ్మత్‌ఖాన్, శ్రీనివాస్‌రావు, చిలుముల బాల్‌రెడ్డి, పొనుగోటి హనుమంతరావు, జాజాల కృష్ణ, దయాకర్‌రెడ్డి, సయ్యద్ అజ్మత్, గాదె నరసింహ, కోట సైదులు, కిశోర్‌కుమార్, తాజ్ బాబా పాల్గొన్నారు.

## యూరియా బుకింగ్ యాప్‌ని మండలానికి పరిమితి చేయాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** గత డిసెంబరు 20 నుండి బుకింగ్ ద్వారా యూరియా రైతులు బుక్ చేసుకోవాలని ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ వలన రైతులకు చాలా ఇబ్బందికరంగా మారడంతో రైతులు రైతు సంఘాల నాయకులు ధర్నాల ద్వారా జిల్లా మంత్రి సూచన మేరకు వ్యవసాయ అధికారులు జిల్లా కాకుండా నియోజకవర్గం వారిగా యూరియా యాప్ ద్వారా తెచ్చు కోవాలని ప్రకటించారు.నియోజకవర్గమని నిబంధన ఎత్తివేసి ఏమండలానికి ఆ మండలం రైతులకు యూరియా సప్లై చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి గురుజ రామచంద్రం డిమాండ్ చేశారు. రైతులు ఒక్క బస్తా రెండు బస్తాలకు నియోజకవర్గంలో ఏం మండలానికి పోవాలన్నమునుగోడు నుండి మర్రిగూడెం పోవాలంటే సుమారు 40 కిలోమీటర్లు దూరం పోవాల్సిన అవసరం ఉంటుందని వేరే మండలానికి రైతులు పోవడానికి అందరికీ వాహన సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలు కిరాయికి తీసుకొనిపోతే కిరాయి భారం రైతులకు పడుతుందన్నారు.

## ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో ఉన్న ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రెస్‌క్లబ్ సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా చింతారెడ్డి గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కె గులాం హుస్సేన్, ఉపాధ్యక్షులుగా రమణ, రాకేష్, సహాయ కార్యదర్శిగా షేక్ అబ్దుల్ రహీం, కోశాధికారిగా రాజశేఖర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. వారితో పాటు గౌరవాధ్యక్షులుగా వై ప్రసాద్, గౌరవ సలహాదారులుగా ఎస్‌కె మక్బూల్ పాషా, కార్యవర్గ సభ్యులుగా సంజీవరెడ్డి, ఉదయ్ కుమార్, వీరబాబు, నరేందర్ రెడ్డి, మోతిరామ్, నరేష్, హనుమా రెడ్డి, నబి, రసూల్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు గోపిరెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరుడుతూ, ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడమే ప్రెస్‌క్లబ్ ప్రధాన లక్ష్యమన్నారు. సభ్యులందరి సహకారంతో ప్రెస్‌క్లబ్‌ను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు.

# చైర్మన్ పీఠానికి బిఆర్ఎస్‌లో పోటాపోటీ

### డజన్‌కు పైగానే ఆశావహులు

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల్లో తమసత్తా చాటాలని బిఆర్ఎస్ తహతహ లాడుతుంది. మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజగ వర్గంలోని సూర్యాపేట మున్సిపాలిటిపై గులాబి జెండా ఎగురవేయాలని పావులు కదుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల కన్నా ఆ పార్టీకి సూర్యాపేట పట్టణంలో మరింత పట్టు ఉంది. దీంతో చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు కూడా ఎక్కువగా ఉండడంతో తీవ్ర పోటీ నెలకొన్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి మూడు సార్లు జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఆ పార్టీ నుండి జగదీష్ రెడ్డి వరుసగా శాసనసభ్యునిగా ఎన్నికై హ్యాట్రిక్ సాధించారు. మొదటి నుండి పట్టణ ఓటర్లు అధికంగా బిఆర్ఎస్ వైపు ఎక్కువగా మొగ్గు చూపడంతో ఆయనను విజయం వరించిందన్నది స్పష్టమవుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత నియోజక వర్గ కేంద్రంగా ఉన్న సూర్యాపేటను జిల్లాగా మార్చేందుకు ఆయన చేసిన కృషి ఎంతో ఉంది. పదేండ్ల పాలనలో సూర్యాపేట పట్టణంలో వేల కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపట్టి పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చారు. ఆయన చేసిన అభివృద్ధి పనులు కండ్ల ఎదుట కనబడుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 26 నెలలు దాటినా పట్టణంలో జరుగాల్సిన అభివృద్ధి అంతా నిలిచిపోయిందని ప్రజలు వాపోతున్నారు.




2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసిన బిఆర్ఎస్ అభ్యర్థులకు ఎదురుగాలి వీచి చాలా మంది ఓటమి పాలయ్యారు. సూర్యాపేట నియోజకవర్గంలో ముచ్చటగా మూడవ సారి పోటీ చేసిన జగదీష్ రెడ్డిని మాత్రం ఓటర్లు అక్కున చేర్చుకొని ఆదరించడంతో విజయం సాధించారు. నియోజక వర్గంలో ఆ పార్టీకి చెందిన నాయకులు కొంతమంది కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ వీడినా... కీలక నేతలు పార్టీని వీడలేదు. జగదీష్ రెడ్డి నాయకత్వంపై వారికి ఉన్న నమ్మకంతోనే ఆయన వెంట నడుస్తున్నారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**'పోటీ' రేసులో గండూరి ప్రకాష్...**

బిఆర్ఎస్‌లో మున్సిపల్ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు డజన్‌కుపైగానే ఉన్నారు. ఇందులో ప్రధానంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళిక భర్త ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు గండూరి ప్రకాష్, మరో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, 33వ వార్డు మాజీ కౌన్సిలర్ కొండపల్లి భద్రమ్మ భర్త సాగర్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు కొండపల్లి శ్రవణ్ రెడ్డి, 42వ వార్డు మాజీ కౌన్సిలర్ అంగిరేకుల రాజశ్రీ భర్త ప్రముఖ విద్యావేత్త అంగిరేకుల నాగార్జున, 39వ వార్డు మాజీ కౌన్సిలర్ మొరిశెట్టి సుధారాణి భర్త ప్రముఖ వ్యాపారి మొరిశెట్టి శ్రీనివాస్, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ చైర్‌పర్సన్ ఉప్పల లలిత భర్త ప్రముఖ వ్యాపారవేత్త ఉప్పల ఆనంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మన్నెం సదాశివరెడ్డి ఫంక్షన్ హాల్ అధినేత మన్నెం సదాశివరెడ్డి, ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి గుర్రం సత్యనారాయణ రెడ్డి, సూర్యాపేట బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్య క్షులు, ప్రముఖ వ్యాపారి అంతటి విజయ్ కుమార్ తోపాటు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకులు చింతలపాటి చినశ్రీరాములు మాదిగ, 19వ వార్డు మాజీ కౌన్సిలర్ సుంకరి అరుణ భర్త ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి సుంకరి రమేష్‌లు చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. వీరికి జనబలంతో పాటు ఆర్థిక బలం కూడా ఉండడంతో ఆ పార్టీలో చైర్మన్ పీఠం తమకే కావాలని పట్టుబడుతున్నారు. చైర్మన్ అభ్యర్థిగా తమ పేరును ప్రకటిస్తే మున్సిపాల్టీలోని 48 వార్డుల్లో పోటీ చేస్తున్న పార్టీ అభ్యర్థుల మంచి చెడు తామే చూసుకోవడంతోపాటు వారి గెలుపు బాధ్యతలు కూడా తమవే అంటూ తమ నాయకుడు మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డికి చెబుతున్న పరిస్థితి. చైర్మన్ స్థానానికి తీవ్ర పోటీ ఉండ దంతో ఆయన ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఫిబ్రవరి 6న 'స్కై' విడుదల మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి, ఆనంద్ ప్రధాన పాత్రల్లో వేలార్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీ కృష్ణంరాజు, పృథ్వీ పెరిచర్ల నిర్మిస్తున్న సినిమా 'స్కై'. పృథ్వీ పెరిచర్ల దర్శకత్వం వహిస్తున్నారు.

# రీల్

## సాధారణ టికెట్ రేట్లతో ఓం శాంతి శాంతి శాంతిః




మల్టీ ట్యాలెంటెడ్ తరుణ్ భాస్కర్ లీడ్ రోల్‌లో నటిస్తున్న హిలేరియస్ విలేజ్ కామెడీ ఎంటర్ టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః. ఈషా రెబ్బా హీరోయిన్ గా నటిస్తున్నారు. ఏ ఆర్ సజీవ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బ్యానర్స్ పై సృజన్ యరబోలు, ఆదిత్య పిట్టీ, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్ , నవీన్ సనివరపు ఈ సినిమాను నిర్మిస్తుండగా, కిషోర్ జాలాది, బాల సౌమిత్రి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఓం శాంతి శాంతి శాంతిః జనవరి 30న రిలీజ్ కానుంది. ఈ మధ్య కాలంలో ప్రతి సినిమాకు టికెట్ ధరలు పెంచుకోవడం ఆనవాయితీగా వస్తున్న నేపధ్యలో ఈ సినిమాకు మాత్రం సాధారణ టికెట్ ధరలే అందుబాటులో ఉన్నాయని నటుడు తరుణ్ భాస్కర్ చెప్పారు. సింగిల్ థియేటర్ లో 99 రూపాయలు, మల్టీ ప్లెక్స్ లో 148 రూపాయలకు మాత్రమే తమ సినిమా చూడొచ్చని ఆయన తెలిపారు. మలయాళంలో హిట్ అయిన ఓ సినిమాను తీసుకుని రీమేక్ చేసిన ఈ సినిమా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా తెరకేక్కిన్చామన్నారు. ఈషా రెబ్బ హీరోయిన్ గా నటించిన ఈ సినిమాలో బ్రహ్మాజీ కీలకమైన పాత్రను పోషించారు.

## త్వరలో నితిన్ 36వ సినిమా షూటింగ్ ప్రారంభం

వైవిధ్యమైన సినిమాలు, పాత్రలతో తనదైన గుర్తింపు సంపాదించుకున్న హీరో నితిన్ తన 36 సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. వెర్సటైల్ డైరెక్టర్ వి.ఐ.ఆనంద్ దీనికి దర్శకత్వం వహించనున్నారు. పవన్ కుమార్ సమర్పణలో సక్సెస్ఫుల్ బ్యానర్ శ్రీనివాస సిల్వర్ స్క్రీ శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రథ సప్తమి సందర్భంగా సైఫై ఎంటర్టైనర్ సంస్థ ఈ ప్రకటన చేసింది. విభిన్నమైన కథలు, కథనాలతో సినిమాలను రూపొందించే దర్శకుడు వి.ఐ.ఆనంద్ మరోసారి ఈ భారీ ప్రాజెక్ట్ కొ క్రియేటివ్ బౌండరీస్ రేంజ్‌ను మరింత పెంచటానికి సిద్ధమయ్యారు. ఊరు పేరు భైరవకోన చిత్రం తర్వాత దర్శకుడు ఆనంద్ తాయారు చేసుకున్న కథతో ముందుకు వస్తున్నాడు. ఆదివారం రథ సప్తమి సందర్భంగా ఈ సినిమాను అధికారికంగా అనౌన్స్ చేశారు. త్వరలోనే షూటింగ్ స్టార్ట్ కానుంది. టాలెంటెడ్ హీరో, వైవిధ్యంగా సినిమాను తెరకెక్కించే దర్శకుడు, గ్రాండ్‌గా సినిమాను నిర్మించే సంస్థ కలయికలో తెరకెక్కబోయే ఈ సైఫై ఎంటర్టై నర్ నితిన్ కెరీర్‌లో అత్యంత ఆసక్తికరమై ప్రాజెక్టలను ఒకటిగా మారనుందని నిర్మాత భావిస్తున్నారు.నితిన్ 36వ సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.




## పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉస్తాద్ భగత్ సింగ్



పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా సిని మా ఉస్తాద్ భగత్ సింగ్. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇంతకు ముందు వచ్చిన గబ్బర్ సింగ్ సినిమా ఎంతటి బ్లాక్ బస్టర్ హిట్ అయిందో అంతకంటే ఎక్కువ హిట్ అయ్యేలా ఈ సినిమాను తెరకెక్కించే ప్రయ త్నం చేశాడు హరీష్ శంకర్. ఈ సి నిమా షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బి జీగా ఉంది. ఇటీవల విడుదలైన దే ఖ్లేంగే సాలా.. అనే పాత బాగా పా పులర్ అయింది. ఇప్పుడు తాజా గా ఆస్కార్ అవార్డు గ్రహీత చం ద్రబోస్ రాసిన పాటను విడుదలకు సన్నాహాలు చేస్తున్నా మ ని దర్శకుడు హరీష్ శంక ర్ చెప్పారు. సినిమా అద్భుతంగా వచ్చిందని, పవన్ కళ్యాణ్ క్యారెక్టర్ చాలా గొప్పగా ఉంటుందని ఆయన తెలిపారు. పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. మరో హీ రోయిన్ సాక్షి వైద్య ఓ కీలకపాత్రను పోషిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సగీత ం అందించారు. ఆనంద్ సాయి ఆర్ట్ డైరెక్టర్‌గా పని చే శారు. వైరవి శంకర్, నవీన్ యెరేనెని ఈ సినిమాను నిర్మించారు.

## 30న 'త్రిముఖ' విడుదల



యోగేష్ కల్లె హీరోగా, సన్నీ లియోన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా 'త్రిముఖ'. ఈ చిత్రాన్ని అఖిరా డ్రీమ్ క్రియేషన్స్ బ్యానర్ మీద శ్రీదేవి మద్దాలి, రమేష్ మద్దాలి నిర్మిస్తున్నారు. ఈ మూవీకి రాజేష్ నాయుడు దర్శకత్వం వహిస్తున్నారు. ఐదు భాషల్లో ఏకకాలంలో చిత్రీకరించిన ఈ పాన్ ఇండియా 'త్రిముఖ' సినిమాని ఈ నెల 30న హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ చేయనున్నారు. 'త్రిముఖ' సినిమా డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ హైదరాబాద్ ఫిలింఛాంబర్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా నటుడు జెమినీ సురేష్ మాట్లాడుతూ స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమాలు మనకు తక్కువగా వస్తుంటాయి. అలాంటి మంచి స్క్రీన్ ప్లే బేస్డ్ సినిమా 'త్రిముఖ'. మంచి కంటెంట్ తో వస్తున్న ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది. హీరో యోగేష్ ఈ సినిమా కోసం ఎంతో కష్టపడుతున్నాడు. ఆయనకు యూఎస్ లో మంచి లైఫ్ ఉన్నా, సినిమా మీద ప్యాషన్ తో టాలీవుడ్ కు వచ్చాడు. ఇలాంటి మంచి చిత్రాన్ని మీరంతా ఆదరిస్తారని కోరుకుంటున్నా. అన్నారు.నటి సాహితీ దాసరి మాట్లాడుతూ థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో పాటు మంచి ఎంటర్ టైన్ మెంట్ ఇచ్చే చిత్రమిది. ఈ సినిమాలో నేనొక ఇంపార్టెంట్ రోల్. ఆ క్యారెక్టర్ ఏంటి అనేది ఇప్పుడు రివీల్ చేయలేము. మీరు మా మూవీ ట్రైలర్ చూస్తే కొత్త దర్శకుడు డైరెక్ట్ చేసినట్లు ఉండదు జెమినీ సురేష్ క్యారెక్టర్ కూడా సర్ ప్రైజింగ్ గా ఉంటుంది. యోగేష్ కు సినిమా మీద ప్యాషన్ ఎక్కువ. ఆయన ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డారు. ఫస్ట్ టైమ్ డైరెక్ట్ చేస్తున్న రాజేశ్ గారికి ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. సాహితీ దాసరి కూడా మంచి పాత్రలో మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. అన్నారు. డైరెక్టర్ రాజేశ్ నాయుడు మాట్లాడుతూ ఒక మంచి కథతో, బలమైన స్క్రీన్ ప్లే తో 'త్రిముఖ' చిత్రాన్ని రూపొందించాను. మూవీ ఫస్టాఫ్ అంతా ఎంటర్ టైన్ చేస్తుంది. సెకండాఫ్ తల పక్కకు తిప్పనంతగా ఎంగేజింగ్ గా థ్రిల్లింగ్ గా ఉంటుంది. సినిమాలోని ప్రతి క్యారెక్టర్‌కు ఇంపార్టెన్స్ ఉంటుంది. ప్రతి పాత్ర ఒక మంచి విషయాన్ని తెలియజేస్తుంది. రొటీన్ సినిమాలకు తప్పకుండా భిన్నంగా ఉండేలా ప్రయత్నించాం. యోగేష్ కు నటుడిగా పేరు తెచ్చే మూవీ అవుతుంది. సన్నీ లియోన్ ని ఇప్పటిదాకా గ్లామర్ యాంగిల్ లోనే చూశారు. కానీ ఇందులో చాలా డిఫరెంట్ క్యారెక్టర్ లో చూస్తారు అని చెప్పారు. హీరో యోగేష్ కల్లె మాట్లాడుతూ 'త్రిముఖ' హీరోగా నా ఫస్ట్ మూవీ. ఈ సినిమా రూపకల్పనలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. అడ్డంకులన్నీ దాటుకుని ఈ నెల 30న రిలీజ్ కు తీసుకొస్తున్నాం. కేవలం మా కంటెంట్ నచ్చి ఆయన ఒప్పుకున్నారు. కామెడీ, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉన్న కథతో ఒక కొత్త ప్రయత్నం చేశాం అని అన్నారు.

## 'జాలి పడేదెవ్వడు' పాట విడుదల

భార్యాభర్తల బంధాన్ని వివిధ కోణాల్లో చూపిస్తూ తెరకెక్కించిన చిత్రం 'పురుష:' బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వర రావు 'పురుష:' సినిమాను నిర్మిస్తున్నారు. వీరు వులవల దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతున్నాడు. తాజాగా ఈ చిత్రంలోని థీమ్ సాంగ్ అన్నట్టుగా.. మగాడి మీద జాలి కలిగేలా, మగాడి పరిస్థితిపై సానుభూతి పెరిగేలా 'జాలి పడేదెవ్వడు.. మగాడి మీద జాలి పడేదెవ్వడు' అంటూ సాగే పా టను రిలీజ్ చేశారు. ఈ పాటను ఎం. ఎం. కీరవాణి ఆలపించారు. శ్రవణ్ భరద్వాజ్ సంగీతం సమకూర్చగా, అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫర్గా సతీష్ ముత్యాల, ఎడిటర్గా కోటి, ఆర్ట్ డైరెక్టర్గా రవిబాబు దొండపాటి వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేయనున్నారు.



## 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'లో సాంగ్ రిలీజ్



పాయల్ రాధాకృష్ణ, త్రిగుణ్, అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించారు. సీహెచ్ వి ఎస్ ఎన్ బాబ్జీ సమర్పణలో లోటస్ క్రియేటివ్ వరక్స్ బ్యానర్ పై అరవింద్ మండెం నిర్మించారు. అరుణ్ చిలువేరు, ప్రకాష్ చెరుకూరి సంగీతం సమకూర్చారు. తాజాగా ఈ సినిమా యాంథమ్ సాంగ్ ని రిలీజ్ చేశారు. ఈ సాంగ్ లో కృష్ణుడు వ్యవసాయం చేస్తున్నట్లుగా చూపించిన విధానం మరింత ఆసక్తిని రేకిస్తుంది .ప్రకాశ్ చెరుకూరి అందించిన మ్యూజిక్ సాంగుకు ప్రాణం పోసింది. ఈ పాటను బాలీవుడ్ గాయకుడు బాబా సెహగల్ పాడారు. అరవింద్ మండెం సాహిత్యం అందించారు. వ్యవసాయం ప్రాముఖ్యతను మట్టి వాసనతో పాటు ఆధునిక టెక్నాలజీ టచ్ కలిపి పవర్ఫుల్గా ప్రజెంట్ చేయడంలో ఆయన లిరిక్స్ కీలక పాత్ర పోషించాయి. ఈ పాట యూత్తో పాటు ప్రతి వర్గం ఆడియన్స్కు కనెక్ట్ అయ్యేలా తెరకెక్కించారు. ఈ చిత్రానికి రవికుమార్ డీవోపీ, ఎడిటర్ కోటగిరి వెంకటేశ్వరరావు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకులు ముందుకు రానుంది.

## ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజాస్వామిక, గణతంత్ర, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ దేశంగా భారత దేశం ప్రగతి పథంలో దూసుకెళ్లాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఆధారమైన రాజ్యాంగం అమల్లోకి వచ్చిన నేడు దేశ ప్రజలందరికీ పండుగ వంటిదన్నారు. జాతీయోద్యమ నాయకులు, రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షలకు అనుగుణంగా అనేక అభివృద్ధి, సంక్షేమ, ప్రజాహిత కార్యక్రమాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.







## సమాజం మార్పు దిశగా అడుగులేయాలి

### ప్రతి ఒక్కరికీ చట్టాలు, హక్కులపై అవగాహన తప్పనిసరి

### ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి క్యాలెండర్ వార్షికోత్సవంలో జస్టిస్ చంద్రకుమార్



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రోజురోజుకు విలువలు పడిపోతున్న తరుణంలో సమాజం మార్పు దిశగా అడుగులు వేయాలని జస్టిస్ చంద్రకుమార్ సూచించారు. గ్రామ స్థాయి నుంచి ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన ఉండాలని, అప్పుడే హక్కుల పరిక్షణతోపాటు బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలమన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ (ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి) –2026 నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పుట్ట పద్మారావు, జెఎన్‌టియు, ఒయు ప్రొఫెసర్లు బిట్ల ప్రభాకర్, బి. క్రాంతి కిరణ్, వెంకట్‌దాస్, సిబిఐటి ముఖ్యసలహాదారులు ఎం.స్వామి దాస్ లతో కలిసి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాజ్యాంగం అందించిన హక్కులను ప్రజలు తెలుసుకొని న్యాయ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. అసమానతల్లేని సమాజ నిర్మాణానికి పాటుపడాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. క్రిమినల్ ప్రోసీజర్ కోడ్, కస్టడీ, అరెస్టు వంటి అంశాలపై ప్రజలు తెలుసుకోవాలని, అప్పుడే అన్యాయాన్ని ఎదిరించే ధైర్యం కలుగుతుందన్నారు. పాలకులు ప్రజలు జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్నా, ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అవుతున్నా ఇంకా 8 కోట్ల మంది బాల కార్మికులు ఉండటం సిగ్గుచేటన్నారు. కేంద్రం లక్షల ఎకరాలను అదానీ కార్పొరేట్ కంపెనీలకు దారాధాత్తం చేస్తూ దేశాన్ని లూటీ చేస్తుందని ధ్వజమెత్తారు. ప్రజలకు హక్కులపై చైతన్యం చేసేలా ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి కృషిచేయాలని సూచించారు. ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి రాష్ట్ర చైర్మన్ నవోదయ సిద్ధు మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యం నిలకడగా కొనసాగాలంటే మానవ హక్కుల పరిరక్షణ అత్యంత కీలకమన్నారు. మానవ హక్కులపై అవగాహన లేకపోవడం వల్లే అనేక అన్యాయాలు జరుగుతున్నాయని, అందుకే గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. సమావేశంలో ఐఎన్‌హెచ్‌ఆర్‌పిసి రాష్ట్ర కో–ఆర్డినేటర్ డా.డిగ్గే బాబు, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు వి.మోహన్‌రావు, కార్యదర్శులు తలారి కుమార్, సలహాదారులు ప్రశాంత్ గాంధీ, కార్యదర్శి సయ్యద్ ఫెరోజ్, సహాయ కార్యదర్శులు ఎ.ప్రదీప్ కుమార్, అందోల్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ఒక ఆయుధం

### ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కేవలం ఒక పవిత్రమైన హక్కు మాత్రమే కాదు, అది ప్రతి పౌరుడి బాధ్యత అని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో 'నూతన ఓటర్ల సమ్మేళనం' నిర్వహించారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువతీ యువకులను ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడుతూ.. అమెరికాలో అబ్రహాం లింకన్, భారతదేశంలో నరేంద్ర మోదీ వంటి సామాన్య వ్యక్తులు అత్యున్నత పదవులను అధిష్టించడమే బ్యాలెట్ శక్తికి నిదర్శనమన్నారు.










Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com